OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T84 S96 A

Name of Book

Name of Author

UNIVERSAL LIBRARY

OU_204100

UNIVERSAL LIBRARY

పాఠశాలలయందుఁ బఠనీయముగా నుండుటకు మదరాసు టెక్స్టుబుక్కు కమిటీ వారంగీకరించిరి. ఫో. సెం. జా. గెజెటు. 24—4—34.

శ్రీ

# ఆంధ్రనైషధసారము.

ఇయ్యది

సుగుణమణి, పౌండరీక మాహాత్మ్యము మున్నగు గ్రంథముల

కర్తయగు

ఉభయభాషాప్రవీణ

అత్తలూరి సూర్యనారాయణచే

రచియింపఁబడి ప్రచురింపఁబడియె.

రెండవకూర్పు.

రామకృష్ణ ప్రింటింగు వర్క్సునందు ముద్రింపఁబడియె.

1934.

సర్వస్వామ్యసంకలితము]. [వెల రు 0-12-0.

# కృతిసమర్పణము

—:o:—

నిరంజన నిర్వికార నిర్గుణుండును, ప్రపంచాధారభూతుం డును, సర్వవ్యాపకుండును, శాశ్వతుండును, నగు పరమాత్మ ప్రకృతి ననుష్ఠించి మానవుల పూజాసౌకర్య పోషణాద్యర్థము బ్రహ్మ విష్ణు మహేశ్వరు లను త్రిమూర్తులను సాకారంబునఁ గల్పి తం బొనరించి లోకవంద్యుండయ్యె. ఎవ్వారలేనియు జ్ఞాన సిద్ధి నందవలయునన్న ప్రారంభమున సగుణోపాసనయావశ్యకం బగుటచే జనంబు లాయా దైవతంబులఁ బూజించుచు సంస్మరిం చుచు జన్మసాఫల్యంబు నందుచుండిరి. నేను నట్టి యుత్సాహ ముతో నీవరకు పౌండరీక మాహాత్మ్యమును రచించి భక్తి పూర్వకంబుగ లక్ష్మీ నారాయణుని పాదపద్మముల నాగ్రంథ కుసుమంబును సమర్పించుకొంటిని, ఈమాఱునాచే గద్యరూపం బుగ వ్రాయఁబడిన యీ "ఆంధ్రనైషధసారము" అను పుష్ప రాజంబు నుమాకాంతుండగు శంకరుని పాదపద్మంబుల నధిక భక్తిశ్రద్ధలతో నర్పణం బొనరించి యనేక ప్రణామంబులఁ జేయుచున్నాడను. సర్వజ్ఞుండై సర్వైశ్వర్యములఁ దులఁదూఁగు నాశంకరుండు నాయభీష్టార్థంబుల సమకూర్చుఁగావుత.

గ్రంథకర్త.

# మొదటికూర్పు పీఠిక

ఇంతకుఁ బూర్వము సుగుణమణి, పౌండరీక మాహాత్మ్యముల రచించి ప్రచురించితి. వానియోగ్యతాదికముల గమనించి చెన్నపురి గ్రంథనిర్ణాయక సభ్యులామోదించియు, నున్నత పాఠశాలాధికారులా గ్రంథములఁ బఠనీయంబులుగా గైకొనియు నాకుఁగొంతయుత్సాహమును గల్పించిరి. అందులకు వారలకుఁ గృతజ్ఞుఁడను. మఱల నూత్న గ్రంథ రచనాకుతూహలుండనై శ్రీనాథకవివర్యునిచేఁ బద్యకావ్యంబుగా రచింపఁబడిన శృంగార నైషధము ననుసరించి గద్యరూపంబున విద్యార్థుల కుపయుక్తమగు భంగిని గూర్చి 'ఆంధ్ర నైషధసారము' అను పేర ముద్రించితి. పాఠకుల యానందము కొఱకు మాతృకనుండి గ్రహించిన పద్యము లాయాభాగంబులఁ జేర్చితి. ఈ గ్రంథమునుగూడ దద్గ్రంథనిర్ణాయక సభ్యులామోదింప గలందులకుఁ గృతజ్ఞతాపూర్వకముగఁ గోరుచున్నాఁడను. ఈ గ్రంథమును శ్రద్ధతోఁ దిలకించి తమ యభిప్రాయముల నొసంగిన పండితోత్తములకు నాయభివందనముల నందించుచున్నాఁడను.

ఇట్లు

ఈమని
10—9—23.

బుధజనవిధేయుఁడు
అత్తలూరి సూర్యనారాయణ.


# రెండవకూర్పు పీఠిక.

నాచే రచింపఁబడిన సుగుణమణి, పౌండరీకమాహాత్మ్యము, ఆంధ్రనైషధసారములును పాఠకులకుఁ జిరపరిచితములు; పాఠకుల యాదరణంబున సుగుణమణి నాలుగవ ముద్రణము నందియున్నది. పౌండరీకమాహాత్మ్యము మూఁడవకూర్పునకు సిద్ధముగానున్నది. ఆంధ్రనైషధసారము ద్వితీయముద్రణము గూర్పఁబడియున్నది. నైషధసారమును చెన్నపుర గ్రంథనిర్ణాయకసభ్యులు పాఠశాలలయందుఁ బఠనీయముగా నుపయోగించుటకు సంగీకరించిరి. కావునఁ దద్గ్రంథ నిర్ణాయకసభ్యులకు నాకృతజ్ఞతాపూర్వక వందనంబులు. ఉన్నతపాఠశాలాధికారులు నాగ్రంథములను బఠనీయములనుగా నియమించి నాచే భాషాసేవ యొనరింపఁజేయఁ బ్రార్థితులు. నా గ్రంథములనుగూర్చి భాషాభిమానులు చూపెడి యాదరణంబు ననుసరించి నూతన గ్రంథముల రచింపఁ దలంపుఁ గలిగియున్నాఁడను.

ఈమని,<br>
6—6—34.

గ్రంథకర్త.

గ్రంథకర్త



ఉభయభాషాప్రవీణ, అత్తలూరి సూర్యనారాయణ.

## ఆంధ్రనైషధసారము — పండితాభిప్రాయములు.

---

ఆంధ్రనైషధసారము:— ఇది అత్తిలూరి సూర్యనారాయణగారిచే రచియింపఁబడిన నూటనలుబదియారు పుటల వచన కావ్యము. ప్రారంభము నుండి యుపసంహారమువఱకు నొక్కరీతి చక్కని శైలిలో నిర్దుష్టముగ నున్నది. దీనిని పాఠశాలలలో బాలురకుఁ బాఠముగాఁ బెట్టి యిక్కవికిఁ బ్రోత్సాహమును గలిగించి లోకోపకారపరాయణులు గాఁగలరని పాఠశాలాధికారులకు విన్నవించుకొనుచుంటిని.

ఏలూరు,<br>15—8—23.

ఇట్లు విధేయుఁడు,<br>రాజా యం. భుజంగరావు.

---

అయ్యా !

ఆంధ్రనైషధసార మను గ్రంథము నాకు జేరినది. దీని శైలి మృదుమధుర గాంభీర్యములతో నవిగళద్ధారతో నొప్పుచున్నదని చెప్పక తీరదు. వర్ణనములు సంపూర్ణభావగర్భితములై యున్నవి. అలంకారములు మిక్కిలి సమయోచితంబుగ నుపయోగింపఁబడినవి. ఈగ్రంథము ముఖ్యముగా నున్నత పాఠశాల విద్యార్థుల కెక్కువ నుపయోగముగా నుండునని నానమ్మకము.

బోర్డుహైస్కూలు,<br>వుండి,<br>17—8—23.

చిత్తగింపవలెను.<br>ఎ. రామమూర్తి, బి. ఎ., యల్. టి.<br>ఉపాధ్యాయుఁడు.

---

అయ్యా!

మీ ఆంధ్రనైషధసారము స్కూళ్ళలో విద్యార్థులకు పఠనీయమై వారి కత్యంతోపకారకమగుననుట కేవిధమైన సందియమును లేదు. శైలి, నిర్దుష్టత, సౌలభ్యములోనగు నంశము లింతకుమున్ను రచించిన మీపుస్తకము లందే నిర్వివాద స్థితినందియున్నపు డిద్దానియందవి కలవని వ్రాయఁబూనుట పునరుక్తికదా యని యింతతో విరమించుచున్నాఁడను.

కడియము,<br>20—8—23.

చిత్తగింపుడు.<br>చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, (శతావధాని.)

---

అయ్యా!

మీరు శ్రీనాథ కృతంబగు శృంగార నైషధంబు ననుసరించి కథ హృదయంగమంబుగా రచించిన నైషధసారం బను పొత్తమును జూచితిని. నాతికష్టంబును నాతిసులభంబును గాక శైలి యెంతయు మనోహరంబుగా నున్నది. మీరు మధ్యమధ్య మాతృకనుండి చేర్చిన పద్యంబులు పాఠకుల కెంత యేని నానందమును జేకూర్పఁగలవని నానమ్మకము. వేయేల. ప్రకృతపాఠశాలల యందుండుజదువు పిల్లల కీగ్రంథ మెంతేనియు నుపకరించునని నేను నమ్ముచున్నాను.

టవున్ హైస్కూల్
గుంటూరు,
20—8—23.

ఇట్లు,
పళ్లె పూర్ణప్రజ్ఞాచార్యులు,
సంస్కృతోపాధ్యాయులు.

---

పాఠశాలల డిప్యూటీ యిన్‌స్పెక్టరుగా నుండిన విద్వాన్ జి. సోమన్న పంతులు యమ్. ఎ., యల్. టి., గారు తెలిపినది.

అయ్యా!

మీ యాంధ్రనైషధసారము కడు నాదరణీయముగ నున్నది. శైలి శ్రీనాథకృతిని జ్ఞాపకము సేయుచున్నది. భావములు లెస్సగఁ బోషింపఁ బడినవి. నైషధసారము ససారముగ నున్నది. శ్రీహర్ష శ్రీనాథుల కల్పనాశయ మింపు జాలవఱకుఁ బొడసూపుచున్నది.

విజయనగరము,
31—8—23.

ఇట్లు,
విద్వాన్ గ. సోమన్న

---

అయ్యా!

తమ యాంధ్రనైషధసారమును జాలభాగములఁ జదివితి. శైలి చక్కఁగా నున్నది. కథావిధానము సమంజసము. భాషయు సలక్షణ యుతమై యలరారుచున్నది. మూలగ్రంథమగు శృంగారనైషధమున కిది ఛాయవలెనున్నయది. విద్యార్థులకుఁ బఠనార్హగ్రంథముగ దీని నుపయోగించినఁ జాల మేలని నిశ్చయముగఁ దెలుపుచున్నాఁడను.

కడప,
2—9—23.

ఇట్లు విధేయుఁడు.
కావ్యతీర్థ జనమంచి శేషాద్రిశర్మ,
హైస్కూలు తెలుఁగు పండితుఁడు.

# ఆంధ్ర నైషధసారము.

## ప్రథమాశ్వాసము.

—:o:—

శ్రీమంతుఁడగు నలసార్వభౌముం డేకచ్ఛత్రాధిపతియై యష్టాదశద్వీపములను బ్రజానురంజకముగఁ బరిపాలించుచుండెను. ఆధీమంతుని కీర్తి సకలజనంబులు పొగడుచుండఁ త్రిజగంబుల వ్యాపించె. అమ్మహామహుఁడు ఋగ్యజుస్సామాథర్వణములను నాల్గువేదములు; శిక్షా ఛందో వ్యాకరణ నిరుక్త జ్యోతిష కల్పములను వేదాంగములు, న్యాయ పురాణ మీమాంసా ధర్మశాస్త్రములగు పదునాల్గు విద్యలు సమగ్రంబుగఁ జదివి యనుభవముకలవాఁడై యాచరణమునందుపయోగింపఁజేయుచుండెను. ఆ రాజసింహుఁడు రథసారథ్యమునం దతి ప్రవీణుఁడై యుండెను. ఆపృథ్వీశుం డింద్రాగ్ని యమ వరుణ నైరృతి కుబేరేశాన వాయుదేవులయొక్క యంశములతో విరాజిల్లుచుండు. ఆమహావీరుండు సంగరరంగముల స్వయముగఁ బోరియుఁ బోటుబంటుల బలచాతుర్యము చేతను శాత్రవుల నోడించి విమలయశంబు విశ్వంబు నిండింపఁ జేసె. ఆనృపాలకుండు తన రాజ్యంబున నతివృష్ట్యనావృష్టులు మున్నగు నీతిబాధలఁ జొరనీక ప్రజలఁ బాలించుచుండెను. ఆవదాన్యుఁడు దానమొసంగుటయం దత్యంతాసక్తుఁడై దాన

గ్రహీతలకొఱకు సతతం బెదురుచూచుచుండును. ఆతని పరాక్రమమునకు వెఱచి రాజులందఱు నమ్రులై మెలంగుచు నాతని యనుగ్రహంబునకుం బాత్రులగుచుండిరి. ఆసద్వర్తనుని రాజ్యంబున ధర్మము నాలుగుపాదముల నడచుచుండెను. ఇట్లుండ, నన్నలుండు యౌవనోపేతుండై నూనూగు మీసములం జెన్నారు వదనంబు పూర్ణచంద్రుని దిరస్కరించుచుండ సర్వాంగసుందరాకారుండై యపరమన్మథుండో యనం గామినీజనసమూహంబునకు నేత్రానందకరుండై యుండె. అతిమృదులంబులగు నాతని యవయవంబు లనుపమానంబులై యుండ నతిమోహనకరమగు తద్రూపమునకు భూలోకకాంతలేగాక సుర నాగ సుందరీమణులుగూడ మోహపరవశ లగుచుండిరి. రాజ్యకన్యక లాతని సురూపంబుం జిత్తరువుల వ్రాయించి తమరూపములకు సరిచూచికొని యనుగుణంబు కాంజాలమికిం జాలం జింతించుచుండురు. దమయంతిమాత్రము తానె తగుదానని తలంచి చింతింపక మనంబున సంతసించుచుండెను.

అంత నా రాసుతకు యౌవనోదయ మారంభమగుటచే నలునియందు మదనానురాగ మంకురించెను. తండ్రియైన భీమరాజు కొలువుదీరియుండిన సమయంబున స్తోత్రపాఠకులు నానారాజుల గుణాతిశయంబుల వర్ణించుచుండ నలుని వర్ణనాంశ సందర్భమున మాత్రము దమయంతి చెవులు దోరగిలం బెట్టుకొని విని యానందించుచు మేనం బులకలు వహించుచుండును; ఇటులా నలావనీశుని గుణగణంబులం వినుచుండం గ్రమముగా మోహాతిరేకం బగుడు నిరంతర నలధ్యానంబున స్వల్ప

కాలంబులగు దివారాత్రములు దీర్ఘములుగఁ దలంచుచు బాధపడుచుండెను; మన్మథసామ్రాజ్యమునకు నలునినే పట్టాభిషిక్తుఁ జేయును. 'నల' నామధేయమగు రెల్లుగడ్డి విన్న నలమహారాజ నామమనియే తలఁచును; నలుఁడేలు నిషధ రాజ్యమునుండి వచ్చిన భూసురులఁ బూజించి ప్రియుఁడైన నలుని వృత్తాంతము నడుగ నుద్యమించు; నిరంతర మాతని నామధ్యానము జేయు; అప్రయత్నముగనే యాతని గీతములఁ బాడును; చిత్రకారులచే భువన మోహనంబగు తన యుభయుల రూపంబుల వ్రాయించి తా నాతనికి భార్యగానుండి నట్లు తలంచుచుండు. చెలు లాతని యతిశయంబుఁ బొగడఁ గర్ణానందముగ వినుచుండు. ఇట్టి కోరిక లతిశయింప నలునిఁ బతిగాఁ దలంచుకొని రాత్రులయందు గాఢనిద్ర రామిఁ గలఁత చెంది స్వప్నగతుండైన నలునితో నేకాంతముగా నుండియు నిరంతర స్మరణవశంబున నలుండెల్లెడలఁ గానుపింప లజ్జాభయ భ్రాంతు లొందుచుండెను. మఱియు మదనవేదనాభరంబున మంచుఁ గుఱియుచు శీతాధిక్యముగ నుండు హేమంతంబును, దీర్ఘరాత్రులఁ జెన్నారు శిశిరంబును, కోకిలకుహూకారంబుల నొప్పారు వసంతంబును, మల్లెమొగ్గల పరిమళసంభరిత వాయుమంజరుల నెసంగు గ్రీష్మంబును, భయంకర గర్జారావంబులఁజేయు వర్షాకాలంబును, బండువెన్నెలఁ జెన్నారు శరత్కాలంబును, మదనోద్దీపకంబు లగుటచే నతికష్టముగఁ గడపుచుండెను.

ఈసమయంబున నలుండు ముత్తియపు సరంబునకు

దారముంబలెఁ గాంచనపుష్పంబునకుఁ దావింబోలెఁ బసకు
దమయంతి యెంతయుఁ దగినదనియుఁ దనకీర్తి యామెచే
నింక నతిశయించుననియు నక్కాంతాలలామ గుణంబులు
జనంబులవలన వినియెను. ఆమె సుగుణగణ శ్రవణంబు
కర్ణరసాయనంబుగ నాతనికి మోదంబు నింపుచుండె.
మదనుండిదే సమయమని రూపంబునఁ దన్ను జయిం
చిన యన్నలునిపైఁ బగఁదీరఁ గ్రూరనారాచంబగు సుమ్మదన
బాణంబుఁ బ్రయోగించె. అందులకు ధీరుండగు నన్నలుండి కార్య
ర్యంబు విధిమనోభిప్రాయంబున కనుకూలంబగుట, లోఁబడి
మదనవశంవదుఁడయ్యెను. అంత నా సతీమణిరూపంబు స్మరించు
చుంట విరహబాధాతిశయుండై తెల్లగలులు జాగరణం
బొనరించుచు నంగకంబుల సహజకాంతి డిందువేవ విచార
గ్రస్త మానసుండై యుండె.

ఉపవనవిహారము.

ఇట్లులుండ నొకనాఁడు నలుం డుపవనవిహారంబున
కేగఁదలఁచి రెండవయుచ్చైశ్శ్రవం బనఁదగు తురంగరాజంబు
నెక్కి సముచితపరివారయుతుఁడై, పురజనులు నేత్రానంద
ముగ విలోకించుచుండ బయల్వెడలి యొక్కతావున విచిత్ర
తమంబులగు స్వారి వినోదంబులఁ బెక్కంటి జరపి యమాత్యా
దుల నటనుండ నియమించి, పాదచారియై పాలకడలిం
జేరు పుండరీకాక్షుని పగిదిఁ గేళీవనంబుఁ బ్రవేశించెను.
ఆ మహాభాగుఁడు విరహముఁగొన్న వాఁడగుట మొగలి
చెట్టుఁజూచి నీపుప్పొడిచే మన్మథ బాణప్రయోగమునకు

సాయపడి విరహుల నేచుచుంటివని నిందించెను. నలుం డా వనంబునఁ జెలువారు నానావిధ తరు గుల్మ లతా మంటపముల విహరింప సూనగంధాపహారియగు పవనుం డాయాసము దీరునటు లుపచరించి నమ్రభావముసూచింపఁ, గృత్రిమయంత్ర నిర్మాణంబునఁ బ్రవహించు కాలువల వెంట సంచరించుటఁ జూడ నొక్కమునకై మంచి గందుమీను వెదకుటకుఁ జనుదెంచు మన్మథుఁడో యనునట్లు చూపరులకు విభ్రమంబుఁ గొలుపుచుండెను. అతఁ డా ప్రాంతంబున శుభ లక్షణ లక్షితంబగు నొక్క మహాసరోవరంబుఁ గాంచి తత్ప్రశస్త్యంబుఁ గొనియాడుచు మోదం బందుచుండె. ఆకాసారంబునఁ దరంగడోలికలనూగుచు నిద్రాసుఖంబుఁ గాంచుచుండిన నొక చక్కని రాజహంసముఁ గాంచెను. తోడనే యారాయంచఁ బట్టఁ గుతూహలాయత్తమానసుండై, యుపాయంబుగఁ బట్టుకొనియెదఁ గాక యని యటనుండి మెల్ల మెల్లన నడుగు లిడుచుఁ దటాలున నారాజహంసంబుఁ బాణిద్వయంబునఁ బట్టుకొనియెను.

అంత నయ్యది మేల్కని కంచుకీచింతెఱంగున నఱచియుఁ బాదంబుల గింజుకొనియు నాసాపుటంబునఁ బాణిపద్మంబుఁ బొడిచియు ననేకవిధంబులఁ బోఁ బ్రియత్నించి చీకాకుఁబడుచుండె. నలుండు దాని శృంగారరేఖావిలాసంబుల కబ్బురపడుచుండ నా రాజహంసము మనుష్యభాషణంబుల "నీవీప్రాంతమునఁ దిరుగుచుండుటఁ జూచియు సర్వభూతదయాళుండవగుట నిర్భయంబుగ నిద్రించితి. ఇట్లు నమ్మినఁ బగవారి

నేనియుఁ దమవంటి యుత్తమోత్తములు చెలుపఁజూతురా?

"చ. ఎఱుఁగనె నీవు ప్రాంతమున నింతట నంతట నున్కి? యింత యే
మఱుచునె! నిన్ను విశ్వజనమాన్యుఁడ వంచు ఁదలఁచి విశ్వసించి యి
త్తఱి సుఖనిద్రఁ బొందితి వృథామతి, నెట్టన యాత్మ నమ్మినం
జెఱుపఁ దలంతురే ఘనులు చిత్తమునన్ బగవారి నేనియున్."

నీవు హింసయే ప్రధానముగా నెంచినయెడలఁ గరుణాపాత్రమైన యీ సరోవరహంసంబును వదలి మదాతిరేకంబున విలసిల్లు శత్రురాజుల నిర్దయుండవై సంహరింపుము. ఫల పుష్ప మూల మాత్రంబుననే దేహంబుఁ బోషించుకొనుచు మునులంబోలె జలంబునఁ దపం బాచరించుచున్న వారము. ఇట్టి మావంటి సాధుపతంగములమీఁద దండనీతిఁ బూనఁదగునే. అదియుఁగాక నాతల్లికి నే నొక్కఁడనే పుత్రుండ; నామె కన్నులు గానరాని ముసలి. నా భార్య యేమియు నెఱుంగని బేల. నా కేవంక బంధుగులు లేరు. నాయది కడు బీఁదసంసారము. నాకు సంతానము లేక లేక యిప్పుడే కలిగినది. పసిగందుల జీవితమునకు నేనే యాధారుఁడను. రాజపుంగవా! దయయుంచి నన్నుఁ గావుము, చంపకుము. దీనుఁడనై యిదె యాచించుచుంటి. యాచకులకుఁ గల్పవృక్షముకంటె నీవధికుండవు. వేఱుయోచింపక ప్రాణదానం బొసంగుము" అని యతి దీనంబుగ వేఁడుకొనియెను. "అయ్యో! దైవమా! నీకనుల కేఁ బెద్దనైతినా? కట్టా! తల్లీ! ముదుసలివై యీ యేకపుత్రశోకంబు వహించి యీ సంసార సాగరం బెట్లు లీదఁగలదానవు? ప్రాణేశ్వరి! నీవీ విరహవేదనా

దవానలంబున నెట్లు మ్రగ్గెదవో గదా? సఖులారా! నాయందలి యపారప్రేమంబున నుండు మీరలీవియోగదుఃఖమునందెట్లు మునింగెదరు? తనయులారా! క్షుత్పిపాసావశంబున నెట్లు దిక్కులేక తల్లడిల్లుచుందురో గదా?" యని నయనాంబువులు జలజల రాల నేడ్చుచుండిన యాహంసంబు నీక్షించి రాజు దయాపరిపూర్ణుండై హస్తద్వయంబును సడలించి నీయిచ్చ వచ్చిన చోటికింబొమ్ము సుఖం బుండుమని పంపెను.

# ఆంధ్ర నైషధ సారము.

## ద్వితీయాశ్వాసము.

అట్లు నలునిహస్తంబునుండి విడుపొందిన యారాయంచ నారాయణునివలన సంసారవిముక్తిం బొందిన ద్విజుఁడనిర్వచనీయంబగు బ్రహ్మానందము బొందుభంగిఁ బరమానందము నందెను. అంత నయ్యది యాతటాకంబున నిలిచి బాంధవులుఁ జెలులు సుతాదులుఁ జుట్టుకొనియుండఁ జూచి చచ్చిబ్రదికిన వాని చందమున నమేయసంతోషస్వాంతయై నలుని కరస్పర్శంబునఁ గందువాఱిన తనమేనును నోటితో సవరించుకొనుచుఁ, బక్షంబుల విదలించుచు, నాసాపుటంబునఁ గీటములబాధ నపనయించుచుఁ, దనమేనుఁ దోఁడియంచల శరీరంబులకు రాయుచు నూర్మిపంక్తులనుయ్యాలలూఁగుచుఁ, బద్మమకరందముఁ గ్రోలుచు, నాచుతీవియలగుంపులఁ దాగుకొనుచుఁ, గొంతతడవుఁ గ్రీడించెను. పిమ్మట నాద్విజరాజంబు, శివపూజాసమంచితంబును, రుద్రాక్షమాలికా సమన్వితంబునగు నలుని పాణిపద్మంబుఁ జేరఁ జనుదెంచెను. అమ్మహారాజు చేయిసాచి యామానస హంసంబు గారవించి దాపుననుంచుకొనియె. పిదప నాయంచ నలున కానంద మతిశయించునటుల మృదుమధురభాషణం

# ఆంధ్ర నైషధ సారము.

## తృతీయాశ్వాసము.

పిమ్మట నొకానొకదినంబున నిఖిల భువన వృత్తాంత వేదియు, సమస్తశాస్త్రప్రవీణుండును నిరంతర భగవధ్యానాసక్త హృదయుండునునగు నారదుండు, బాలసఖుండగు పర్వతుండు వెంటరాఁగ బ్రహ్మాది సురలచే నిరంతర వందనంబులఁగొను పాకశాసనుఁ జూడఁగోరి విలాసంబుగఁ బాణిపల్లవ నఖరాగ్రంబులఁ దంబుర మీటుచు, విశ్వమోహనంబగు గానం బొనరించుచు, నాకాశమార్గంబున విమానమధిరోహింపక యోగవిద్యాబలంబు చేయూతఁగాఁగ నరిగి స్వర్గలోకంబుఁజేరి, సకలసుర సంఘంబులు సేవించుచుండ నిండు పేరోలగంబున్న ఫురందరు సన్నిధ కేతెంచి, యాశీర్వాద మొసరించెను. అంత నా దేవేంద్రుండు సముచిత సత్కారంబుల నొనరించి యిష్టాగోష్ఠి వినోదంబులఁ గొంత ప్రొద్దుఁగడపి, ప్రసంగవశంబున నారదుంజూచి "మునితిలకా! మీ కన్నిలోకంబుల వృత్తాంతంబులు హృదయైకవేద్యములు. పూర్వముఁబోలె నిప్పుడు భూలోకంబునుండి రాజశ్రేష్ఠులు

స్వర్గంబునకు వచ్చుచుండుటలేదు. కారణంబేమి? సమర రంగంబుల గ్రీడించు వీరనృపాలురు భూమండలంబున లేరు కాఁబోలు! మా గృహం బతిథులు రామిఁ గళాహీనంబై యున్నయది. అవ్వీరకంఠంబులఁ బుష్పమాలికల సమ్మోదంబున ధరింపఁజేయఁ దలఁచు దివిజవేశ్య లూఱకయ సంచరించుచున్నవారలు. రాజకంఠీరవంబులకు సమర రంగంబుల విజయలక్ష్మిని గై దండ యొసంగుట యొండు లేక స్వర్గంబున రంభాసంభోగ మొండు గాక యితరంబు గలదే? అనఘా! వీరవతంసులగు నతిథులు రామి నా హృదయము ఖేదమొందుచున్నయది. సంపదలు కలిగినందులకొరుల కుపయోగింపక, స్వార్థంబుగ వినియోగించినయెడఁ బూర్వపుణ్యంబు వ్యయంబగు. అట్లుగాక యాధనంబును యుక్తాయుక్తములెఱింగి యర్థుల కర్పణం బొనర్చిన సుకృత శుభంబుల గడియింపఁగలఁడు. నాకిపు డతిథి పూజాలోపంబున సుకృతంబులన్నియు వ్యర్థమై పోవుచున్నవి. కావున రాజవతంసంబులు నాకంబునకు రాకుండుటకుఁ గారణంబు దయామయుండవై విదితపఱచు" మని వచియించి యూఱకున్న నారదుఁడాతని సౌశీల్యంబునకు మదిసంతసించుచు నిట్లనియె. సురరాజా! అతిధిసత్కార వాంఛారతంబులగు నీవాక్యంబు లెంతయు నాకు సంతసంబుఁ గలిగించినవి. సర్వకాలము నవిచ్ఛిన్నముగాఁ ద్రిభువనంబుల నేలుదువుగాత. నీసంశయంబునకుఁ గారణంబు చెప్పెద వినుము.

"మహీమండలంబున విదర్భదేశము నేలెడి భీమరాజునకు

దమయంతియను నొకకన్యాలలామంబు కలదు. ఆకోమలియన
న్యస్వరూపవిశేషంబునఁ ద్రిభువనాభిరామంబై సకలసద్గుణగణ
విరాజమానంబై యుండుటంబున నీయింతియుండె నామె నుద్వాహం
బుఁగాఁదలచి రాజులెల్లరు యుద్ధంబులుమాని తదేక వాంఛాస
క్తులై యుండిరి. మదనుని యౌవనోదయభాగ్య నిధానంబగు
సమ్మానవతి యొక రాకుమారునిపై మనంబు కరంబనురాగం
బున నిలిపియున్నదఁట. అట్టిపుణ్యాత్ముండగు రాజాత్మజుండెవ్వ
రని యడుగఁదలఁచితేని యాప్రశ్నంబు మానుము. నాకును
నావృత్తాంతము గోచరించినదికాదు. ఆదమయంతి ప్రియసఖీ
జనంబులకు నయితము నారాజనామంబు తెలిసినదికాదు.
విరహాభరంబున వెలవెలఁబాఱుచుఁ గాంతిహీనంబులుగనుండు
నామె యంగకంబులఁబట్టి యెవ్వనిపై నో బద్ధానురాగయై యుం
డెనటు లూహించి దమయంతీ స్వయంవర వృత్తాంత మేఁబది
క్రోసుల యోజనంబుల వైశాల్యంబుగల యీభూమండల మం
తటఁ జాటఁబంపఁబడియెను. నాఁటనుండియు రాజపుంగవులు
యుద్ధంబులుమాని, స్వయంవరాగమన మనస్కులై యున్న
వారలు; ఆరాకుమారిబాల్యంబువదలియౌవనోదయమైనది మొ
దలుపుష్పనారాచుండు రాజకుమారులపై విడునక వేటాడుచున్న
వాఁడు. అదికారణంబుగ యుద్ధంబులేమినికి నా కుపవాసంబులు
మెండగుచున్నవి. నీకును రాక్షసులకేనియు, యుద్ధసంరంభం
బులు జరుగునేమో? యదిచూచి నాకడుపు నిండించుకొని
పోఁగాకయను నాశతో నీచెంతకరుగు దెంచితి" నన నందు
లకుఁ బురందరుండు, దరహాసంబొనర్చి "నాకెల్లవిధంబుల

సహకారియై శ్రీమన్నారాయణుండు మంత్రిత్వము వహించి సర్వ వ్యవహారంబుల నిర్వర్తించుచుండ, నేను నెమ్మదిగ రాజ్యము బరిపాలించుచుంటి. ఇప్పుడేమియు స్వర్గంబున రణప్రశంసలేదు. నామమాత్రంబుగ వజ్రాయుధంబు నాహస్తంబున నుండునదియే కాని, యెంతయు నా దానవాంతకుని యాజ్ఞామాత్రంబున నీ దేవలోక సామ్రాజ్యంబును సదా సంరక్షించుచుండుదును" ననఁ గలహాశనుండగు నారదుండు కయ్యంబు లేమి నిట్టూర్పు నిగిడించి యివ్విధముగా ననియె, "నా కెప్పుడును స్థిరముగా నొక తావుననుండు నాచారము లేదు. నిన్నుఁ జూచితి. నాకీ నాకంబున నుపకారంబు కలిగినదికాదు. నన్నుఁ బంపుము. భూలోకంబున కేఁగెద. అచటనైన దమయంతీ స్వయంవర సమయంబున నేనియు రాజులకు మాత్సర్యంబుగలిగి సంగ్రామంబొనరింప, నా కాహారంబు లభియించునేమో" యని సముచిత ప్రకారంబున దేవేంద్రునిసెలవుఁ గైకొని నారదపర్వతులా స్వర్గంబునుండి యరిగిరి.

ఇంద్రుండు నారదమహాముని వచనంబులవలనఁ బ్రమోద హృదయుండై దమయంతిపై మరులుగొని స్వయంవరంబున కేగ నుద్యుక్తుండయ్యె. అయ్యదివిని రంభోర్వశీ మేనకాది దేవవేశ్యలు విచారగ్రస్తులై ప్రాణత్యాగముం జేయ సంసిద్ధులగుచుండిరి. ఆ పురందరుతోడ, యమ వరుణాగ్ని దేవతలు బయలువెడలి ముందుగ దేవకాంతలచే దమయంతి కనర్ఘ మణిసముదాయంబును, మందార కుసుమంబులు

మొదలుగాఁగల మనోహర వస్తుసంచయంబును గానుకలుగ నంపిరి. ఆ దేవతా చతుష్టయంబు కాంచన విమాన మధిరోహించి, యాకాశ గంగాతోయ శీకరంబులఁ గైకొని యేతెంచు మందానిలం బాయాసం బపనయింప, ధరాస్థలిం జేరునెడ, మేఘ గంభీర గర్జానినాదంబుఁ బలె మహాధ్వనితో నేతెంచు రథంబుఁ గాంచిరి. ఆ స్యందనంబున మోహనాకారుండు యోధాగ్రగణ్యుండునగు రాజశ్రేష్ఠుని జూచి యాతని రూపురేఖా పరాక్రమాదికంబుల కీసునహించి మనము విన్న శుభలక్షణంబులన్నియు నీతనికి సరిపోలుటఁ జూడ నీతండే నిషధరాజని, యొకరొకరు నిశ్చయమనుచు సంభాషించుకొనసాగిరి. అవ్వీరుండు కనక విమానంబునఁ గూర్చుండియున్న యా దేవతా చతుష్టయంబుఁజూచి యాశ్చర్యమగ్న మనస్కుండై తేరుడిగ్గి, వారల సమీపించి దేవేంద్రాదులకు భక్తిపూర్వకంబుగ వందనం బాచరించి కరద్వయంబు మోడ్చి, దాపున నిలిచియుండె. అద్దేవతలును వాని సౌందర్యవినయాదివిశేషంబుల కబ్బురపడుచు నీతనిఁగని దమయంతి తమ్ము వరియించుట యసంభవమని యొకరి మొగంబు లొకరు నిరాశావశులై యూరకఁ జూచుకొన సాఁగిరి. మాయోపాయధురీణుండగు బిడౌజుం డారాజకుమారునితో వాత్సల్యపూర్వకంబుగ నిట్లనియె. "అన్నా! నీ వెవ్వరి కుమారుండవు? నా ప్రియమిత్రుండగు వీరసేనుని రూపరేఖా విలాసంబులు నీయెడఁ బ్రోఁపించుచున్నందున నిషధాధినాథుండవగు నలుండవని నాకుఁ దోఁచుచున్నది. నీకుఁ గుశలంబే

కదా! ఎయ్యెడనుండి యెటకేగుచుంటివి? నీశుభచారిత్రమును మేము కర్ణరసాయనంబుగ సదావినుచుందుము. నీవు మమ్ముల నందఱ నెఱుంగుదువో లేదో? యెఱుంగకున్న వినుపించెద విను మని వ్రేలితోఁ జూపుచుఁ నీతఁడు యమధర్మరాజితఁ డగ్నిహోత్రుం డితఁడు వరుణుండేను దేవేంద్రుఁడ. వేయిమాటలేల? మేము నిన్నొకవిషయంబున యాచింపవచ్చితిమి. కాన మమ్ముల నాదరింపుము. ముహూర్తమాత్రంబ ప్రయాణాయాసంబుఁ బాపికొని కార్యంబుఁ దెలిపెద"నని యూఱకుండె.

అంత నాధరణీపతి యర్థుల మను మాట చెవి సోఁకినంతనే యధికానందము నంది "దేవతల కసాధ్యంబగు పదార్థమెట్లు నావలన లభియింపఁగలుగు? నా ప్రాణంబునేని నాఁ లడిగినయెడ నొసంగెదఁగాక. దేవేంద్రునంతటివాఁడు యాచింపవచ్చిన నేమియొసంగి సంతోషపెట్టఁగలుగుదు? నాకు నా ప్రాణంబుకంటె భీమరాజకుమారిపై నెక్కువ నిక్కముగ మక్కువగలదు. ఈదేవత లాదమయంతిం గోరినను వేగంబ యిచ్చి సంతోషముందుదు. వీరియభిలాష యేమైయుండును? నా రివియవి యని యడుగకముందె దానంబొసంగు టత్యుత్తమంబు. యాచకునికోరిక నెఱింగి దీనాలాపంబుల వినుట మహాదోషంబుకాదె? తనకు సంపదకలిగినందుల కర్థులఁ దనియింపఁ జేయుటయే ఫలము. అపారధనరాసులు గలిగి త్యాగశీలము గుర్తెఱుంగక లోభియై మూటలం గట్టువాఁడు భూభారంబగు. అట్టిపరోపకారహీనునికన్న వనంబులుఁ బర్వతంబులు సముద్రంబులు దేలికగనుండు.

"ఉ॥ దానకళాకలాప సముదంచిత సారవివేక సంపదన్
మానితమైన మానజనమానస వృత్త్యభిపూర్తి బుద్ధియై
నా నికిలేదొకింతయును. నాకొకయండు నరంబు భూమికిం
గానలు గావు, శైలములు గావు, పయోధులు గావు భారముల్.

మఱియు సత్పాత్రుండగు వానికీలోకంబున నొకటి యొసంగ నాతండు మఱల దానప్రభావంబున వేయి సుఖంబులం గూర్చువాండగు. ఈవ్యాపారంబు నందుఃఖుం గనుంగొనుటయు కర్తకార్యం" బని మహార్తిమాత్రింబ యోజనంజేసి వికాసవదనుండై "దేవేంద్రాది సురవతంసములారా! మీ సందర్శనమాత్రంబున నే నమందానందహృదయుండనైతి. నా జన్మము ధన్యంబయ్యె. నేను తొల్లిం జేసిన మహాపుణ్యఫలంబు మీరాక మూలంబున విదితంబుగం గాననయ్యె. ఇంతటి కళ్యాణదినంబు నెన్నండేనియుం గంటినే? నాచే మీరు గోరినప్రయోజనం బానతిండు. ప్రాణంబు నేనియుం బ్రాణాధికంబగు మఱేద్దియేనియు నొసంగెద" నని నిస్సందేహముగాం బలుక నింద్రుండిట్లులనియె.

నలరాజచంద్రా! మేము దమయంతిపైం గోరికచే నిటువచ్చినవారము. నీవు నిజముగ ప్రేమభక్తి విశ్వాసంబు లధికమగునటుల మాకు రాయబారి మొనరింపుము. భూమండలంబున నింకనెందరు రాజకుమారులు లేరు? వారివలన నగు కార్యంబేమి? గంభీరహృదయుండవగు నీవు బాసటమై నిలిచిన యెడ సాధింపరాని కార్యంబొండుగలదే?" యని వచియింప నిష్కపటాత్మకుండగు నలుండా పాకశాసను మాయోపాయ

వాక్యంబులఁ గుటిలత్వంబు గ్రహింపఁజాలక "దేవా! సర్వజ్ఞుల
రగు మీ రెఱుంగని విషయం బెద్ది గలదు? అట్టి మీ రివ్విధంబున
నాజ్ఞయొసంగిన నే నేమని వచియింపఁగలను? ఏను నా రాసుతి
వరియింపఁ నేగుచున్నవాఁడ. ఇట్టి నేనామెకై దూత్యంబు
నెట్లుచేయుదు? విరహవేదనాదోదూయమానమానసుండనగు
నేను మీరహస్యంబు నెట్లుదాఁచగలను? రాజభటాధ్యక్షరక్షణా
యత్తంబులగు రాజద్వారంబులుదాఁటి యంతఃపురానువర్తిని
యగు నమ్మచ్చకంటి నెవ్విధంబునఁ గాంచఁగలుగుదు? ఒక
వేళఁ గాంచఁగలిగిన నాయందు బహుకాలమునుండి బద్ధాను
రాగయై యుండిన యమ్ముద్దియతో మీప్రసంగంబు లేవిధం
బునఁ జేయఁజాలుదు? ఈకార్యం బసాధ్యంబయగు. నాతల నీ
కార్యభారంబు నుంపకుఁ"డని నలుండు వచియింప శచీధవుండు
చిఱునగవొనరించి యారాజేంద్రునితో "భూపాలచంద్రమా!
ఇట్టి యధైర్యపుమాటలఁ బలుకకుము. నీవు మొదలఁ బ్రాణంబు
నేనియుఁ బ్రాణాధికంబునేనియు నొసంగెదనని వచియించి
యింతలోఁ దప్పించుకొనఁ జూడకుము. నీవంశంబునకుఁ గళంకం
బుఁ దేఁ బ్రయత్నింపకుము. పశుజాతిలోనిదగు కామధేనువును
జడరూపంబగు కల్పవృక్షంబును యాచించియే కోరికలనందు
చుండ, నింతటి త్యాగశీలుండవగు నిన్ను నర్థించి మేమూఱ
కుందుమే? కోరికల నొసంగు వేల్పుమ్రానుఁ గామధేనువుఁ
గలిగియు దేవతలమైన మాకు సాధ్యంబుగాని యికార్యంబు,
నీమూలంబున సమకూరిన మహాయశస్సును సంపాదింపఁ
గలుగుదువు. విబుధగణంబునకు సాహాయ్యంబొనరించి దానం

బొసంగు నీ జన్మము ధన్యంబై లోకస్తుత్యంబై యుండుఁగాదె? ఇట్టి మా కార్యంబు వెంటనే నెఱవేర్పుము. మాకు సంతోషంబయ్యెడు. మా యాశీర్వచనములచేఁ ద్రిలోకంబులందు నీ యశస్సు, రాకాసుధాంశునింబోలె సర్వజనానందకరంబై భాసిల్లఁగలదు. నీయొక్క ప్రతాపంబు నతిక్రమింపఁబోయి గాదె సూర్యుండు దన వేయిపాదంబుల విరుగఁ జేసికొనియె. ఇట్టి ధైర్యకవచంబును విడువక యశంబు గాపాడుకొను"మని యనియె. వీతిహోత్రుండు 'ఓరాజా! దమయంతీ సంఘటనము మాకు జన్మసాఫల్యము'నియె యముండు 'ధైర్యకంచుకా! మా ప్రార్థనం బంగీకరింపుము'ని వచించె. వరుణుండు 'త్యాగశీలా! ఈ యుపకారం బొనరించి కీర్తినందు మనియె.

## దూతగా నేగుట.

ఇవ్విధంబున భాషింప వారల వాక్యంబు లాలకించి దమయంతీ మోహపాశబద్ధుఁడయ్యు నన్నలుండు దూతకృత్యం బంగీకరింప నా యమరు లంతఃపుర ప్రవేశంబునకనువగు తిరస్కరిణీవిద్య నుపదేశించి దమయంతీ ప్రత్యుత్తరంబుఁగొని నీవిచటి కేతెంచుదనుక మేమిచ్చోటనే యుండువారము. కార్యసిద్ధియగుంగాక. వేగంబ యేగుమని యాతని నంప, నగస్త్యుండు బడబానలముఁ బాటింపక సముద్రంబు నుదరంబున నిడుకొనిన యట్టుల నన్నలుండు, దమయంతీ విరహానలంబును హృదయంబున వహించియు దేవతాకార్య

భారంబుఁ దలఁదాల్చి యా దేవచతుష్టయంబునువీడి రథారూఢుండై భీమభూపాలుని రాజధానియగు కుండిన పురాభిముఖంబుగఁ జనుదెంచి వేగంబ నా పురంబుఁ జేరెను. అంత నా నిషధరాజు, "ఆహా! దమయంతీ పాదకమలంబులఁ బవిత్రవంతంబులగు రాజమందిరంబులం గాంచి ధన్యుండనైతి. ఇఁక నిరుపద్రవంబుగా బ్రతికితి" నని యనుకొని, యంతలో అయ్యో! ఎందులకు? దమయంతీ దూతకృత్యంబునకుఁ గదా యేతెంచితి నని విషాదమొందెను.

మ. దమయంతీ సుకుమార పాదకమల ద్వంద్వార్పణాధన్యకు
ట్టిమహర్మ్యంబగుపట్టణం బపుడుగంటిన్ మంటినం చెంతయుం
బ్రమదంబందె, దిగీశకార్య ఘటనాభారంబు చింతించి దీ
ర్ఘము నుష్ణంబునుగా నొనర్చె ధరణీకాంతుండు నిశ్వాసమున్.

ఇట్లు మనంబున విచారించుచుఁ గుండిన నగరంబుఁ బ్రవేశించియొక ప్రదేశంబున నమాత్యాదిభటపుంగవులవిడియు వట్లాజ్ఞయొసంగి రథంబునటనేవదలి యమరకార్యంబునిర్వర్తింప నలుండు పాదచారియై యప్పురరాజవీధులఁ బోవుచుండె. పురజనంబులీ సుందరుండెవఁడో కదా! నేత్రోత్సవంబొనరించుచున్నవాఁడని యబ్బురపడుచుండ నంతలో దేవతావరంబున నదృశ్యుండయి వేగంబచని యారాజకుంజరుండు మదకుంజరపుంజంబులచేనొప్పారు సుందరంబగు రాజమందిరంబుదరిసి తన మాయాప్రవర్తనంబునకు లోన సిగ్గుజెందుచు, ద్వారపాలకుల జాగరూకతకు నవ్వుకొనుచు, నాభటులేరిని గుఱించి పలుకరించినఁ దన్నుఁగా దలఁచి తొలఁగుచు నేతెంచు నిందీవరాక్షు

లకు దారియొసంగి తప్పుకొనుచు, నిరంతర ధ్యానాసక్తిచే మిథ్యా దమయంతిని గాంచి యద్దేవసమాచారంబును వినిపింప దలఁచుచు, గజముఖశాలలఁ గడచి క్రమముగా నుండిన రాజద్వారంబులదాఁటి, యంతఃపురంబుజేరెను. ఆ భవనంబు సందోక కాంత పోకముడిని సవరించుకొనుచుండ నాతండు పాప భయంబునఁ గన్నుమూసికొని యొదిగియున్నయెడ, మార్గాగమనవశంబున నిర్వురు జవ్వనులేతెంచి కనకకలశస్తనం బుల నాతని నొత్తిరి. ఆకృత్యంబునకాతఁడు పశ్చాత్తప్తమాన సుండయ్యె. ఒకలేమ నిద్రించుచుండ వాయువశంబున నించుక పయ్యెదతొలంగ, మెఱయు బంగరు పాలిండ్లఁగాంచి మోము నావలఁద్రిప్పి ముందున కేగుచుండెను. "అయ్యో!నామాయా ప్రవర్తనంబు మిగులఁ గష్టతరముగ నున్నయది. నేత్రముల మూసికొని పోవుదమన్న నీయతివ లదృశ్యుఁడగానున్న కారణం బున నను గనుఁగొనలేక యొత్తివేయుచుండిరి. కనులఁదెఱచియే సంచరింతమన్న బాపకారణంబులగు స్తనాదికంబులు నాకు గోచరించుచున్నయవి. ఇఁక నేవిధంబున నీయంతః పురంబునఁ దిరిగి యాదమయంతిఁ గాంచఁ గలుగుదు? ఒకే మార్గంబున నేఁగిన నేతెంచు రాజకాంతలఁ దప్పుకొనుట మిగులఁ గష్టముగానున్నయది" యని తలంచి నాలుగుమార్గం బులు గలిసిన చదుకంబునకుఁబోయి నిలచెను. ఒకజవ్వని యతి వేగంబున నేఁగుచుండ నామె పైఁటచెఱంగు నలుని భుజకీర్తు లందలి వజ్రపు మొనఁ దవులుకొని చీరయంతయు నూడ నామె యాశ్చర్యమొందెను. తోడికాంతలు హేళనం

బోనర్చిరి. అందుల కా రాకుమారుండు తాను కారణమైనందుల కెంతయు మనంబున ఖేద మొందెను. ఒక తావున నిర్వురు సంపెంగ పూబంతుల నొకరిపై నొకరు విసరుకొనుచు నాడుచుండ నతండా క్రీడామధ్యంబున కరుగ నొక కందుక మేతెంచి యదృశ్యుండగు నాతని వక్షంబున దాకఁ దిరిగి మధ్యభాగంబునుండియే యాబంతి పృష్ఠంబున కరిగినందులకా చందన గంధు లాశ్చర్యము నందిరి. పిదప నా కమలముఖులు నిలువుటద్దములలోఁ బ్రతిబింబము గనుపడుచుంటయు, సైకత ప్రదేశంబులఁ బాద చిహ్నంబులు గోచరించుచుంటయు, రూపరహితంబుగ శరీరంబునకు స్పర్శమగుటయు, దేవతాపుష్పంబుల తావు లెల్లెడల వ్యాపించి గుప్పించుటయు, విరహతాపంబున వచించుచున్న వాక్యములు వినఁబడు చుండుటయుఁ జూడ నెవ్వఁడో యదృశ్యకరణాది విద్యల నెఱింగిన మాయకాఁ డంతఃపురంబున దిరుగుచున్నటుల తలంచి భయమందిరి. జగన్మోహనాకారుండగు రాకుమారుండట్టి కాంతలఁజూచి నిర్వికారుండై పరస్త్రీ పరాఙ్ముఖుండై యింద్రియ నిగ్రహుండై, యంతఃపుర కాంతాజనంబులఁ దప్పించుకొని రాజభవనంబుల దాఁటి దమయంతీ విహారసౌధంబుఁ గాంచెను.

ఆ మందిరంబున న భీమపుత్రిక చెలికత్తియలుచేయుచుండిన కృత్యంబుల నలుండా ప్రాంతములనుండి చూచుచుండెను. ఒక జవ్వని నలవేషంబును దాల్చి యేతెంచుచుండ నొక లతాతన్వి దమయంతీరూపము ధరించి వేష

ధారిణియగు నా నలుని కంఠంబునఁ బుష్పమాలికను వైచినది. మన దమయంతి యా స్వయంవరంబుఁ జూచి చాల సంతసము వెలిఁబుచ్చెను. ఈ ప్రవర్తనంబును జూచి యా నైషధుండుఁ దనపై మరులుకొని యున్నట్లు దెలిసికొనియెను. ఒకలేమ బంగరు మొగలిరేకున నల్లగా నక్షరము లుండునటుల నఖరాగ్రంబుచే నలనామంబున బ్రణయలేఖ నొండువ్రాసి యా భీమకుమారికిఁ జూపెను. ఒక చంద్రవదన, చంద్రకాంతవేదిక నాసీనయైన యా రాసుతకుఁ జంద్రరజంబును జంద్రాకారంబుగఁ దిలకంబుఁ దిద్దెను. ఆ కమలేక్షణ నూరడించుటకై యామె చెలులు నలుండిదే వచ్చుచున్న వాఁడని వచియించు వాక్యంబుల నేర్చుకొని బంగరు పంజరంబున రాజిలు నొక శుకంబు మఱలఁ బలుక, నీ కీరంబు తన్నెఱింగినది కాఁబోలుననియానిషధనాథుండు సంశయావహుఁ డగుచుండఁ, బ్రియజనని వార్త యెఱింగి యా రాసుత యన్యమందిరంబునకేఁగె. ఆమనోహారిణి రాకకై వేచి యున్నలుండాభవనద్వారప్రాంతమునఁగల బంగరు టరుంగున నాసీనుండై యుండె. అయ్యెడ నాభీమపుత్రి స్వయంవరపూర్వవాసర కళ్యాణ సమయంబునఁ దల్లికి వందనం బాచరించి, గృహదైవతంబులకు మ్రొక్కులిడి, యనుకూల దాంపత్యాభివృద్ధియగు నట్టులొసంగిన భూసురాశీర్వాదంబుల బడసి, పేరఁటాండ్రిడిన మంగళాక్షతల శిరంబునఁదాల్చి ప్రేమంపుజనయిత్రి మనస్సంతోషపూర్వకముగ నొసంగిన పూవుల దండను హస్తపద్మమున ధరించి, మదనతాపజ్వరంబున నలసి

మందగమనంబున నేతెంచుచుండిన యాత్రైలోక్యసుందరిని గనుంగొని, యానిషధరాజు మన్మథసామ్రాజ్య లక్ష్మింబోని యాయన్నులమిన్న సమీపంబున కేఁగఁదలచి, మోహాతిరేకంబున విభ్రాంతుండై చనుచుండెను. రాజకుమారియు మాయావేషానువర్తియగు నానలుని నెఱుంగక యేతెంచుచుండెను. విరహాతిరేక విభ్రమంబునఁ గనుపట్టు నలునికంఠంబున నాదండ వైచెను. అయ్యది దైవసంఘటనమున నిశ్చయముగ నెదుట నున్న నలునికంఠంబుననే యలంకరింపఁబడియెను. కాని యా పూవుటెత్తదృశ్యంబగుటఁ గాంచి యామెయు, భ్రమరూపంబయిన దమయంతి పుష్పమాల వైచినందుల కాతఁడును, యథార్థమెఱుంగక యాశ్చర్యమందుచుండిరి. ఈసమయంబున వారొండొరులకుఁ గలిగిన పరస్పర సమావేశాలింగనంబులఁగూడఁ బూర్వపు మిథ్యారూపకల్పితంబులుగా భావించుకొనుచుండిరి. ఇవ్విధంబున వారు తన్నిశ్చయానిశ్చయంబుల నెఱుంగకయ యమందానందము ననుభవించుచుండ, దమయంతి సఖీజన సహాయంబున నెట్టకేలకు స్వకీయ సభాభవనంబునకుఁ జేరి సువర్ణపీఠంబున నాసీనయై యుండెను. ఆరాజకంఠీరవుం డామెతోఁబాటు దత్సభా మందిరంబునకుఁ జనుదెంచి యాప్రాంతంబునంగల నలునిచిత్తరువుల నంతరమందుఁ దానొక్కరుండుగా వసియించెను. తన రూపంబు దర్పణ మణ్యాదికంబులఁ బ్రతిఫలించినను బాధకముండదనియు నింకను నీమె మనోభిప్రాయంబు గుర్తెఱింగెదఁగాక యనియు తలంచె.

## ఇంద్రాదుల దూతికలు.

ఇట్టు లా భీమపుత్రి సఖీజనపరివృతయై పేరోలగం బున్న సమయంబున నింద్రాగ్ని యమవరుణులంపిన దూతిక లారాజతనయ యాజ్ఞఁబొంది, సముఖంబున కరుదెంచి, సమయోచిత సత్కారంబుల బడసి, బంగరుఁ బీటలయం దాసీనలైరి. వారలలో నింద్రుని ప్రియదూతికయగు 'శంభళి' చేతులుమోడ్చి యిట్లనియె. "దేవీ! దేవతాధిపుండగు సక్రంద నుండు నాస్వామి. నేనాతని ప్రియదూతికను. నీపై మోహాతి శయంబునఁ గానుకగా నీ పారిజాతపుష్పములదండను నాచేఁ బంపియున్నాఁడు. గాన, దీనిఁ గైకొనుము"ని యా రాకుమారి కొసంగెను. "చారుగాత్రీ! నీపై మోహాధిక్యంబునఁ బ్రేమ లేఖను వ్రాయఁదలఁచె గాని దేవలిపి మనుష్యులు చదువఁ జాలరుగదాయని యంతలో విచారంబునొంది లిఖించుట మాని నా ముఖంబుననే యెల్లసంగతులు వినిపింపఁగోరి యున్నాఁడు. ఇంతకాలమునుండియు నీపై నాశచే నెటులనో వేచియున్నవాఁడు. ఈ స్వయంవరమున నాతని వరియించి సుఖంబుండుము. లోకంబులలో నెల్లస్వర్గ ముత్తమము. స్వర్గములో దేవతలు పూజ్యులు. అట్టి దేవతలలో శతమన్యుండు పరమోత్కృష్టుండు. అట్టి శునాసీరుండు నీయందు మరులు గొనియున్నపుడు నీయదృష్టంబేమని చెప్పఁగలను? నీవెంతయు ధన్యురాలవు. మఘవుండు నూఱుయజ్ఞముల నొనరించి యింద్రత్వమును సంపాదించుకొనియె. అట్టి యింద్రుం డిప్పుడు నిన్నుఁ జేపట్టఁ గోరుచున్నాఁడు. ఇఁక నీభాగ్యం బెంతటిదో

నీవ యోచించుకొనుము. బింబాధరీ! మందారతరుప్రాంతముల నీకు విహరింప వేడుక గలుగుటలేదా? ఆకాశ గంగా సైకత స్థలుల నాటలాడుటకు నీమనంబు కాంక్షించుటలేదా? లక్ష్మీ దేవికిం దోడికోడలివై నారాయణుని బిలిచి యాజ్ఞల నొసంగు చుండుము. మూఁడువేళలయందు నీచే నమస్కారంబుల గొనుచున్న దేవతలు నీకు వందనంబులు చేయంగలుగుట నీభాగ్యముగాదే! ఇంక సందేహింపక నీ బిడౌజుని వరియించి యేలుకొమ్ము. ఆ మహాభాగుని వరించి సింహాసనంబునం గూరుచుండి మఱందియైన వామనరూపుండగు నారాయణు నిచే నెల్ల కార్యభారంబుల నిర్వర్తింపించుకొనుచుం ద్రిలోకం బుల నేలికొనుము. అన్యథాలోచనం బొనరింపకుము. సంశ యింపక యీసుత్రాముని వరియించి యీ మహాభాగ్యంబుల నన్నిటి నందుదువుగాక" యని వచియింప నమ్రాననేత్ర, మాఱు పలుకకుండె. అయ్యెడనున్న యువతీమణులు 'వాసవవరణంబు యుక్తమే! ఇంక విచారింపంబనిలేదు. ముఖ్యముగ నంగీకా రంబె ఆచరణీయం'బని యొకరొకరు గుజగుజ లాడుచుండిరి. తదనంతరంబు భీమపుత్రి యంజలిమొగ్గి దేవేంద్రుని దలంచి నందనం బాచరించి, యాదూతికం గాంచి యిట్లులనియె.

"దేవతాధినాథుండగు వృద్ధశ్రవుని నాలుగు వేదంబు లనేకవిధంబుల స్తుతియించుచుండ నీవంతకంటె నాతని గుణం బులేమి వర్ణింపఁగలవు? ఇఁక సాహసంబుమానుము. సకలా త్మార్థంబుల నెఱింగిన యమరాధినాథునకేను వేఱె చెప్ప వలయునా? నాయభిప్రాయంబు నాతం డెఱుంగకుండెనా?

సంక్రందనుని సందేశంబును శిరంబునఁ దాల్చెద. తదంశోద్భూతుండగు నా నలరాజున కేను పరిచర్య సేయుదునని యిదివఱకే వాగ్దానంబొనరించి యున్నదాన. ఒకరున కీమేనర్పణంబైన పిదప యొరునకొసంగుట ధర్మంబుఁగాదు. నేను నలుని వరియించి యున్నదానను. ఎల్లపుణ్యముల కాలవాలమగు నీభరతఖండమున వసియించి సర్వోత్తమంబగు గృహస్థాశ్రమంబు స్వీకరించి, ధర్మసమంచితంబులగు యజ్ఞంబు లొనరించి సురలఁ దనియింపఁజేయఁగల దానను. వ్యాధిగ్రస్తుఁడు రుచికరంబగు నపథ్యాహారంబు వాంఛించిన దీర్ఘవ్యాధితుండగు నటులఁ బుణ్యవ్యయాల వాలంబగు స్వర్గము నపేక్షించి దీర్ఘసంసృతిరూపమైన యధోగతినిఁ బొందఁజాల" నని చెలులం జూచి "నాజన్మపరంపరా సుకృతంబున నా నలున కీ దేహంబర్పణం బొనరించి యున్నదానను; గావున నాయాసముఁ గలిగించుకొనక నెమ్మదిగ నుండుఁడు. లోకంబునఁ బిపీలికాది బ్రహ్మపర్యంతముగల ప్రతిజీవికి సుఖవాంఛగలదు. ఆసుఖ మెవ్వరిది వారికేగదా? ఒకరికష్టము లొకరాలోచించుటలేదు. అటులే నాకోరికయం దేరికైనఁ గష్టము గలుగునెడల నందులకే నేమిచేయఁగలను? ఈ రహస్య మింద్రాదులు మాత్ర మెఱుంగరా? పావురంబులు మొదలగునవి ఱాలఁ దిని బ్రదుకును. జకోరంబులు చంద్రుని వెన్నెల నాహారంబుగాఁ గొని జీవంబుఁ గడపును. అందుచే నొకదాని భూషించి యొకదాని దూషింపఁ జెల్లునా? రెంటికిఁ దృష్టి సమానంబే కదా? అటులే నాకు నలవరణంబే

తృప్తికరంబుగాఁ గనఁబడు చున్నయది. మీరు నన్ను నిందింప వలదు. ఎఱుంగక బావియందుఁ బడఁబోవు వానిని బాంధవులగువారు మఱలింపఁ జూచెదరు గాని యదృష్ట వశంబున నిత్యానందసౌధము నధిరోహింపనున్న వానిని క్రిందికి లాగనగునా? మీరలిందలి యుక్తాయుక్తము లెఱుంగుదురుగాక" యని తన చెలుల వారించి యింద్రదూతి కతో నిట్లనియె. "ఓ శంభళీ! పతివ్రతాతిలకంబునకు బ్రాణనాథుని బొగడికఁ దప్ప నితరుల గుణోత్కృష్టత వినుట పాడిగాదు! ఈ క్షణమునుండి మీప్రభువుపై యాన; యింక మాటలాడకుము.

చ॥ తన హృదయాధినాయకుని; దక్కఁగ దక్కొరు సన్నుతింపఁగా
వినుట సతీవ్రతంబునకు విగ్రహం; మిట్టిది ధర్మశాస్త్ర వా
సన; యటుగాన, నో దివిజ శంభళి, యింకిటుఁ బట్టి నీకు మీ
యనిమిషరాజు పాదములయాన సుమీ మఱియేమి పల్కకన్ ॥

అని ఖండితంబుగా నుడివి శంభళిని సాఁగనంపఁ దక్కుంగల యమాగ్నివరుణ దూతికలు తమకుం గూడ నయ్యదియ సమాధానంబుగాఁ గైకొని తగువిధంబున నా రాకుమారిని వీడ్కొని చనిరి.

అటుల స్వకీయరూప పరితిమల నదృశ్యుండుగా నుండిన యా నిషధనాథుండు, దమయంతి వాక్చాతుర్యంబు దనపై నుండిన గాఢమోహంబుఁ గాంచి సమ్మోదమనస్కుండై యామె యా పాదమస్తకంబుఁ దిలకించి మోహావేశము నంది

తన్మయుండై యుండె. అంత నాతనిదృష్టి, ముఖచంద్రినం దలి యధరామృతంబున మునింగియో కుచశైలమధ్యంబునఁ బడి నలుఁగఁ బారియో, నాభీగుండంబున నడంగియో, కాని యాయా తావులనుండి మఱలిరాకయుండె. లేక స్థనకల శంబులనలందిన కస్తూరికాతమంబునఁ గాఁబోలు మఱియొక చో జనలేక నా కుచప్రాంతంబునఁ బరిభ్రమించుచుండె. పిమ్మట నెట్టులో యాదృక్కు బయల్వెడలి నేను నేత్రిము; జీరయు నేత్రంబ. నా నామసామ్యంబుఁ గొన్న చీర యామె కటిభాగంబు నాక్రమింప నాకుఁ గూడ యోగ్యంబ కాదె? యని నాకటీచక్రింబును నూరుయుగ్మంబును బరివ్వంగ మొనర్చె. ఆ రాజకంఠీరవుండు సఖీజన పరివృతయగు నబ్బీమపుత్రింగాంచి మనంబున నిట్టుల భావించుకొనుచుండె "ఆహా! యన్నలువ తనరచనా చాతుర్యంబుఁ బ్రిపంచము నకుఁ జూపఁదలఁచి గాదె యింత భువనమోహన కారిణి యగు నీ కమలాక్షిని సృజించె? ఈ లావణ్యవతిఁ బోలిన సుందరీమణి యీ భూమండలంబున నెయ్యెడలేదు. ఒక్క యీ ధరాచక్రంబే యననేల? స్వర్గాదిలోకంబులఁ గూడ నిట్టి మోహనాంగి యుండఁబోదు. ఈరమణీమణియంగకంబుల కాంతి పదియార్వన్నె బంగారు కరణి నుండి మెఱపుల చందంబున మిఱుమిట్లు గొలుపుచున్నయది. ఈ సౌందర్యతిలక మేని చాయకు సాటి చూతమన్న బంగరు మొగలి రేకులు ధూళి సంతయుతంబుగ నుండు. తామర దుద్దులునోడి జలదుర్గంబున వసియించుచున్నవి.

ఔరా! యీమె ధరించు నానావిధవర్ణరత్నస్థగితంబు లగు భూషణంబులు, వజ్రాయుధంబు నింద్రధనస్సుఁ బరిహసించి రక్తిగ నుండుచున్నయవి. యీమె జడ నెమ్మిపింఛముం బోలి యున్నది.

ఈకోమలి నీలంపుముంగురులఁ జెన్నారు ఫాలంబు, కృష్ణాష్టమినాఁటి చంద్రుఁ గేలిసేయు. ఈతన్వి సమ్మోహన కరంబులగు కనుబొమలతీరుఁ జూచిన నీశ్వరుని మూఁడవ కంటిచే మన్మథునివిల్లు పొగచూరిననాఁడు సమంబగు. అహో! ఈకెమ నడుము, పిడికిటనిమిడి మన్మథునివింటి నారినుండి వెలువడు శాతబాణంబులవలె, నీమె క్రేఁగంటి వీక్షణంబుల వర్షింపఁ జేసి నావంటి విరహుల ననయింపఁగలదు. ఈమెనేత్రంబులు నాచతు ర్ముఖుండు, కోరికమై నల్లగలువల కాంతిపుంజంబును రంభా తరుగర్భదళంబుల ధావళ్యంబును గ్రహించి, యాకర్ణాంత ములుగా నుండునటుల విశాలతమంబుగఁ జేసియుండెను. ఈతన్వి నేత్రంబుల ధావళ్యముఁ గూర్చుటయే కాక యమృతంబుఁ జిలుకరించి, పిదప గరళంబుఁ గూడఁ జల్లి నిర్మించియుండును. అట్లుఁగానిచో నీక్షింపఁగ నానందమును ఘటియించుచు నొకసంక నీమె క్రీగంటివీక్షణబాణంబులునాటుకొని యేల యింతబాధఁ గలిగింపఁజేయు? ఈమె నాసిక తిలపుష్పములఁ గేలి సేయు. అధరరక్తిమ పగడమును, మంకెనపూవును, దొండ పండును నిరసించి విరాజిల్లుచున్నయది. ఈయెలనాగ లేనవ్వు సం దొకపాలున కాచంద్రుని ముదిమివెన్నెల సరిపోలఁజాలదు కదా! ఔరా! ఈమె దంతపంక్తులు ముత్యంబుల బారువలె

నెంతయు నొప్పియున్నవి. అవిఘ్రాత దిరిసెనపూవులకంటె నతిమృదులంబగు నీమె మేనుఁగల్పించి, యంతకంటె మార్దవంబులగు వచనంబులఁగూర్చి చరితార్థుండయ్యె. ఈ కోమలి కంఠస్వరంబు కోకిలారావంబుకంటె మధురతమంబై యెంతయుఁ గామోద్దీపన మొనరించుచున్నయది? అహో! ఈమె వాక్యరచనం బమృతధారా ప్రవాహంబునలె ననర్గళంబై యెడతెగని యానందముఁ గూర్చుచున్నది. రాజాధిరాజును సేవించు రాజపుంగవుని మాడ్కి యీమె ముఖపద్మంబు నాశ్రయించి, నేత్రపద్మములు సేవ యొనరించుచున్నయవి. అధరామృతంబు గలిగిన యీమె మోమునకు, సుధాకరుండగు చంద్రుండు సార్థకత్వముగా దోషాకరుండౌట సరిపోలఁజాలక తిరస్కృతుండయ్యె. ఈమె వీనులు శ్రీలనొసఁగు శ్రీకారంబుల భాతి భాసిల్లుచున్నయవి.

ఈ లతాగాత్రి కంఠము శంఖమునుబోలియుండి గళంబుననుండిన రేఖాత్రయంబు కవిత్వ గాన ప్రియవాక్యంబులకు నెల్లలుగ నజునిచే విరచింపఁబడెఁ గాఁబోలు; ఈ యతివ బాహువులకు నోడిగాదె తామరతూండ్లు జలదుర్గంబునదాఁగి ఛిద్రంబు నొందియున్నవి. ఈమె కరంబులు నఖరాగ్రబాణంబులు గల మన్మథుని యమ్ములపొదుల జంటవలెఁ బ్రకాశించుచున్నవి. అట్టి యీ రమణిని మాదృశులగు వారలుఁ బొగడవశమా? తారహారనిర్ఝర సలిలధారా సహితంబులగు నీమె కుచశైలంబుల కుపమానంబు వెదుకఁ, దత్తుల్యసద్గుణాదిక లోపంబునఁ గనకకలశ చక్రవాకాదులు సరిపోలఁజాల

నున్నయవి. యౌవనాతిశయంబున నిమ్మగువ కౌను సన్నగిల వళిత్రయం బాక్రమించుటయ కాక, పై భాగంబునుండి కలుగు కుచయుగ్మ విజృంభణంబున నా నడుము గానుపించ దయ్యె. ఔను "ఉద్ధతులమధ్యఁ బేదలకుండ వశమే" యను నార్యసూక్తి సార్థకంబయ్యె గదా! ఈ చంపకగంధి స్తన యుగ్మశాతకుంభకుంభములను, సుందరతమంబగు రోమావళీ పాశంబును, గంభీరంబగు నాభీకూపంబుఁ గాంచ నా నేత్రంబు లెంతయుఁ దృష్ణవహించుచున్నవి. ఈమె వీపునందలి మల్లికా గచితంబగు వేణిఁజూడ నియ్యది సువర్ణఫలకంబున యింద్ర నీలంపుఱేకుఁగూర్చి యందు ధావళ్యంబునుండునట్టుల ముత్యం బులవోలె వ్రాసిన యక్షరంబులు గల మన్మథుని జయశాసనం బని దోచుచున్నయది. తండ్రియైన యా నారాయణుండు సుదర్శనమను చక్రాయుధముంగొని జగంబులు గెల్చుచుండ మన్మథుం డీమె విపులకటిచక్రంబుంగొని యిజ్జగంబును గెలువఁ దలంచెఁ గాబోలు.

తే. చిగురుబోణి భ్రూవల్లరి చిత్రరేఖ;
యింతి నాస తిలోత్తమ, యింత నిజము;
చెలువ యూరుకాండద్వయీ సృష్టి రంభ;
మానినీమణి మధురోక్తి మంజుఘోష.

ఈ చిగురుబోణి భ్రూవల్లరి చిత్రరేఖయు, నీ యింతి నాసిక తిలోత్తమయు, నీ తొయ్యాలి యూరుయుగ్మనిర్మా ణంబు రంభయు, నీ మానినీమణి కంఠస్వరంబు మంజుఘోష

యున్నై యామాయప్సరసలంగూడ నతిక్రమించి విరాజిల్లుచున్నయవి. ఈమె చీలమండ యదృశ్యమగుటంబట్టిచూడ, యరుంధతీ రతీ శచీ లక్ష్మీదేవీ ప్రభృతులగు మహాపతివ్రతలవలె రాజిల్లుచున్నయది. ఈతరుణి పాదంబులు కమలంబులు వోలె మృదులతమంబులై యున్నయవి. ఈ సుందరియశస్సు పాదాంగుష్ఠ నఖద్వయ ముఖంబులనెడి నలువుర నిండుచందురులఁ గలిగి యుంటచే గాఁబోలు. తత్కళలగు నఱువదినాలుగు విద్యలయందుఁ బ్రవేశంబుగలిగి విరాజిల్లుచున్నయది. ఇట్లు నఖశిఖపర్యంతముఁగల యవయవంబుల వేఱువేఱవర్ణించి యానందాతిశయంబునఁ దనసుందర రూపంబునామెకుఁ బ్రత్యక్షంబు సేయగోరి యామాయారూపంబు వదల, నజ్ఞానాంధకారముపోయిన పిమ్మటఁ దోఁచు జ్ఞానానంద మయుండగు పరమాత్మునిలీల, హిమం బంతరించినపిమ్మట దీపించు ప్రభాకరునిపగిది ధగద్ధగాయమానంబుగ వెలుంగు నారాజపుంగవుని రూపం బాత్తోయజాక్షులకు నేత్రపర్వం బొనరించె.

# ఆంధ్రనైషధ సారము.

## చతుర్థాశ్వాసము.

ఆయద్భుతంబుఁగాంచి లజ్జాభయ సంభ్రమంబులు పెనఁగొన నాయిందీవరాక్షు లాసనంబులనుండి లేచి గౌరవించిరి. దమయంతి ధీరోదాత్తగావున నటులనే పీఠంబునఁ గూరుచుండి యమేయానందము నందుచు, మీరలెవ్వారు? ఎందులకిట కేతెంచితి? రని యడుగఁదలంచి యితం డుపేంద్రుఁడో లేక చంద్రుఁడో యని సందియంబునందుచు, హంసయొసంగిన రూప లేఖనంబున కీయాకారం బీడగుటంగాంచి యీతండు నిషధ రాజనియు- నటులయిన నాయంతఃపురంబునకు రా నొరులకు సాధ్యంబుఁగాకునికి నాతఁడే యని విశ్వసింపక యనిమేష నయ నంబులఁగాంచుచు, నీతండుగూడ నెప్పటి మిథ్యానలుండేయని తలంచి సిగ్గుఁజెందక వదనపద్మ మొకించుక వాల్చి సాను రాగంబుగ పీఠంబుఁజూపి "అనఘా! యతిథులు గృహంబున కేతెంచినపుడు వారికిఁదగు మర్యాద లొనరించుటార్యధర్మము గానఁ గార్యాంతర విఘాతంబులు లేనియెడల నీ కనకసింహాస నంబున నాసీనులయ్యెదరుగాక; శిరీషకుసుమంబులఁ బోలు

మీపాదకమలముల నెంతదూరమునుండి నడిపించి నొవ్వఁజేసి తిరి? ఎటనుండి యెయ్యెడ కేతెంచుచుండిరి? మీనామంబెద్ది? రక్షకభట సంరక్షితంబగు నీయంతఃపురం బే విధంబుగఁ బ్రవేశించితిరి? ఈ సాహసమునకు మమ్ములఁ గృతార్థులఁ జేయుటయా ఫలము? భయంకరులగు ద్వారపాలకుల నంధులఁగాఁ జేయఁగల 'తిరస్కరిణీవిద్య' మీకెవ్విధంబున లభించె? నీవు పురూరవుఁడవో? నలకూబరుఁడవో? మన్మథుఁడవో? జయంతుఁడవో? కాక నలుండవో? నిజముఁజెప్పుము. చంద్రునింగన్న పాలసముద్రంబువోలెనిన్నుం గాంచిన యీవంశంబెయ్యది? నీవుమానవుండవైనచో నీభూమి ధన్యంబైనది; లేక విబుధుండవైనచో స్వర్గభాగ్యము గణియింపరాని దగు. అధోలోకంబగు పాతాళంబున నీవు జన్మించినయెడల నయ్యది సంపత్తుల నన్నిలోకంబులకంటె నుత్కృష్టము వహించును. మాన్యుండవగు నీవు మామందిరంబుల నడుగిడుట మా పూర్వపుణ్యవశంబునఁగాదే! నేఁడు మీరాక మూలంబున మాభవనంబులు పావనంబులయ్యె. మేముధన్యులమైతిమి. మాజన్మంబులు సఫలంబులయ్యె. మా నేత్రంబులకుత్సవంబైనయది. మావీనులు తమ వాగమృతంబును గ్రోల సంసిద్ధముగా నున్నయవి; కాన బ్రసాదింపుమని వేఁడెను. ఆ యిందీవరాక్షి మధురాధరమునుండి వెడలిన తేనెలొలుకు పలుకు లాతని హృదయంబుఁ జొచ్చి యమేయానంద మనుభవింపఁ జేయుచుండెను. దమయంతి యాజ్ఞను సఖీజనంబులు కనకసింహాసనంబు నునుప, నుదయశిఖరియందు వసియించు

బాలసూర్యుని భంగి నిషధేశ్వరుం డుపవిష్టుండయ్యె; నప్పు ద్దమముఖు లర్ఘ్యపాద్యాదు లొసంగి సత్కరించిరి. అట్లు సత్కారంబు నందిన యాతండు సఖీజనంబు లూఱకఁ జూచు చుండ, మేఘగంభీరధ్వానంబైన యెలుంగున నా రాకుమారితో నిట్లనియె.

## నలదూత్యము.

మానినీమణీ! ఇచ్చటి జనంబులు మనవారలే? పెఱవారలు లేరుగదా! ఈ వృత్తాంతంబు నాకర్ణించుటకు నీమనంబు నిశ్చలంబుగ నున్నదియే? వెంటనే చేయందగు కార్యంబునకుఁ గాలయాపనంబేల? ప్రాణంబులభంగి నీకార్య భారంబును వహియించి సురవతంసముల యాస్థానమునుండి నీకడ కతిథిగా నేతెంచియుంటి. నా రాయబారంబును ఫల సమంచితముగా నొనరించుటయే నాకు సత్కారంబు. ఇంద్రాగ్నియమవరుణులు నిన్నుఁగోరి యంపిన సందేశంబును సావధానంబుగా వినుము. నారదునివలన నీ నవమోహనరూపంపు వృత్తాంతమును సభా మధ్యంబున విని యెంతయుఁ జలించి పంచబాణవశులై తమ చిత్తవృత్తినంతయు నాకుఁదెలియఁజెప్పి యద్దేవచతుష్టయంబు పంప నిదె పనిఁబూని వచ్చితి. ఆనల్వురలో దేవేంద్రుఁడు నీమీఁది విరహంబుచే నీశ్వరుని శిరోభూషణంబుగా నుండిన చంద్రకళ తన్నుఁ గాల్చునేమోయను భయంబున గైలాసంబు నకుఁ బోవక మహేశ్వరసేవమాని, యాకాశ గంగా ప్రాంతం

బునందలి నందనోద్యాన వనంబున మందారతరు మృదుపల్ల
వంబుల శయ్యపైఁ బరుండి బహుభరంబున దినంబులుగడుపు
చున్నవాఁడు. అతండు, లేమావి చిగుటాకులఁ గడుపారమేసి
కూయు కోకిలకుహూకారంబుల వినఁజాలక వేదననుభవించు
చున్నవాఁడు బాలారుణుండగు సూర్యుని దాపునఁగాంచి
చంద్రుండను భ్రాంతితో రోషారుణిత నేత్రుండగుచు, విరహ
తాపంబు నందుచున్నవాఁడు. మఱియుఁ బుష్పగంధీ! ఏవేల్పు
మూలంబున జన్మంబులుగాంచి సోమయాజులు సోమరసంబు
గ్రోలుచుందురో యీశ్వరునకే వేల్పు ముఖ్యతనువునటివాఁడో
యట్టి యగ్ని దేవుండు నిన్ను వలచియున్నాఁడు. మహేశ్వరుని
నేత్రమిషంబునఁ దను నాశంబొనర్చిన యుపకృతిని మనంబున
నిడుకొని, మరుండు నీకటాక్షాంచలంబు నాశ్రయించి బాణా
గ్నిఁ బ్రయోగింప నాతఁడుమిగుల మోహాతిశయంబున నొగు
లుచున్నవాఁడు. అగ్నిహోత్రుండు మంత్రాహుతుల గ్రహిం
చుటమాని నీయధరామృతంబునకు మిగుల నాసఁగొనియున్న
వాఁడు. తరుణీ! దక్షిణ దిక్పాలకుండగు యముండు నీరూప
గుణాధిక్యంబులవిని, నిరంతరము నీధ్యానంబునే యొనర్చుచు,
విరహజ్వరాతిరేకంబునఁ బాండుర దేహుండగుచుండె; అధర్మ
పాలునకీవు వరంబొసంగి రక్షింపుము. కాంతామణీ! పశ్చిమ
దిక్పాలకుండగు వరుణుండు నీయందత్యంతాను రక్తుఁడగుట
సముద్రంబునందలి బడబానలంబుఁబోలె నీవిరహాగ్ని యాతని
హృదయంబును దహించివైచుచున్నయది; గాన నాతనిరక్షిం
పుము. ఇవ్విధంబున నాదేవతలు నీమోహప్రవాహంబునఁబడి

సీఁదులాడుచు, నెల్లియుదయంబున నీస్వయంవర మహోత్సవ సుదినంబని విని స్వర్ణవిమానంబెక్కి బయల్వెడలి భూమండలంబుఁ బవిత్రంబుగాఁ జేయఁ దలఁచి, నీ పురంబునకు సమీపంబున విడిసియున్నవారలు. తద్వాంఛతో నేను నేతెంచుచుండ నన్నుం బిలిచి యీ సందేశంబును నాదు ముఖంబున నీకుఁ దెలుప నంపిరి. విరహానల రూపంబుగా దహింపఁజేయనున్న యాపమృత్యువునుండి తమ్ముఁ రక్షింప నిన్నుఁ బ్రార్థించుచున్నవారలు. కుశలప్రశ్న పూర్వకంబుగా నాదేవతలు నీకుఁ జెప్పుమనిన పలుకులివియే యాలకింపుము. "నీ శీతల బాహులతా పరివృతులఁగాఁజేసి కాపాడుము. మాప్రాణంబుల నీవనుగ్రహించి సంరక్షణం బొనరింపుము. మాకుఁ గల దేవత్వము నీకోసంగఁదలఁచి మేమే సిగ్గుపడుచున్నవారము. నినుఁబోలు సుందరీమణులు మాదేవలోకంబున వెదకిన మందునకేనియుఁ గానుపింపరు. అందుచే మేమే నిన్నాశ్రయించి వేఁడుకొనుచున్నారము.

"శా. మాదివ్యత్వము నీకు నిత్తుమని సంభావింప సిగ్గయ్యెడిన్
వైదర్భీ భవదీయ రూపవిభవైశ్వర్యంబు మాభూమియం
దేదీ? దీనికిఁ బ్రత్యయంబిదియపో, యేమెల్లనుంగూడి నీ
పాదాంభోజము లాశ్రయించెదము తాత్పర్యంబు సంధిల్లఁగ౯॥"

మఱియు మన్మథుండు నీభ్రూవల్లరి, మందహాసము, గ్రేఁగంటి ప్రసారము, మొదలగువానిఁ దన యుపకరణంబులుగా గ్రహించియే, లోకంబులన్నిట దిగ్విజయ మొందు

చున్నాఁడు. నీరూపధ్యానంబుచే రాత్రులయందు స్వప్నంబున మహానందింపఁజేయుట, మాయింద్రియంబులన్నియుఁ బ్రత్యక్షానుభవంబునొంద నభిలషించుచున్నయవి" ఇవ్విధంబుగ వారొండురులు చెప్పి నన్నంపియున్నవారలు. నీకాసందేశంబు నంతయు వినుపించితిఁ గావున, కమలాక్షీ! యనురాగంబు మీరఁబురుహూతునినో, పావకునినో, యమునినో, వరుణునినో నీ యిచ్చవచ్చినవారిని నొక్కరుని వరియింపుము. అన నాబింబాధరి, యావృత్తాంతంబు నంతయు విని యనాదరణంబును భ్రూవిక్షేపంబున సూచించుచు నారాజకుమారునితో నిట్టులనియె. సుగుణధామా! నేను నీవంశనామంబులఁగూర్చి యడుగ నయ్యది వచియింపక యప్రస్తుత ప్రశంసయైన యెద్దియో వృత్తాంతంబు లింతవఱకుఁ జెప్పితివి. ప్రశ్నయొండడుగ సమాధానము మఱొండువచించు టేమి న్యాయము? మీ మధుర వాక్యంబులెంతయు నా కానందముఁ గలిగించినవి. దాహముఁ గొన్నవానికి జలమావశ్యకంబుగాని యాజ్యం బవసరంబు గాదుగదా? దేవేంద్రాదు లెక్కుడువారైన నేమి? కాకున్న నేమి? నీ వంశాదికంబుల విషయంబుఁగూర్చి వినిపించుము. నా ప్రశ్నంబునకు సమాధానం బొసంగకుంట మీపై నప్పై యున్నయది; ఇఁకనైన నా ఋణంబుఁ దీర్చుకొమ్ము. నీవే యన్వయంబున నుదయించి పావనం బొనరించితివి? నీ నామంబుచే నేయక్షరంబులు ధన్యతఁగాంచినవి? అని పలికి యూఱకుండె.

నిషధాధిపుఁడు "కోమలీ! ఉచ్చస్థితియందు వంశ

నామంబుల వినిపించుట యుచితంబుగాని యిట్టి నీవసమ యంబున నయ్యవి పేర్కొనుట ధర్మముగాదు; అట్లు చెప్పు కొను టనమానంబు కాదా? నీకు నా వంశనామంబులతో నగునదేమి? అయినను నీవు రాజకన్యవగుట నీమాత్రంబు చెప్పెద. మనోహరాంగీ! నేను చంద్రవంశమునం దుదయించిన యొకరాజను; పేరడుగఁ దలంచిన నా ప్రయత్నంబును మానుము. తన నామంబు నుడువుకొనుట వేదశాస్త్రాచారం బులకు విరుద్ధము. ఎదుటనున్న నీసమయంబున నేను నీవను పదంబులతో వ్యవహారము జరుగుచుండఁ, బేరుఁజెప్పుమని యడుగనేల?" యనియెను. ఇవ్విధంబుగ నాభూమీశ్వరుండు వచియింప నా దమయంతి "మీరు మీ వంశం బెఱిగించి నామంబుఁ జెప్పకునికి మమ్మనుమానించినట్టుల కాదే? మీరు మమ్ము వంచింపఁదలఁచిన నేముగూడ నంతమాత్ర మెఱ ఱింపఁజాలమా? స్వకీయ నామధేయంబుఁ జెప్పుట ధర్మశాస్త్ర విరుద్ధమేని, యన్యపురుషులగు త్వాదృశులతో మాటలాడుట మాబోంట్లగు రాజపుత్రికలకుఁ దగునె? అందునను రూపవంతు లగు మగవారలతో నంతఃపురంబున యౌవనవంతులగు కుల కాంతలు సంభాషింపఁదగునే? మీరే వచియింపు" డనియెను. నలుండది విని ప్రత్యుత్తరంబు నొసంగ నేదియుఁ దోఁచ కునికిఁ గరుణాపూరిత కటాక్షంబుల నామెపైఁ బఱపి, బింబాధరీ! నీ సుధామధురంబులగు పలుకుల నితరుల కొఱకు వ్యయింపకుము. వెన్నెలందిరస్కరించు నీ క్రేఁగంటిచూపు లా దేవతాచతుష్టయంబుపైఁ బ్రసరింపఁజేయుము. నా నుడివిన

ము నా కార్యంబు నా గమనాయాసంబును గమనించి సఫలం
బుగా నొనర్పుము. నీయదృష్టమును మదిఁదలఁచి కళ్యాణ
స్త్రై భవమునందుము. నాయందీవు కనఁబఱచిన దయాకారసంబు,
మన్ననయు సంతియ చాలు; చేతులుమోడ్చి నిన్నుఁ
బ్రార్థింతు. నన్నుగుఱించి యాదేవతల నరియింపుము.
నారాకకై వారునలువు రభివీక్షించుచుందురు; గాన నీవుకాల
యాపనం బొనరింపఁ బాడిగాదు. మన్మథతాపంబున నా
యిందుఁ డేమైనవాఁడో? వరుణుం డేవిధంబున నుండెనో?
దండపాణి యేతీరుగ నున్నవాఁడో? యగ్నిహోత్రుం డేకరణి
నుండెనో? యెఱుంగ రాదని నలుండు పచియించె. అంత
నాభీమరాజకన్యక యిట్లులనియె.

రాజా! మీమాటలువిన నవ్వువచ్చుచున్నయది; కాని
యన్యానర్పుల ధర్మముకాదు. మీ మాటలు యుక్తములు
కావనిన నిందించుట యగు. పలుక కూఱకుండిన
నవమానించుట యగుఁ గానఁ బ్రత్యుత్తరం బొసంగు
చున్నదానను. ఆ దేవేంద్రునకు నాకుఁ దలంచిచూడ
హస్తిమశకాంతరంబున్నది. ఆ ప్రాచీనబర్హికే నెవ్వి
ధంబునఁ దగినదానను గాను. రాజచంద్రుఁడగు నలుని
వరించిన యే నొరుని నిందించిగాని, భూషించిగాని పరపురుష
ప్రశంసఁ జేయనోప. అప్సరోంగనా విటుండు మానవ
కాంతను వాంఛించు తెఱంగుఁజూడ, నానావిధరత్న భూష
ణాలంకృతులగు రాజన్యుల కిత్తడి కడియ మందము ఘటి
యింపఁజాలని రీతియ యగు. వేయిమాటలేల? రాజా

నా యీ ప్రతిజ్ఞ వినుము. నేను నిషధరాజును వరియించి యున్నదానను. ఒకవేళ నాతండు స్వీకరింపనిచో నీటఁబడియో యగ్నిమూలంబుననో, నాప్రాణంబు నాతనికి సమర్పించెద. నాకు నలవరణంబో మరణంబో తప్ప యితర కార్యం బొండు లేదనియెను. ఆ వాక్యంబులకు నిషధరాజు మనంబునఁ గుతూహలంబు వహించి యిట్లులనియె. పేదవానియింటికిఁ బెన్నిధి రాఁ బ్రియత్నింపఁ గవాటము వైచికొని యడ్డగించునట్లు లమరుల నీవు వరియింపకుండుట నీయభాగ్యంబగాదే ? ఆ దేవతలు మానవకాంతవగు నిన్నుఁ బ్రార్థింప నలదని యొక సామాన్యమానవుని వరియింపఁబూనుట నీ యదృష్ట హీనంబే యగు. అయ్యో ! ఇంత యవివేక కూపంబున మునుఁగు చుంటివేమి ? బాగుగా నాలోచించుకొనుము. నీవు ప్రాణ త్యాగం బాచరింపఁ దలంచి యురిఁబోసికొందువేని దేవేంద్రుండు, నగ్నిహోత్రంబునఁ బడితివేని వైశ్వానరుండును, జలపాతంబు నొందితివేని వరుణుండు, మఱేవిధంబుననేని మేను వదలిన యముండును, నిను స్వీకరించి పాణిగ్రహణం బొనరించు కొందురు; గనుక 'ఘట్టకుటికా ప్రభాతన్యాయం బుగ' నిప్పుడు వరియింప ననినను దుదకు వారిపాలఁబడియే తీరుదువు. ఇంక మచ్చరము మాని నామాట యంగీక రింపుము. ఐరావతాధిరూఢుండగు నిందు్రనో, తేజస్వరూ పుండగు నగ్నినో, న్యాయాన్యాయంబుల నిర్ణయించు యమునినో, సప్తసముద్రాధి పత్యమును వహించిన వరుణునో నేరిని వెదకి వరియించెదవో వరియింపుము. నీవివేచనాశ క్తి

నిప్పుడేఁ గనుఁగొనియెదగాక. అని మహారాజు వచియించె.

అంత నాకోమలగాత్రి కరస్థితకపోలయై విచారమానసంబున వేఁడినిట్టూర్పుల నిగుడించుచు నారాజనందనునిఁ గనుఁగొని సవిషాదంబుగ నిట్టులనియె. ఆ లోకపాలుర దుష్టసందేశవాక్యములు నాచెవులకు ములుకులై వేధించుచుండ నేల మాటిమాటికి నయ్యవి వినుపించెదవు? నీకు దయలేదా? మఱచితి; యముని దూతవగు నీవారుల బాధించుటానందము గాఁబోలు? నీనడవడి బహుక్రూరముగా నున్నయది; రేపే కల్యాణము జరుగఁగలదు. ఇఁక నీ యమంగళవాక్యముల వచియింపకుము. ఈ దోషంబంతయుఁ బోవునటుల మాకు సామర్థ్యముగలదేని నిషధాధిపుని వర్ణింపుము. సురల కేమి తోఁచరవచ్చినది? మీ రీ రెండుదినంబు లిచ్చటనే యుండుడు. రాజహంస యొసంగిన చిత్రరూపంబునకు మీయాకార రేఖావిలాసంబులు సరిపోవుచున్నయవి. నేను మీకు మాననీయురాలనయిన యెడల యింతటినుండి దిక్పాలుర యాదుష్టరాయబారంబుఁ దలంపక యూఱకుండుము. ఇదె భక్తిని బద్ధాంజలినై మ్రొక్కుచున్నదాననని మృదుమధుర వాక్యచయంబు గానుకగా నర్పించెను. నలుండు దేవతాకార్యంబునకు విఘాతంబు రానీక తనశక్తికొలఁది జెప్పి యేవిధముగానేని యొప్పింపదలఁచి యింక నిట్టులనియె. ఆ యింద్రుడు కల్పవృక్షముం బ్రార్థించి నిన్ను దేవలోకంబునకు రప్పించుకొనినయెడ, ఆ యగ్నిదేవుండు సర్వాభీష్టముల నొసంగఁగల యజ్ఞమునందు నిన్నుఁ గోరి చేబట్టినయెడ, సప్తసముద్రంబుల నొక్కపరి పుక్కిటంబట్టిన

యగస్త్యుని యముండు ప్రార్థించి స్వీకరించినయెడ, కామ ధేనువును యాచించి వరుణుండు నిన్ను బరిగ్రహించిన యెడ నీవేమి చేయఁగలవు ? నీకు దిక్కెవరు ? ఏల బేలవై యవ్యక్తమునం బడియుండెదవు ? ఈ నలువురి యం దొకరుని వరించి సుఖంబుండుము; లేకున్న నీమనోవాంఛలకు గూడ నంతరాయంబుగలుగుట ధ్రువంబు. నిర్జరుల వాంఛ నతి క్రమింపనగునా! యని పలికె. పిదప నా దమయంతి యేవిధం బుగ నీయకార్యంబునుండి రక్షింపఁబడుదు? ఇంక నేప్రకారం బుగ నన్నలునిఁ జేపట్టుదు? నను విషయంబున నేమియుఁ దోపక యధిక విచార పరీతయై నేత్రపద్మంబులనుండి వెడలి యగు బాష్పకణంబులు వర్షంబువగిది స్తన కలశంబులఁ గుఱియుచుండ గద్గద కంఠంబుతోఁ గట్టా! నాకెట్టి కష్టము ప్రాప్తించినది! హా! దైవమా! నన్నెట్టి విషమావస్థయందు మునుంగం జేసితివి? అని వెక్కి వెక్కి యతి దీనంబుగ నేడువఁ దొడఁగెను.

"సీ॥ ప్రవిమలాక్షి నభోనభస్యాంబుదములకు
నవవృష్టిధారలై యవతరిల్లి
యాకర్ణదీర్ఘ నేత్రాంభోరుహములకుఁ
గమనీయ నాళభావము భజించి,
లలితవక్షోజకుట్మల చుంబనంబున
మధుప దంపతుల సామ్యంబువడసి
కలితకజ్జలతముక్తాహార లతలలో
హరినీల రత్ననాయకతఁదాల్చి

తే॥ వేడియశ్రులు నిగుడంగ, వెక్కి వెక్కి
యేడ్వఁదొడఁగె లతాంగిపృథ్వీశుప్రేమ
మృదుల పరివేద నాతురోన్మిశ్ర మధుర
కంఠకాకువికార కాకలికయలర.”

అటులేడ్చుచు నశ్రుకణంబులఁ గొనగోట మీటుచుఁ బలవించుకొనియున్న యామోహనాంగిఁ గాంచి ప్రియావిలాప భాషణంబులఁ గలుగు హృదయఖేదమునకు మోహాతిరేకంబునకు నోర్వజాలక భ్రాంతుఁడై తన దూతకృత్యంబును మఱి యుచితానుచితంబు లెఱుంగక, భ్రాంతిరూపంబైన దమయంతిఁగా దలంచి యిట్టులనియె.

నామాదికముం జెప్పుట.

మనోహారిణీ! వీరసేనతనయుఁడనగు నలుండ; నిదెవచ్చితి. ఏల యేడ్చెదవు? మోముఁదమ్మినెత్తి కటాక్షవీక్షణంబుల నాపై బ్రసరింపఁజేయుము. నీవయే నాసంసారము సారవంతముగా నొనరింపఁ గలదానవుగదా? ఏల చెక్కుటద్దంబుల జేయిడి చింతించెదవు? నీమృదులారుణాధరంబుఁ బీటలువాఱ నేల వేడి నిట్టూర్పుల నిగుడించెదవు? ఏకారణంబునఁ గన్నీరు కాలువలు గార నేడ్చెదవు? నీసంతాపంబున కేది కారణంబు? నేనేమియు నీయెడఁ దప్పొనరింప లేదుకదా? నానామము జెప్పకుంటయే కోసమా? అంతఃపుర ప్రవేశంబకృత్యమా? దేవదూత్యంబు నేరమా? లేక మఱెద్దియో వచియింపుము. సేవకులతప్పుల నేలువారు మన్నించుట ధర్మము. నీపాదపద్మంబులకుఁగాఁ గిరీ

టస్థగితమణిప్రభల నీరాజనంబొనర్చెద; నన్ననుగ్రహింపుము. నీవదనంబును వికసింపఁజేసి, నీనేత్రపద్మంబుల హర్షరసంబుఁబూరించి, వెన్నెలందెగడు మందహాసము వెదఁజల్లి, నన్నానందింప జేయుము. నీ మధురవచనంబుల నాకర్ణంబుల జొనుపుము. నీయాలింగనం బొసఁగుము. నీయధరామృతం బాననిమ్ము. నీవలుద కుచంబులకుఁ బరిచర్యసేయనిమ్ము. అని మదనోన్మాదంబునఁ బలుకుచుఁ గొంతతడవునకు విభ్రమరహితుండై దేవతా కార్యంబు భగ్నమగుటగా భావించి మనంబున విచారపూరితుండై "అయ్యో! మోహావేశంబున నొడలెఱుంగక చేసిన యకార్యంబునకా యింద్రాదు లేమని భావింతురోగదా? సర్వ భూతాంతర్గుణ గ్రహణులగు వారలకుఁ దెలియఁబడని వృత్తం బేలోకంబునం గలుఁగఁబోదు. అమరుల కార్యఫలంబునకు నానామంబు వచించుట మోసమయ్యె. నాచేతులార నీకృత్యంబును భంగంబొనరించితి. అక్కటా! పరోపకార ధురీణుండగు నాంజనేయుని బోలఁజాలనైతి; దైవప్రయత్నంబు భగ్నంబయ్యె. ఇవ్విషయ మా సురచతుష్టయంబున కేమనివచింపఁగలుగుదు? ఔరా! ఇట్టి రాయబారము లాచరించుటకు ననుబోటి యున్మత్తులు సమర్థులే? దైవవిధిచే వివేకహీనుఁడనై యీశుభకార్యంబును వమ్మొనరించితి. దేవతలకేనియు భగవద్విధి దుర్లంఘనీయముగదా!" యని తలంచుకొనుచుఁ జింతించుచుండె.

పిమ్మట నభ్భీమపుత్రి యథార్థముగ నీతఁడు నలుండని తెలిసికొనినదై సింహాసనంబుడిగ్గి దాఁపునంగల యవనికాంత

రంబునకేగె. ఆభువనసుందరికి బతిదర్శన భాగ్యంబున మేను పులకరింపఁ జంచలలతంబోలె గొంతతడవుండి యారాజేంద్రు నితో భాషింప సిగ్గుపడి యొక ప్రియసఖికి సమయోచితంబు లగు వాక్యంబులఁ గఱపి యంప నక్కాంత యా దమయంతికి మాఱుగనిలిచి యానిషధేశునితో నిట్లులనియె. “ అయ్యా! వజ్రపాతంబుఁ గలుగనున్న యర్థికిసైతము నీవభయంబీయఁ గలుగుదువు గాన మన్మథుని పూవుటమ్ముల ఘాతంబునకు భీతి నొందిన నాకుశరణం బొసంగి రక్షింపుము. చండాలవర్తనుం డగు వసంతునకుఁ బ్రియమిత్రుండైన మారుని బారినుండి తప్పించి నన్నేలికొనుము.” అనిప్రార్థించె. అంత రాజన్యుఁడా చెలివచించిన పలుకులు మనంబున కాహ్లాదంబుఁ గూర్చుచుండి నను దేవకార్య ఘటనాభయంబున నాప్రార్థనంబుఁ బాటింపక యూఱకుండగాంచి యాతొయ్యలి రాకుమారిచెంతకేగె. తదుపరి దమయంతి “యథార్థంబుగ దూతమాత్రుండుగాని, నిషధాధిపునిముందఱ ననరాని వాక్కులేమి వల్కితినోగదా” యనియు, “నాయవివేకంబున దైవకార్యంబును విఘ్నంబొన రించితిగదా”యనియు నలుండును స్వాంతంబుల విచారంబు నందుచుండె. ఇట్లులుండ నల్దిక్కులఁగాంతులు పిక్కటిల్లఁ దొల్లింటి యాసువర్ణహంసంబు, గగనభాగంబునుండి దిగి విచా రంబున నిండియున్న యాదమయంతీ నిషధేశ్వరుల సముఖంబు నకు వారల హృదయానందములఁ బెంపొందింపఁదలఁచి యే తెంచె. తోడనే పూర్వపరిచయంబున నాయిరువురచే, నుపలా లనంబువడసి యామరాళంబు నలునితో నిట్టులనియె. “చంద్ర

వంశ చూడామణీ! ఈవిధంబుననేల చింతించెదవు? నీహృదయంబతి నిర్మలమైనది. నీగొప్పతనము శ్లాఘనీయమైనది. కార్యసిద్ధియైనం గాకున్న నీమనోవిచారంబు దేవేంద్రాదు లెఱుంగం గలుగుదురు" అని, దమయంతిం గనుంగొని "అమ్మా! దమయంతీ! నీ మనంబునందలి సందియంబును మానుము. ఈతండే నీకాంతుండగు. ఈసంగతి యాలనాడే బ్రహ్మదేవుండు నచియించియున్నాఁడు. ఇఁక మఱియొక భంగి జరుఁగఁబోదు" అని, యుభయుల నుద్దేశించి, యీ నూత్న దంపతులకు మేలగుఁగాక; స్వయంవరం బవిఘ్నంబుగ నెఱవేఱి యభీష్టసిద్ధులం బడయుదురుగాక. పరమేష్ఠియొక్క యనుగ్రహంబున నాకు సకల ప్రాణుల మనోభిప్రాయంబులు విదితంబై యుండు; ఇప్పుడు చింతాభరంబున మునింగియున్న మీ విషాదం బపనయింపఁ దలంచి యేతెంచితి. ఇఁక దిగులొందకుఁడు. పోయివచ్చెద" నని సముచితప్రకారంబున వారలిరువురచే ననుజ్ఞఁగైకొని యరిగె. ఈవిధంబున నారాయంచ సందేహవిచ్ఛేదనం బొనరింప వారన్యోన్యము చింతాభారంబునుండి విడివడియుండిరి.

## మనశ్శుద్ధి

రాజచంద్రుఁడామరాళ వచనంబులఁ గొంత ధైర్యంబుఁ దెచ్చుకొని దిక్పాలురఁదలంచి యంజలిఘటించి, సుమనస్సులారా! నేనీ దూతకృత్యంబున నిష్కలుషాత్మకుండనై ప్రవర్తించితినని మీ రెంచినయెడల ధన్యుడను; అట్లుగాక మోసమొనరించితినని భావించు నెడల నీ క్షణంబుననే నాకు

గఠినమగు దండనమును విధింపుఁడు. మన్మథుని తీవ్రశరంబులు నామేను గండిఁజేయు చున్నయవి. ఇంక నేనీ విరహానలంబున కోర్వఁజాలనని యనియెను. అంతట యవనికాంతరంబుననుండి భీమరాట్పుత్రి యా రాజకుమారునితో నిట్లనియె. "నల భూమీశ్వరా! నేను బతివ్రతను. నామనోకాంక్షదీఱ నెల్లి స్వయంవర సమయంబున, దేవతలు రాజకుమారులు నందఱుఁ దిలకించుచుండ, మిమ్ముల నిశ్చయంబుగ వరియింతు. అంత మాత్రంబునఁ దక్కుంగలవార లెగ్గుగాఁ దలంపఁజాలరు.

"ఉ॥ ఓ రజనీకరాన్వయపయోధి నిశాకర, యేఁబతివ్రతన్
గూరిమిమీఱ నొక్కరునిఁగోరి వరింపఁగ, నున్నవారి కె
వ్వారికి నెగ్గుగాఁ దలఁపవచ్చునె? నిన్ను వరింతు నెల్లి బృం
దారకులున్ నృపాలురును దక్కినవారును జూచుచుండఁగన్."

మఱియు,సమస్త ధర్మజ్ఞులగు విబుధులు నాపై నేల యీర్ష్యబూనుదురు? ఆదిని వారలకు వందనంబాచరించి తదనుజ్ఞఁ బడసి నినుఁ బాణిగ్రహణం బొనరింతు, ననియెను. ఇవ్విధంబున దమయంతీ నిషధేశ్వరు లిరువురకు జరిగిన సంభాషణాది కంబుల నంతయు నింద్రాదు లదృశ్యులుగనుండి వీక్షించుచు, రాయబారంబున నలునకుం గల నిష్కల్మష చిత్తంబునకు మహానందము నందుచు, దమయంతి తమ్ము వరియింప కునికి ఖేదమందుచు, నలుని మాయామాపునిగా నొనరించి వారలందఱుఁ గలిసి యచ్చోనుండి నిజస్థానంబున కేగిరి. దేవేంద్రాది చతుష్టయంబు మాయోపాయంబున దమయం

తిని వరియింపఁదలఁచి నలునింబోలెఁ గామరూపంబులు ధరించి స్వయంవరకాలంబునకై నిరీక్షించుచుండిరి. నిషధేశుండు దేవేంద్రాదుల యనుమతిఁబడసి భీమరాజొసంగిన రమ్యప్రదేశంబున సపరివారుండై విడిసియుండె. సప్తసాగర మధ్యస్థంబగు నీ భూమండలంబునందలి రాజకుమారులెల్లరుఁ జతురంగబలంబులతో నా స్వయంవర మహోత్సవంబున కేతెంచుచుండిరి. వారలలోఁ గొందఱు దమయంతి తమ వరియించునను నాశయు, గొందఱు బలవంతముగ నా భీమసుతను గొంపోవుదమను నూహయుఁ, గొందఱా మహోత్సవంబుఁ జూతమను నభిలాషయుఁ గలిగి యుండిరి. అట్టులా రాజతనయు లేతెంచుచుండ ముఖ్యవీధుల నినుకఁజల్లిన రాలకుండునంతటి జనసమ్మర్దము గలిగియుండెను. ఈ జనసమూహంబునంబడిన నెంతటివారికేనియు మఱల సుఖంబున నవలికిఁ జేరుటయే కష్టముగానుండెను. అంత నాతఁడీ సంకటముఁ గాంచి రాఁబోవు శుభకార్యంబునఁ దన్ను వరియింపకుండుట కిదియ సూచనయని తలంచుచుండెను.

అట్టి సమయంబునఁ గర్కోటకుండు, వంది మాగధులు పొగడుచుండ, భుజంగపుంగవులు సేవించుచు వెంట నేగుచుండ, పౌరజనంబు లబ్బురపడి గాంచుచుండఁ జనుదెంచె. మఱియు నీశ్వరుని కంఠంబున బూలమాలికగా రాజిల్లు వాసుకి యను పేరుగల నాగరాజు, తన యశోగీతంబుల నాగకాంతలు శ్రావ్యతరంబుగ గానం బొనరించుచుండ సర్వసేనాబల సమంచితుండై చనుదెంచె.

రాజ పురోహితుల దిగ్బంధాది రూపమంత్ర బలంబుచే రాక్షసుండైన నిబుతి రాలేకపోయె. స్వీయనేత్రముల జయించిన దమయంతీ స్వయంవరంబున కీర్ష్యం బూని వాహనంబగు సారంగంబురాకుంట మారుతుండు రా మానుకొనియె. ఉత్తరదిక్పాలుండగు కుబేరుండు, మూఁడు పాదములెనిమిది దంతంబులు మెల్లకన్నులను గల తన వికృత రూపంబుఁ గైలాస దర్పణంబునఁ జూచికొని సిగ్గువడి యిలు వెడలకుండె. అర్థనారీశ్వరుండగు శంకరుండు సవతి నంగీకరింపని పార్వతీ దేహము నిరోధించుచుండ నాతని కడుగు సాగక యూఱకుండె. తన భూభారంబు వహించువా రేరును లభింపకుంట నాదిశేషుండు వచ్చుట మానుకొనియె. తాతయగు బహ్మదేవుండు పెండ్లికేతెంచుట సముంచితముగాదనియు లోకభీతి నొందియు రాఁజాలకుండె. ఇట్టి సంకటములఁ గుందుచున్న వీరలు దక్కఁ దక్కంగల త్రిభువనంబులందలి వారలు దమయంతీ సౌందర్యాదికంబులవిని మరులుగొని యామెను వరియింపఁ దలఁచి యేతెంచుచుండిరి. అట్టులు ముల్లోకంబుల వార లేతేర నుచితరీతిఁ గనక మయంబులగు హర్మ్యంబుల భీమజనపాలుని సేనాధ్యక్షులు చూపి వారల నందు విడియింపజేసిరి. ఆ మహోత్సవంబు దిలకింప శ్రీమన్నారాయణాది సురసంఘంబు గగనంబున నిలిచి యుండె. సనకసనందనాది యోగీంద్రులును, మందపాల బక దాల్భ్యరైభ్యక భరద్వాజ గౌతమ ప్రభృతులగు మహర్షి సముదయంబును, నుచిత స్థలంబుల నుండి విలోకించు

చుండిరి. మృదంగ నృత్య గీతాదికంబులచే దేవతావేశ్య లాకాశ భాగంబున మనోహరంబుగ నాట్య మొనరించు చుండిరి. తత్సమయంబున సకల పృథ్వీశు లాతని రూప రేఖా విలాసంబుల కబ్బుర పడు చుండ యుక్తభూష ణాలంకృతుం డగుచు నలసార్వ భౌముండు రాజవీథి నేతెంచి సభామంటపమునంగల యొక స్వర్ణసింహాసనంబున నాసీనుండయ్యె. అతనిజూచి యింద్రాగ్ని యమవరుణులు తద్రూపంబునిచ్ఛామాత్రంబుగ సవరించుకొని తత్సభామంట పంబునకేగి నలసమీపస్థాసనంబుల నుపవిష్టులైరి. ఆ పరిషత్తు నానాదేశపు రాజులుండినను నిషధాధిపునిచేతను, నింద్రాగ్ని యమవరుణులచేతను, కల్పవృక్షపంచకంబున భాసిల్లు నందనో ద్యానంబు భాతి శోభాయమానంబై యుండె. ఇవ్విధంబుగ సువర్ణసింహాసనంబుల వాసుకి కర్కోటకాది పాతాళలోక వాసులును మేధావులగు నానారాజపుంగవులుఁ బాకశాస నాది దేవతానికరంబుఁ గూర్చుండియుండుటంజూచి సంతో షితస్వాంతుండై, భీమరాజు తనడెందంబున 'నీయేతెంచినవార లందఱుమేయ గుణప్రధానులు; గీర్తనీయులు. ఇట్టి వీరలను వర్ణిం చుటకుఁ ద్రిలోకజననియు, వాగ్రూపయు, భగవతియునగు భారతీదేవియొక్కతయె సమర్థురాలని' తలంచి నిశ్చలధ్యానం బున ముకుళితనేత్రుండై హస్తాంజలిఘటియించి భక్తిపూర్వ కంబుగ "భారతీ! అసామాన్యమైన నీకరుణాప్రపూర్ణమగు మంగళంబగుఁగాక! పూర్ణచంద్రుని నధఃకరించువదనంబు గల నీకు నమస్కారము! ఆత్మయే శూన్యమనెడి బౌద్ధవాదమురీతి

సహనముగల నీకువందనములు; సకలజ్ఞాన సంభరితమగు హృదయ కమలముఁగల నీకు జోహారులు; మంగళకరంబగు నీరూపంబునకు జోతలు; బాలారుణప్రభల రాజిల్లు నీచరణ సరోజాతంబుల కిడె యంజలిబద్ధుండ నగుచుంటి. నీవు సర్వోత్కృష్టురాలవు; సుఖమిచ్చుదానవు; క్రీడనొసంగుదానవు; నిత్యమైనదానవు; ప్రసిద్ధురాలవు. అట్టి నీవు నాయనేక ప్రణామములఁగొని నాప్రార్థనం బాలకించి నన్ను రక్షింపుము; రక్షింపు"మని బహువిధంబుల నా సరస్వతీదేవిని స్తుతింప మందస్మితవదనారవిందంబున శారద యాప్రభువతంసు ముందుగ సాక్షాత్కరించె.

# ఆంధ్రనైషధ సారము.

## పంచమాశ్వాసము.

అంత నాభారతీదేవిఁ జూచి భీమభూపాలుండును సకలరాజన్యులు కరంబుల మోడ్చి నమస్కృతులొనరించిరి. తచ్ఛుభానుకూలసమయంబున నా దమయంతీదేవిం బిలువఁబనిచె. ఎల్లజనంబులు విభ్రమావలోకనంబులఁ బఱపుచుండ, గగనంబున దేవతావేశ్యలు మంగళగానం బొనరించుచుండ, నిరుగెలంకులఁ దలిరుఁబోండ్లు వింజామరంబులు వీఁచుచుండ, నా దమయంతి చతురంతయానంబున సవిలాసంబుగఁ గూరుచుండి సభామండపంబున కేతెంచుచుండె. ఆ రాకుమారి సౌందర్యముఁ గాంచి యయ్యెడ మెచ్చనివారొకరును గానరారైరి. అందఱు సమ్మోహనకరంబగు యామె రూపంబుఁ దనివితీఱఁజూచియు నెంతకాలంబునకు దృప్తి వహింపఁజాలకుండిరి. ఇంకను నా కోమలి యవయవంబుల పొంకంబును, సౌకుమార్యంబును, గాంతినిఁ జూచి తమ సామర్థ్యముకొలఁది నుపమానోపమేయములకు సారస్యముఁ జూచుకొనుచుండిరి. ఇట్లుండ నా దమయంతి వాహనంబు డిగ్గి భారతీదేవికి భక్తిపూర్వకంబుగ వందనం బాచరింప నా లోకజనని యనేకాశీర్వచనంబు లొనరించి యామె శిరంబున మంగ

ళాక్షుతలిడి చతురంతయానంబు నెక్క నాజ్ఞయొసంగ, నధిరో హించె.

పిమ్మట నా చతురంతయానంబునకు వామభాగంబు నందుండి సనకసనందనాది యోగీంద్రులచే ధ్యానింపఁబడు చున్న యా సరస్వతీదేవి యిట్లు పలుకఁదొడంగె. "కమలాక్షీ! ప్రాగ్దిశనుండిన వీరలే ముప్పదిమూఁడుకోటుల వేలుపులు; ఇమ్మహాత్ముల వేఱువేఱ వర్ణించునెడల వేయివత్సరంబులు పట్టు. ఇందు నొక్కరుని వరియింపఁదలఁచిన యెడల నీయదృష్ట మిట్టిద యని వచింపలేము. కల్పవృక్షముల దోఁటలుఁ జింతామణివేది కలును వారలకు విహారస్థానములు. ఈనిర్జరులలో నొక్కరుని వరియించి వారి యనిమేషత్వంబు నమృతాహారంబును నీసుం దరరూప వీక్షణంబునను యధరసుధాపానంబున నినుమడింప జేయుము." అన నా రాకుమారి కేలుఁదోయి మొగిడ్చి ఫాలం బునఁ గీలుగొలిపి యా మహనీయులగు దేవతలకు వందనం బా చరింప శిబికావాహకులగు సత్పురుషులయ్యది యనంగీకార సూచకంబుగ గుర్తెఱింగి భుజంగపుంగవు సమీపించిరి. పిదప నానలువరాణి, పన్నగాధ్యక్షుఁడగు వాసుకింజూపి యిట్టులనియె. "కోమలీ! ఈతఁడు చంద్రాభరణుండగు శివుని యోగపట్టంబు గను, గంకణంబుగను, జడల ముడిత్రాడుగను, బినాకంబునకు నారిగనుండి పెక్కువిధంబుల సేవించుచుండె. మఱియు రెండు నాల్కలుగలవాఁడౌట నీశ్వరుని జటాజూటంబునందలి చంద్రక ళామృతంబును, నీయధరసుధయు నొక్కమాఱుగఁ జవిఁజూచి వ్యత్యాసంబు గ్రహింపఁగలవాఁడు. మన్మధకేళియందు మోవి

చుంబనమునకు వెలవంబనిలేదు. నీయధరోష్ఠంబునఁ బీయూషంబున్నది కాన నాతని విషంబపకారం బొనరింపఁబోదు." అని వచియింప నామెకిష్టంబు లేమియెఱింగి, సాయంకాలము పద్మసమూహము నెడఁబాపి తుమ్మెద నెట్టికలువలఁజేర్చు రీతి నా యానధుర్యులా నాగసముదాయమునెడబాపి దమయంతిని రాజలోకంబునకుం దఱియఁజేసిరి. అంతఁ దమ్ము వరియింపమికి సర్వరాజులు లజ్జవొంది శిరంబుల వంచుకొనిరి. రాజపుంగవులు తమ్ము వరియించు నను నాశఁగలిగి వికాసవదనంబుల నుండిరి.

## ద్వీపాధిపతులు

అప్పలుకుబోఁటి వరాట రాజకన్యకను వీక్షించి, "చంద్రవదనా! పుష్కరాది ద్వీపంబులనుండి సూర్యచంద్ర వంశోద్భవులగు రాజవర్యు లిదే యేతెంచియున్న వారలు ఇమ్మహారథులఁ జక్కఁగఁ జూడుము. తరుణీ! ఈపృథివీశుండు పుష్కరదీపం బేలుచుండు. ఈతని వరియించి నిర్మలజల సముద్రప్రాంతమున మీరలిర్వురు విహారం బొనరింపుఁడు. ఈతండేలు దేశంబు స్వర్గతుల్యమైనది. ఇంద్రుని శచీదేవి వరియించినటుల, నీవీతని పాణిగ్రహణం బొనరించి ధన్యురాల వగుము. ఆతని ద్వీపంబున నెట్టని కాయలచే బచ్చని యాకులచే విరాజిల్లు వటవృక్షము, నెమలిపురులచే నిర్మింపఁబడిన గొడుగు భాతిఁ గడు సుందరంబుగనుండు. ఆ యద్భుతంబును నీవచూడుము."అన భ్రూవిక్షేపమాత్రింబున నామె ప్రేమింపని సంగతి

మెఱింగి యవలకుఁ జనుండన వారొకరాజు చెంగటికేగి నిలిచిరి అంత నావాణి, "బింబాధరీ! ఈతండు శాకద్వీపంబునంతయు టేకుచెట్టు లాంఛనంబుగ నేకచ్ఛత్రంబున నేలుచున్నవాఁడు; కీర్తనీయుండు. ఈ జనపతిని 'హవ్యుఁ'డంద్రు. నారాయణుని లక్ష్మీదేవి వరియించినటుల యీరాజశ్రేష్ఠుని జేపట్టుము. ఈతనిఁగూడి శాకద్వీపంబునందలి యుదయపర్వతంబునఁ బండు వెన్నెలల విహరింపుము. ఆద్వీపప్రాంతంబునఁ జెన్నారు పాల కడలి, తీరంబులనుండు చెట్లయాకుల ప్రతిబింబ తరంగంబుల గూడి తరళకటాక్ష సంయుతంబగు నీ నేత్రంబులఁబోలి ప్రకాశించుచున్నయది. మఱియు నందు శేషశయ్యపైఁ బరుండు వెన్నుని, సీతని వరియించినం గాంచఁగలవు. నీవిహారంబున కనువగు నుదయపర్వతంబున నొప్పారు చంద్రుని సమీపంబున నేత్రానందకరంబుగఁ జూచి ధన్యత నందుదువుగాక" యని వచియించి యనంగీకారంబు గుర్తెఱింగి శారద, తెమ్మెరలం బోలిన విమానవాహకులను బరిమళ లక్ష్మినింబోలె, నా దమయంతిని మఱియొక ప్రదేశంబునకుఁ గొనిపో నియమించి, గజగమనయగు నాసుందరీమణితో నిట్టులనియె.

"చందనగంధీ! శాత్రవ గజకంఠీరవుండగు నీక్రౌంచద్వీపాధిపతి నించుక శిరంబెత్తి చూడుము. ఈతని భుజాబలంబున బాలింపఁబడు క్రౌంచమను ద్వీపంబు నావరించుకొని దధి నముద్రము రాజిల్లుచున్నయది. ఆతని దీవి యష్టైశ్వర్యంబులఁ దులఁదూగుచుండు. అచ్చటి క్రౌంచాచలంబున సుఖంబుగ విహరింపఁ గలవు. అయ్యెడ నీరతికేళి సమయంబునఁ బాడము ముత్తెం

బులఁబోలు స్వేదబిందువుల దధిసముద్రమునుండి వెడలు మంద మారుతంబు హరించుఁగాక! ఈ మహాశయునికీర్తి దశదిశలు దాఁటుచున్నయది; గాన నీతని వరియింపు” మన నారాకుమారి చిత్త మాతనియందు లగ్నంబుగాకుంట నెఱింగి కొండొక రాజతిలకంబుచెంతకు శిబికాధరులగు నప్పురుషులు గొనిరాఁ బూజ్యురాలగు పద్మసంభవు నిల్లాలా దమయంతింజూచి యిట్లనియె. “తీవబోఁడీ! ఈ పృథ్వీశుండు దర్భస్తంభ మంకితము గాఁగల కుశద్వీపం బేలుచుండు. ఈతని స్వీకరించి వసంతకాలంబులఁ బ్రాంతంబున రాజిల్లు ఘృతసముద్ర తీరంబునందలి యడవుల విలాసయాన మొనరింపు. అయ్యెడఁ బెనుగాలి నూగు తత్పత్రాసిచ్ఛేదంబునం గలుగు మేఘబిందువుల వర్ధిల్లి ప్రకాశించు దర్భగుల్మంబు కనుపండు వొనరించు; దానింగాంచుము. కలశస్తనీ! సముద్ర మథనకాలంబున నుదయంబయిన లక్ష్మీదేవి ప్రారంభమున నడుగిడినమందర పర్వతమున సంతోషయుతంబుగఁ గ్రీడనొనరింపుము; మున్ను మందరగిరి కవ్వముగా నుండినపుడు కలిగిన యొరపిడినిబట్టి మెలికలుగాఁ బ్రవహించు సెలయేరులు, త్రాడుగానుండిన వాసుకియను భావంబు స్ఫురింపఁజేయుచుండును. నీవట్టివింతలు గనుఁగొని యానందింపు” మన నాహంసగమన యాతనిసేవింప నాసలేమి వేఱొక మూర్ధాభిషిక్తుఁజేరి యబ్జిమకుమారితో నాచతుర్భుజునికోడ లిట్లులనియె. “మీననేత్రా! ఈతఁడే శత్రుభీకరుండగు శాల్మలిద్వీపాధిపతి. ఆతని ద్వీపమునకుఁజుట్టును సురాసముద్రమలంకారముగ నుండును. కత్తిలేని సమయమందుఁగూడ నా

ధీరవతంసంబుతో శత్రువులు పోరి, గెలుచుట యనునది కలలోనివార్త. ఈతని వరియించి నీయిచ్ఛవచ్చినట్లు సురాపాన క్రీడ ననుభవింపుము. వేసవిదినంబుల నీతనిఁగూడి సురాసాగరప్రాంతంబున నేలాలతాగృహంబుల విహరించి యానందింపుము. మఱియు గగనచుంబితశిఖరంబగు ద్రోణాచలంబున శృంగారంబుగ విహరింపుము; ఈతని బరిణయంబుగమ్ము." అన నా విలాసవతి, మందహాసమొసరింప ననురాగంబు లేకుండు టెఱింగి మఱియొక భూపాలుచెంతకేగి యాతనిఁజూపి, "సరోజేక్షణా! ఇక్షుసముద్ర పరీతంబగు ప్లక్షద్వీపంబేలు రాజతిలకుం డీతఁడే. చెఱకుపాల సముద్రపుదరి నడవులందలి జువ్వికొమ్మల నుయ్యెలలూగుక్రీడ నాతని వరియించినఁ గాంచఁగలవు" అని వచియింప నారాజపుత్రి నిరాదరణంబు వాణి యెఱింగి వేఱొకరాజన్యుని సమీపించి యిట్లనియె. "వీర లేజంబూద్వీపంబుఁబాలించురాజోత్తములు. నారాయణుని లక్ష్మీదేవింబోలె వీరలలో నీవొక్కరుని నానందంబున వరియింపుము. ఆద్వీపంబు తనకుఁజుట్టునుండి యాఱుదీవులు సేవించుచుండ, మేరుకైలాస పర్వతంబులు ఛత్రచామరంబుల భాతి రాజచిహ్నంబులుగాఁ గలిగియుండు. ఆద్వీపమున కన్నివైపుల లవణసముద్రము గలదు. ఆదేశమునకు లాంఛనంబుగ నుండు పెద్ద నేరేడువృక్షంబున వ్రేలాడి వెలుంగు మహాఫలంబుల దేవతాసంభవులగు సిద్ధాదుల గాంచి యేనుంగులవుఁగావని పందెంబులు వైచికొనుచుందురు. అట్టిఫలరసవాహినులయ్యెడ నధికంబుగఁ బ్రవహించుచుండు.

ఇట్టి వింతల నన్నిటిఁగాంచుట కాతనివరియింపు''మన నమ్మానిన వతీతిలకంబు మోముమంచి యూరకుంటఁ జూచి విరించి సతి వేఱొక భూపతిఁ జూపి యివ్విధంబున నచియించె—

## నానాదేశరాజులు.

''కళ్యాణీ! ఈ యశశ్శాలి యుజ్జయినీ పురంబు రాజధానిగ నొనరించుకొని మాళవదేశంబు జనరంజకంబుగ నేలుచున్నవాఁడు. ఈతఁడర్థుల మనోరథంబులఁ దీర్చుపట్టులఁ గల్పవృక్ష కామధేన్వాదులకంటె నధికుండు. ఈతని నంగీకరించినఁ దత్పురసమీపంబునందలి శిప్రానదీ జలక్రీడయు మహాకాళక్షేత్రంబునందలి యీశ్వరసేవయు లభ్యంబుఁ గాఁగల''దని వచియింప, నామె కాతని యందనురాగము లేమి నెఱింగి శిబికాధరులగు నప్పురుషులు ముందునకుఁ జన నాదమయంతితో వాగ్దేవి యిట్టులనియె. ''లజ్జావతీ! ఈభూతలేశ్వరుఁడు గౌడదేశంబు నేలుచుండె. ఈతఁడు కళావిద్యయందారితేఱిన నిపుణుండు. ఈ మహానుభావుని కీర్తి, చంద్రుని ధిక్కరించుచున్నయది. సంగర రంగంబుల నీ వీరశిఖామణి ప్రతాపముంగాంచి శాత్రవుల సంపల్లక్ష్మి యీతని వరియించుచుండు.

''చ. లలన, యితండు సమ్ముఖమిళద్రిపు కుంజరకుంభ మౌక్తిక
చ్ఛలమున వైరి లక్ష్మి వలిచన్నులమీఁద నిజప్రతాప సం
కలన సముద్ధితంబులగు ఘర్మకణంబులఁ బాయమీటు ని
ర్మల నిజశాతహేతి నఖరంబున నాజివిహార భూములన్‌॥''

అన నాతని చరిత మాసుందరీమణి కింపుఁగూర్పఁజాలమి యెఱింగి వేఱొకభూపాలు సమీపించి రాకుమారితో సరస్వతీదేవి యివ్విధంబున వచియించె. "ఈతఁడు మధురాపురంబును సుప్రసిద్ధస్థానంబుగ నుంచుకొని శూరసేనదేశము బాలించుచుండు. ఈతని జనులు పృథుఁడను నామంబున బిల్చుచుందురు. ఈ వీరుని పరాక్రమానలంబునకు శాత్రవులు నిలువఁజాలక బెదిరిగిడుచుందురు. మధురానగర ప్రాంతంబునందలి యమునానదియందు మీరలిరువురు సలిలవిహారంబుల జరుపుదురుగాఁత! వర్షాకాలంబున గోవర్ధనాచలంపుఁ జఱియల నృత్యం బొనరించు మయూరంబుల వీక్షింపుము. ఈ దానశీలుండు కవీంద్రుల పాణిపద్మంబుల బంగరునాణెంబుల నుంచి సదా వారల దనియింపఁజేయుచుండు. నీ సుందరాంగుని వరియింపు" మన నమ్మానవతి మానసం బాతని యందు లగ్నంబుగాకుండుటఁ దెలిసి వేఱొకరాజన్యుని సముఖంబునకేతెంచి యివ్విధంబున నాగీర్వాణి వచియింపఁదొడంగె.

"మత్తకాశినీ! ఈ పురుషపుంగవుండు కాశీరాజు. ఈ భూమీశుని రాజధాని ముక్తిప్రదంబగు వారణాసి. ఈతనికుల దైవతంబు విశ్వేశ్వరుండు. జలవిహారస్థానంబు ముల్లోకంబులఁ బావనంబొనరించు గంగామహానది. సత్రశాల, విశాలాక్షీదేవి క్రీడాభవనము. ఇట్టియదృష్టవంతుని బరిణయం బొనరింపుము. ఈ రణవీరుండు శాత్రవ కంఠనాళంబు లతి సులభంబుగ భేదమొనరించుచుండు. ఈతని పరాక్రమము సాటిలేనిది" యని వచియించుచుండ నా దమయంతి పరాకుగ నుంటఁ గాంచి

మఱొక్క మహీపాలుం జూపి నలువరాణి యిట్లనియె. "చారునయనా! ఈతఁ డయోధ్యాపతి; ఈతని నామము ఋతుపర్ణుండు. ఈ యశశ్శాలిని వరియింపుము. ఈతండేలు పట్టణంబునే తొల్లి శ్రీరాములవారు పరిపాలించిరి. ఆ పుర సందర్శనంబు మోక్షప్రదంబగు. ఈ వీరుని తాత భగీరథుండు విశ్వప్రయత్నంబుఁజేసి యాకాశగంగను భూమియందుఁ బ్రవహింపఁజేసె. ఈతండు తన తాతకంటె నధికుండయి స్వకీర్తిగంగఁ ద్రిలోకంబులఁ బ్రకాశింపఁ జేసియున్నాఁడు. ఈ రాజవతంసుని ప్రతాప సూర్య ప్రతిబింబమగు బడబానలంబు సముద్రజలంబు నింకించు శక్తిఁగలిగి యుండ, నా ప్రతాప ప్రభాకరుండు శత్రురాజుల స్థిర కీర్తినక్షత్రంబుల మాయించుచు జగంబునఁ బ్రఖ్యాతంబుగ వెలుంగుచున్నవాఁడు. ఇఁక నాతని యెదుట నేవీరవర్యులు నిలువఁగలరు? ఇట్టి పరాక్రమోపేతుని నీవు చెట్టవట్టుము." అన నయ్యది వినని భంగి యుంటఁగని మఱొక్క రాజకుంజరుం జూపి, నలువపడఁతి యిట్లనియె. "మానవతీ! ఈతండు పాండ్యదేశంబు నేలు రాజచంద్రుండు. మోముఁదమ్మి నొక్కింత యెత్తి వీక్షింపుము. ఈతని శత్రురాజులుపోరి జయింపలేక పఱుగు వారుచుఁదద్దేశంబునంగల యడవులనెల్లఁ ద్రిమ్మరుచుందురు. ఈ తేని కరీంద్రంబులు రణరంగంబున సంచరించుటఁ జూడ నడగొండలవలెం గనఁబడుచుండు. అట్టి యేనుంగుల భీభత్సంబుఁగాంచినంతనే శాత్రవులు పౌరుషం బుజ్జగించి పలాయితులగుచుందురు. ఈతని మగతనం బనుపమేయంబైనది"

యున, నా భీమకుమారి కా వాక్యంబులు ముదంబు గూర్ప జాలనందున మఱొక మహారాజు డాసి భారతి యిటులనియె.

"ఈ నృపపుంగవుండు కళింగదేశము నేలుచుండు. ఈతని నామంబు నిద్రయందు వినఁబడినను భయంపడి పగతుఱు పలుగువారు చుందురు. ఈతని కీర్తి సాగరంబున, ముజ్జగంబులు నోలలాడుచుండు" నన నా రాకుమారి నవ్వె. అయ్యది విరక్తిసూచకంబుగా నెఱింగి వేఱొక రాజుఁ జూపి యిట్లులనియె. "ఈతఁడు నేపాళదేశంబునేలు రాజర్షభుండు. ఈ ధీరుని ప్రతాపాగ్నియందు సూర్యుండేనియుఁ బడియెనేని మిడుతరీతి భస్మంబగు; ఈతని కీర్తిచంద్రికలు ప్రపంచమంతయు వ్యాపించియున్నయవి. ఈ సుగుణుని వైరివీరు లీతని పాదంబులపైఁబడి ప్రాణదానం బర్థించికొని జీవించుచుందు" రని వచియింప మాఱువలుకకుంటఁ జూచి వేఱొక ధరణీంద్రునిఁగని వాగ్దేవి, యా వనితాలలామంబుతో నిట్లులనియె. "ఇందువదనా! ఈతండు కామరూపదేశం బేలుచుండు. అనన్యంబగు యశంబు గడియించిన నృపుండు. ఈతని నీ క్రేఁగంటి వీక్షణంబుల నొక్కమాఱుఁ బరపించి చూడు" మన నూరకుంటఁ దెలిసి వేఱొక రాజకుమారుం గదిసి యా రమణీమణితో నిట్లులనియె. "ఈ దయానిధి యుత్కళదేశంబేలు పృథ్వీపతి? ఈతని యశస్సు చంద్రబింబమును, మల్లికా కుసుమంబుల, నతిశయించు ధావళ్యంబు గలిగి నిర్మలంబై యుండు. ఈ పురుష శ్రేష్ఠుండు రణరంగంబున నకుంఠితముగ విహరించుచున్నపుడు దేవతా ప్రభృతు

లీతని పరాక్రమంబుఁ గాంచి యభినందించుచుందురు. ఈ సుగుణధాముం డర్థిమనోభీష్టంబులఁ దీర్చుటయం దసమానుం డగుటచేఁ గల్పవృక్షంబు, ఫలభారమిషచేఁ దలవంపునొంది యున్నది.

‘మ॥ అసమానస్థిరదాన శైఘవకళా హంకార సింహాసనా
గ్రసమాసీనుఁడు వీఁడొకండు కలుగంగా నర్థియాచ్ఞారస
వ్యసనాభావ బహూఘవత్ఫల ఘర వ్యాజంబునన్నమ్రమై
యొస సంక్రందన శాఖిడెందమున యందెక్కొంచు మందాక్షమున్॥”

అన నా రాకుమారి! నిషధాధిపుని ధ్యానంబున మాఱు వలుకకుంటఁ గని వేఱొక్క రాకుమారుం జూపి, “దేవీ! ఈతండు కీకటదేశంబేలు ధరణీధవుండు. ఈతండు నిర్మించిన కాసారవనాదికంబులవలన జనులు సుఖంబందుచు నీ మహాభుజుయశస్సు సతతంబు గానం బొనరించుచుందురు. ఈ మహాభాగునికీర్తి జగంబులన్నిట నిండి నిబిడీకృతంబై యున్న యది.” యన ననాదర ముద్రాముద్రితంబగు చిఱు నవ్వొదయింప నవ్వాణి వీక్షించి నిషధరాజపంచకంబును సమీపింప యానధుర్యుల కాజ్ఞ యొసంగ నట్టు లొనర్చిరి.

## పంచనళి.

పిదప నలరూపధారులైన యా లోకపాలురఁ జూపి యా లోకమాత గూఢార్థ విలసితంబులగు వాక్యంబుల నా రాకుమారికిఁ జెప్పఁగడఁగె. నారీమణీ! ఈ రాజేంద్రుండు నిజవీరసేనాన్వితుండు. ఈతఁడు రణ

రంగంబుల, విచ్చలవిడి సంచరించు శాత్రవ భూభృత్తులఁ బక్షవిచ్ఛేదనం బొనరించి పీచ మడంచి విరాజిల్లుచుండు. ఈతని పరాక్రమం బనన్యమైనది. కలువకంటీ! ఈతండనలుఁడు ప్రకాశనీయుండు. నానా యజ్ఞంబుల శోభాయమానుండ గుచుండు; ధనంజయుండు. చంపకగంధీ! ఈతండు న్యాయ న్యాయ విచక్షణతాదక్షుండు. దుర్జన శిక్షానుకరణ దండ ధరుండు; మిత్రనందనుఁడు. కుటిలాలకా! ఈతఁడే సప్తసముద్రా ధిపతి. ఈతని మూలంబుననే కాలానుకూలంబుగ వర్షంబు కలుగుచుండు. అధికబల సత్వాఢ్యుం డని యివ్విధంబున, నిం ద్రాగ్ని, యమ, వరుణుల మాయారూపంబులఁగూర్చి సరస్వతీ దేవి యుభయార్థసూచకంబులగు వాక్యంబుల బోధించిన, నా భీమనందన యా భాషణంబుల వినియు వారలఁ జూచియుఁ గూడ సత్యాసత్యంబుల గ్రహింపనేరక డోలాందోళిత మానసయై, మాయారూపులగు నా దేవతల, నానిషధ రాజును విలోకించుచుండ; నసమాన రూపరేఖాసమంచితుం డగు నిషధ భూపతిం గాంచి భారతీదేవి యిట్లులనియె. "కమల నయనా! ఈతండు దేవేంద్రునిఁబోలె దాన మొసంగుట యం దపారగుణుఁడు. వీతిహోత్రుని చందంబున మహాధ్వరంబునఁ బరితృప్తినందుచుండు. యముని మాడ్కి పరప్రాణ హారుండు వరుణునిభంగి నిజవాహినీ సహస్ర సంసేవితుండు. వీనిం జూడుము. వీర లేవురలో నీయిచ్చవచ్చిన నొక్కరుని వరియిం పుము." అని యవ్వాణి యూఱకుండె. అంత నాదమయంతి వీక్షణంబు మాయా రూపధారులగు నలువుర నతిక్రమించి

మైదనవాఁడగు నలునియందు బూర్వజన్మ సుకృతంబుననో, సద్వ్రతకర్మఫలంబుననో నెలకొనియెఁ గాని వీరలలో నిశ్చయమగు నలుం డితండని నిర్ణయింపనేరక యామెమనంబు ద్రొక్కుడువడుచుండ, నీసమయంబున నాప్రియమిత్రంబగు మరాళపుంగవుండు చెంతనుండిన యథార్థమగు నలుని వెదకి చెప్పఁగదా, యని యనుకొనుచు మది నిట్టులఁ దలంచుకొనుచుండె.

భ్రమారూపకంబుగా నిందఱు నలులు గనుపడు చుండిరా? దర్పణసదృశంబులగు నే పదార్థంబుల మూలంబున నేనియుఁ బలువురుగాఁ గాన్పించుచుండిరా? లేక నా కన్ను లేమేని చెదరినవా ? ఇయ్యది మన్మథుని మాయయా ? నలుండే బుద్ధిపూర్వకంబుగ బహురూపంబులఁ దాల్చియుండెనా ? విచారింపఁగా నిది యింద్రాదులమాయయా? నాటకమా? ఏమి! అట్లుగానిచో భారతీదేవి నన్నుఁ బరిభవించుటకై యింతటి మాయఁబన్నినదా? అటుగాకున్న నీ యేవురలో నొక్కరుండు నలుండు; వేఱొకండు మారుం డొకండు పురూరవుండు; తక్కిన యిర్వురలో దైవతా వైద్యయుగ్మంబగు నాశ్వినేయులేమో ? ఏమియుఁ దెలిసికొన శక్యంబు గాకున్నయది. విబుధవరులైనయెడల వందనం బాచరించి నలుని యొసంగఁ బ్రార్థించెద. అయ్యో! మన్మథబాణపీడితులై, దయా రహితహృదయులగు వారు మాత్రమేల నలు నొసంగుదురు? ఈ సువర్ణాసనాసీనవంచకపంచకంబున దేవమానవ లక్షణభేదంబుల విమర్శించి యొక్కొక్కరిని బరీక్షించెదగాక యని యా

యేపురఁ గలయం గనుంగొని నలరూపధారులగు నింద్రాగ్ని యమ వరుణులఁ గాంచె. వారిపాదంబులు ధరణికానకయుండె. వారి ఫాలంబుల స్వేదబిందువు లుదయింపకుండె. వక్షంబు లంగలి పుష్పమాలికలు వసివాడకయుండె. వారి కన్నులు ఱెప్పపాటులు లేనివయియుండె. ఈ లక్షణంబులచే నూహింప వీరలు దేవతలు గావలయుఁ. గాన నిక నైదవపురుషుండు నిషధరాజగుట నిశ్చయము. అట్లగుట నేరికేని దేవతానుగ్రహంబు లేకుండ నేకార్యము ఫలియింపనేరదు. కాన వారికి వందనం బాచరించి నిషధరాజుపైని మోహావేశంబున మదనరాగ మతిశయింప లజ్జావశంబున నాతని మూర్తిఁజూచియుఁ జూడఁ జాలక యెట్టకేలకుఁ దన మనోహర వీక్షణంబుల సరస్వతీదేవిముఖేందుమండలమున నిల్పె. అంత నాగీర్వాణి యారాజతనయాభిప్రాయం బెఱింగి నిజహస్తంబున దమయంతీకరంబుఁ గీలుఁ గొలిపి హృదయంబు వికాసంబునొంద, నా దేవతా నలరాజులం గనుంగొని క్రేఁగంటఁ జిఱునవ్వుదయింప నింద్రాగ్ని యమ వరుణులు కరుణా తరంగిత హృదయంబులతో "నీ యింతి ననుగ్రహింప వలయు. ఏ విధంబున మిమ్ములనందఱ వరియింపఁ గలదు? ఎట్లు మీయందొక్కరునిగ్రహించి తక్కిన వారల ధిక్కరింపఁగలదు? కాన మీ యంశోద్భవుండైన యీ నిషధాధిపునిఁ బాణిగ్రహణం బొనరించి కృతార్థత నందుగాత

"ఉ. ఎట్లు వరించు సాధ్వి మిము నిందఱ? దేవచతుష్టయంబునం
దెట్టొకనిం దగంగ వరియించి తదన్యుల ధిక్కరించి వే
ఱ్వెట్టగ నేర్చుఁ? గావున వరించి కృతార్థతఁ బొందుఁగాక మీ
యట్టి మహానుభావు భవదంశ సముద్భవు నైషధాధిపున్ ||"

అంత నా దేవతాచతుష్టయంబు భారతీదేవి యభిప్రాయంబును, నిషధేశ్వరుని నిష్కల్మషమాహాత్మ్యంబును, దమయంతీదేవి పరమపాతివ్రత్య గుణగౌరవంబును, గారణంబులుగా మనంబున ననుగ్రహించి నలరూపంబులఁ బోవిడచి, సహస్రాక్షుండగు నింద్రుండు, రక్తవర్ణుండగు నగ్నిహోత్రుండు, తమోవర్ణుండగు యముండు, పాశహస్తుండగు వరుణుండును, దమతమ నిజరూపంబుల స్వీకరించిరి. అయ్యది యౌవనంబుఁ బరిత్యజించి వార్ధక్యంబు నంగీకరించిన చందంబయ్యె; పేరోలగంబున్న భూపాలకవర్గంబు గనుంగొనుచుండ రూపాంతర పరిగ్రహణం బొనర్చిన యింద్రాదు లైంద్రజాలికుల చందంబు నందిరి. అంత నా భారతీదేవి క్షీరనీర విభేదం బొనరించు హంసిచందంబున దమయంతితో "చంద్రవదనా! వీర లింద్రాదులగు దేవతలు. భక్తిమీఱ వందనం బాచరించుము. ఈతఁడు నిషధాధినాథుండగు నలచక్రవర్తి. ఈతని నీ యిచ్ఛానుసారంబుగ నందంబుమీఱ వరియింపుమనియె.

# ఆంధ్ర నైషధసారము.

## షష్ఠాశ్వాసము.

—:o:—

### నలవరణము.

అంత నా భీమరాజనందన పల్లకినుండిదిగి యా వేల్పులకుఁగంకణఝుణాత్కారం బుదయింపఁ గరయుగ్మంబుమోడ్చి ప్రణామం బాచరించి, కాంచనమయంబగు మంచకంబు సరస్వతీదేవి హస్తం బూతఁగాఁబట్టుకొని యెక్కి యా నల మహారాజు కంఠంబున నూతన స్వయంవర మాల్యంబగు నిప్పపూవులదండ నలంకరించె. మధుపఝుంకారసంకుల తమంబగు నా పుష్పమాల, యాతని స్నిగ్ధంబగు పేరురంబునఁ బ్రతిఫలించుటఁజూడ మన్మథుని పూబాణంబులు హృదయంబున నాటుకొని యున్నటులఁ దోపించుచుండె. ఆ నిషధభూవిభున కాదండ మేనఁ దగిలిన వెంటనే పులకాంకురము లుదయించె. దమయంతి స్వవాంఛ నేటికి ఫలించినందున మదనావేశానందముచే నా నలు నెట్టయెదుటఁ గొలఁది కాలము బెచ్చవడి నిలిచియుండె. ఆతీరుజూడ మిగుల మనోహరంబై యుండె. దమయంతీ సమర్పితంబగు నా పుష్పమాలిక నా నలుండు పాణిపద్మంబున స్పృశింప మహానందంబున స్వేదం బుద

యించె. ఆ హస్తకమలంబునందలి చెమరుం జూచి మదనుండీ యుక్తసంబంధమునకు సంతసించి ప్రథమంబునం బోసినదాన తోయంబుం బోలె నుండె. చిరకాలంబునకుం దమ కోరిక నెరవేరినందుల కమందానందము నందు నా నూత్నదంపతుల కింద్రాదిదేవతా చతుష్టయంబు కరుణంబూని దీవనలొసంగిరి. మఱియు ఇంద్రుండు, నిషధాధిపుండు తమకొసరించిన నిష్క-ల్మష దూతకృత్యంబునకు మెచ్చి యిప్పుడు ప్రత్యక్షంబైన యాకారంబుతో నీ యొనరించు యాగంబులం దనపాలి హవిస్సుల భుజియించెద ననియు, వైశ్వానరుం డీవు దలంచిన మాత్రంబునం బొడసూపెదనని యు, యముండు దిగ్విజయార్థంబులగు బాణంబుల ధర్మాసక్తబుద్ధియు నొసంగితినని యు, వరుణుం డీవు దలంచినచోట జలంబుదయింపను ధరియించిన పుష్పంబులు వాడకుండ ననుగ్రహించితి ననియు, వరంబు లొసంగిరి. భారతీదేవి యా మానుషాకారంబుమాని, వీణా పుస్తకపాణియు, ధవళాధికప్రకాశదేహయునై దివ్యరూపంబు ధరియించె. అంత సరస్వతియు, నింద్రాదులు దమయంతి నుద్దేశించి, యాదిశక్తియగు పార్వతీదేవివోలె ముత్తైదువవై ప్రాణేశ్వరుని యర్థాంగమవై మెలంగుము. బ్రహ్మాదిదేవతా సములగు రాజచంద్రులు నిరంతరము నీపాద సరోరుహంబులు పూజింతురుగాంత.

" ఉ. ఆదిమశక్తియైన తుహినాచలరాజతనూజవోలె ము
త్తైదువవై, నిజేశ్వరుని యర్ధశరీరము పొందుగొమ్ము; నీ
పాదసరోరుహంబు లతిభక్తి భజింతురు గాక యెప్డు బ్ర
హ్మాదిక దేవతా సదృశులైన మహామహిమండలేశ్వరుల్."

ఇట్లు దీవించి యామెను సమ్మోదమానసఁ గావించి వేరు వేరుగ నమస్కారము లందిరి. నలువరాణి, నిషధమహీకాంతుని గనుంగొని "సకలప్రభుతిలకా! మంత్రిసముదయంబునఁ జింతామణీ మంత్రరాజము ప్రధానంబైనయది; ఈయది మదీయంబైనది; ఈ మహామంత్రమును నియమంబుఁ దప్పక యుపాసన నొనరింపుము. ఈ పావనమంత్రం బాశ్రిత సముదయంబునకుఁ గామధేను కల్పవృక్షంబులఁబోలె నిష్టార్థంబుల సమకూర్చుచుండు; మంగళకరంబగు నిమ్మహామంత్రంబు నీకొసంగితి. ఈమంత్రంబుయొక్క యుద్ధారప్రక్రియను నీకిపుడు రహస్యంబుగ నుపదేశించితి. ఈమంత్రింబు మూలంబున గురుశుశ్రూష యొనరింపకయ యెల్లశాస్త్రంబులుఁ గరతలామలకంబుగనుండు. నియమపూర్వకంబుగ నేకువజామున మేల్కని. యీ చింతామణీ మంత్రంబుఁ బ్రాచీనాభిముఖుండవై జపింపుము. అందువలన నీకెల్ల శుభంబులునొడఁగూడు. ఈమంత్రార్థంబు గ్రహించు పురుషవరేణ్యులంగాంచి సుందరీమణులు మదనవశలై వర్తించుచుందురు. రాయంచయరదంబు నెక్కి యుపనిషద్వీథి విహరించుచున్న నన్ను యీచింతామణీ మంత్రమూలంబున ధ్యానించు సుజనున కయాచితంబుగ నెల్ల విద్యలు లభ్యంబులై, సాహిత్యాది సిద్ధాంతరహస్యంబులు దేటతెల్లంబుగనుండు. మదీయంబగు నీమహామంత్రంబును సూర్యోదయవేళ ధ్యానంబొనర్చి యీరాకుమారివోలెఁ గవితాకన్యకం గూడ బరిగ్రహింపుము.

కలియుగంబునఁ గాశ్మీరదేశమునందలి శారదాయత

నంబున శేషునివంటి పాండిత్యముగల బ్రాహ్మణుం డొకడు శ్రీహీరుఁడనునామంబున జనియించు; ఆతఁడు 'మామల్లదేవి' యను తనభార్యయందు జింతామణీ మంత్రఫలంబుగ నొక్క తనయుంగాంచు; నాతని, కాకాశవాణి 'శ్రీహర్షుండను,' నామంబు పెట్టు. వానికిఁబదునాలుగువిద్యలుఁ గరతలామలకంబులై యుండు. ఆతఁడు సుకవియగు. అతనికావ్యముఖంబున నీకు మహాయశంబు సమకూరు. ఎవరేనియు వేఁకునజామున, ఋతుపర్ణకర్కోటకాదులఁబోలె నిన్ను దమయంతిని దలంతురో వారలఁ గలికాలదోషంబులు పొందఁజాలవు. నారాయణునిం బోలెఁ గలికలుషంబు హరియింపగలవాఁడవు; పుణ్యశ్లోకుండవు నగుము. నేను పోయివచ్చెదను; పునస్సందర్శనంబయ్యెడుఁగాత" మని పలికి యద్దేవి దమయంతిం జూచె. పిదప వాగ్దేవియు నాదేవతా చతుష్టయంబును నిట్లువచియించిరి. "సకల పుణ్యాంగనా శిరోమణివగు నీకు సాధింపరానికార్యం బొండుండియుండదు. ఐనను దేవతలమైన మేము మనుజులకు దర్శనంబొసంగినపుడు వరంబొసంగకపోరాదు కావున మగువా! యీయదె వినుము నీపాతివ్రత్యంబునకు భంగమొదవింపజూచు మనుజుండాక్షణంబ భస్మంబగుగాక. నీవుమాకామరూపంబులఁ గాంచి మిగుల నాశ్చర్యపడితివి. ఇంతటినుండి మాకరుణచేఁ నీయిచ్ఛానుసారంబుగఁ గామరూపిణివగుము" అని వచియించి వాగ్దేవియు, నింద్రాగ్ని యమవరుణులును బంగరువిమానం బధిరోహించి గగనంబున కేఁగిరి. ఆసమయంబున రాజనందనులు లేచుటచేఁ గలుగు కంకణాదిధ్వానంబులు దేవదుందుభి

ధ్వానంబులతోఁ గలిసి భూనభోంతరాళమంతయుఁ గ్రమ్ముకొను
చుండె. విద్యాధరాది దేవతాసంభవులు పుష్పవర్షంబుఁ గురి
యించుచుండిరి. ఆసమయంబునఁ గల్యాణలక్ష్మీవిభవసమేతుం
డగు నన్నలుండు నిజశిబిరంబునకేఁగ నుద్యుక్తుండయి బయలు
వెడలె; దమయంతియుఁ గన్యాసహస్రంబు గొల్వ నిజమంది
రంబుఁ జేరం జనియె. పిమ్మటఁ దమ యంశాంచితుండగు
నలుని వీడ్కొనిపోవుటకు నద్దేవచతుష్టయంబు కడు విన్నదనం
బుతోఁ జనుచుండిరి. వాణియు దమయంతిపైని ప్రేమయెట్టిదో
కాని మాటిమాటికి వెనుకకుఁ దిరిగి యాతొయ్యలిం జూచుచు
నేఁగుచుండె.

స్వయంవరమాల్యంబు ధరించిన నలుండా సభాస్థానంబు
నుండి నిజశిబిరంబుఁ జేరు రాజవీథులఁ బోగడు దమయంతీ
స్తోత్రపాఠకులకు బంగరునాణెంబుల, వర్షంబుపగిది గురియిం
చుచుండె. ఆసమయంబునఁ గొందఱసూయాగ్రస్తులై యానిష
ధాధిపునింజూచి 'అత్యుచ్ఛ్రియఃపతనహేతు' వనెడివారును
'అతిసర్వత్రవర్జయేత్.' అనువారుఁ, 'గాముకస్యకుతో లజ్జా?'
యనువారునునై యుండిరి. అయ్యది యానలుండు వినియు
విననిభంగి శత్రువులు లేనిదానిని వచియించుట తథ్యంబు గాన
దోషరహితుండనగుటయే, దీని తత్త్వమని నవ్వుకొనుచుఁ బండి
తునిబోలె సంతోషంబుననుండె. ఇంకను నల్పులగు రాజతన
యులు వచియించు నిందావచనంబులఁ జతుర్విధవాద్యంబులు
మ్రింగివేయుచు నాధ్వానంబులు మిన్ను ముట్టుచుండె. ఇవ్విధం
బుగ నిషధరాజు శిబిరంబు ప్రవేశించె. అచట భీమరాజు జ్యోతి

ష్కులంబిలిచి, కర్పూర తాంబూల కాంచనాంబరాదులనిచ్చి పూజించి సర్వశుభలక్షణ లక్షితంబగు శుభముహూర్తం బాలోచించి చెప్పుండని కోర నాభూసురవతంసులట్టి లగ్నంబు వెదకి, యీయదె మంగళప్రదంబగు సమయంబు వేవేగఁ బెండ్లికొడుకుం బిలువనంపుఁడనఁ దగువారిని వరునిఁదోడ్తేర నియమించె.

అయ్యెడఁ గన్యాంతఃపురంబునఁ బద్మాక్షులు ముత్యంబుల మండపంబునందలి సువర్ణపీఠమున నాబాలకుమారిం గూర్చుండఁజేసి రాజకులాచార విధంబున హస్తంబున బాణంబునుంచి పన్నీటంజలక మార్చుచుండిరి. ఆసమయంబున నామె వెన్నెలం దిరస్కరించు సన్నని నలిపంబుగలిగి, వర్షంబు మాడ్కి హిమాంబువులు కుఱియుటచే నార్ద్రీభూతంబగు మేనుఁగాంచిన మనోహరంబుగనుండె. ఆమెకేశంబుల నొప్పు సలిలబిందువులు ముక్తాఫలంబులగతి మెఱయుచుండె. ఒక యిందువదన మేను తడియొత్తి రతనంపుటరుంగునంగల యొక బంగరు గద్దియ నామెం గూర్చుండఁజేసి పరిచారికా జనం బలంకరింపఁ దొడంగిరి. ఒక్కయలివేణి, యామె కుంతలంబులకు సుగంధధూపంబు నొసరించె. ఒక్కకాంత, యానీలంపు బెన్నెఱులఁగొన గోళ్లదువ్వె. ఒక్కయిందువదన, యాదమయంతి తుఱుమునం దెఱ్ఱగలువల నలంకరించె. మఱియు నవరత్నఖచితామూల్యభాసమానంబులగు ననేక భూషణంబులు చిత్రరీతి శృంగారింప నా దమయంతి మంగళాచారంబుగ దర్పణంబునఁ జూచుకొనియె. ఇట్లు చతుర్విధంబులగు శృంగా

రంబులఁ గావించుకొని యమ్మహాదేవి బ్రాహ్మణ సువాసిను లకుఁ బూజలొనరించి మోడ్పుఁగేలు ఫాలతలంబునఁ గీలించి వందనంబిడియె. బంధువులగు రాజకాంతలు వివాహ సమయా చార ప్రకారంబుగ నాభీమరాట్పుత్రికిఁ బ్రణామం బొనరించిరి.

అచ్చటఁ బెండ్లికుమారుండగు నలుండు మంగళస్నానం బైన పిదప శిల్పపారగులగు ప్రౌఢాంగనాజనంబులవలన వివాహోచితంబులగు నలంకారం బంగీకరించె. ఒక్కయతివ యాతని యార్ద్రిత కేశంబుల వీవనతో మెల్లగ వీచి తడియార్చు చుండె; ఒక్కబింబాధరి యాతని శిరోజంబుల కగురుధూపంబు నిడియె. ఒకలతాంగి పసిండిచాయ లీను నారాజేంద్రునంగ కంబుల సుగంధంబుపూఁత నొనరించె. ఒక్కలేమ, యాతని కేశంబులఁ జిక్కుఁదీసి యందంబుగ సిగఁజుట్టి పరిమళపుష్పం బుల సంఘటించె. ఒక్కచంద్రవదన యాతని మూర్ధంబున నవ రత్నకిరీటంబు నలంకరించె. ఒక మానవతి యాతని ఫాలంబున సువర్ణపట్టంబు కలితంబుజేసె. ఒక్కచామ యాతని కర్ణం బులఁ గుండలంబులఁగూర్చె. ఒక్క తీవఁబోఁడి యాతని యురంబునఁ దారహారంబుల నందంబుమీఱ నించె. మఱియు నానావిధ మణిభూషణంబు లనేకంబుగ నానలుని యంగకం బుల నలంకరించిరి. నలుండు మంగళాలంకరణంబైన పిమ్మట మణిదర్పణంబున స్వీయరూపముఁ జూచుకొనియె. అనంతరంబు సారథిగొని తెచ్చిన రథంబునెక్కి యమ్మహారథుండు ధనంజ యునింబోలె రాజమార్గంబునఁ జనుచుండఁ, బౌరాంగ న యందొక తలిరుఁబోఁడి తాంబూలచర్వణం బొనరించు

నీ రాకుమారునిఁజూచు పరాకున విలాసంబుగఁ బాణిపద్మం బున నుంచుకొనియున్న తామరతేకును మడిచి తమలపాకు నకు మాఱుగ నోట నుంచుకొనియె. ఒకచంచలాక్షి యప్సరాంగసభాతి తెప్పవాల్పక యారాజకుమారుం గాంచు చుండె. నొక్కకాంత, పయ్యెదదొలంగ మకరికా పత్త్రింబుల జెన్నారు స్తనంబులు తొంగిచూచుచుండ విభ్రాంతితో నాభూ పాలతిలకు సందర్శించె. ఆకాంతలయందుఁ "దనకుదానై వచ్చిన యింద్రాదుల వదలి, యీచిత్తజాకారుని వరించుట, యుచితం బై నదియ యగు. ఈతఁడే మన్మథసామ్రాజ్యంబునకుఁబట్టంబు గట్టుకొనఁ దగినవాఁడు. ఈతని సమ్మోహనాకారంబునకుఁ బురూరవుఁడును జయంత నలకూబరాదులు సాటియగుదురే? ఈతని సౌందర్యాదికంబు ముందఱ నింద్రాదులు మాత్ర మెంతటివార" లని పలువురు పలువిధంబులఁ దలంచుకొను చుండిరి. మఱియు "దమయంతి పాకశాసను వరియింపకుంటచే శచీదేవి యనుగ్రహంబును, నలుండు దూతకృత్యంబున దేవేంద్రుని కరుణయు, నాదంపతులిరువు రీరీతి సంపాదించు కొనిరి. కావున నానిషధేంద్రుని యపారసంపద కేకాలంబు నను లోటురాకుండుట ధ్రువంబు. పురుషశ్రేష్ఠుండగు నీ నల మహారాజునకును, మానినిశిరోమణియగు నీదమయంతికిని దాంపత్యంబెంతయుఁ దగియుండు. ఈవధూవరుల, మన్మథుండు సమంబుగ మోహంబు నెలకొల్పి పరమానందము ఘటి యించుచున్నవాఁడు. ఈసతీపతులు చాలకాలము సుర్వసుఖం బులఁ దేలుచుండెదరుగాక" యని పౌరాంగనలు దీవించుచు

నేత్రోత్సవంబుగ నాతని వీక్షించుచుండిరి.

అట్లు నగరస్త్రీజనంబులు విలోకించుచుండ నా నల మహారాజు కనకస్యందనంబుపైఁ గూరుచుండి మందగమనంబున వందిమాగధులు యశోగీతంబుల గానంబుఁ జేయ, ముందఱ మూర్ధాభిషిక్తులగు రాజపుంగవు లరు దేఱఁ దురంగఖుర ఘట్టనంబునఁ బుట్టిన ధరణీపరాగం బాకసంబుఁ గ్రమ్ముకొన శంఖ కాహళ భేరీ మృదంగ వేణు వీణాది నినాదంబులు భూనభోంతరాళంబు ప్రతిధ్వను లీన, రాజచిహ్నాంచితంబులగు పతాకంబులను, రంభాస్తంభాలంకరణంబునఁ గర్పూరరజంబున దిద్దిన రంగ వల్లులను, గస్తూరికా లేపంబున రాజిల్లు వితర్దికాతలంబులను నొప్పు పుణ్యాంగనా జన సంకులంబగు రాజమందిరంబుఁ జేరం జను దెంచుచుండె; నా సమయంబున భీమరాజు, లగ్నవేళ సమీపించె వేగంబ నలుం దోడ్కొని రండని యాజ్ఞాపింపఁ గుంతల గౌడ చోళ గాంధారాది దేశంబుల నేలు రాజపుంగవులు పాదచారులై నలావనీశ్వరుకడకుఁజని తోడ్కొనిరా, రాజద్వారంబుఁజేరె. ఆసమయంబున నలు నెదుర్కొనుటకై యేతెంచిన మాన్యులుసంభాషణాదిక మూలంబున సత్కారం బొనరించిరి. దమయంతీ ప్రియానుజుండగు దముండు ముత్యాలహారంబు పేరురంబునఁ గాంతుల నీనుచుండ నానంద సంభరితంబగు డెందంబున నర్ఘ్యపాద్యంబులొసంగి తోడ్కొనిపోవ నుద్యుక్తుండై కాలి నడక నెదురుగ రాజద్వారంబు చెంతకు నేతెంచు చుండె. భీమరాజు సైన్యంబు బయటనుండునటుల వలయు సేనాపతుల

రాకుమారులను నిషధాధిపునిం గొలిచిరా నియమంబుం జేసియుండె. పిమ్మటం గొన్ని ద్వారంబులు దాఁటి నిషధాధీశ్వరుం డరదంబు డిగ్గఁ బుణ్యాంగనా జనంబులు నీరాజనంబు లిడిరి. నలుండు దముని కరంబు నూతగఁ గొని మెల్లగ నడచి బంధుజన పరివేష్టితంబుం, బురోహిత బ్రాహ్మణ సహితంబుం, బురంధ్రీజనసంభరితంబులగు వివాహ మంటపంబుం జేరం జనుదెంచి యెదురు వచ్చుచున్న భీమభూపాలునకు నందనంబొనరించి మామగారి యాజ్ఞచేఁ గనకాసనంబున నాసీనుండై యుండె.

## ప రి ణ య ము.

అంత మంత్రిసహితంబుగ మామగారగు భీమభూపాలుం డొసంగిన మధుపర్కంబుం దేనియం గుతూహలంబున నారగించె. వధూవరుల కరంబులకు దీక్షాకంకణంబులం గట్టిరి. పుణ్యాహవాచనంబున నానలావనీశ్వరుడు కరంబుపై దమయంతి హస్తంబు నుంచె. అనంతరంబు పార్వతీదేవి తొల్లి యనుగ్రహించి యొసంగిన దివ్యఖడ్గంబును, సర్వ మనోరథముల నొసంగు చింతామణీహారంబును, శత్రుసంహారంబున నకుంఠితమగు బంగరు మొలాముం జేసిన బాకును, మహేశ్వరుండు తన కొసంగిన కనక రథంబును, లోకం బాహాయన భీమరాజు నల్లునకుం బ్రీతిపూర్వకంబుగ సమర్పించె. ఆ బంగరుటరదంబు మనోవాంఛా ప్రకారంబుగ గమనం బొనరింప సమర్థమైనది యయియుండె. మఱియు నింద్రుని గుఱ్ఱముతో నెకసక్కెములాడఁగల యుత్తమజాతి శ్వేతహయంబును నీ స్వయంవర

ప్రారంభమున నగ్నిదేవుండు కానుకగా నంపిన యరుణ కాంతులనీను సమూల్యవస్త్రంబులను, విశ్వకర్మచే నేకాండముగ నిర్మింపఁబడి యింద్రుం డంపియుండిన మానికంపుఁ దాంబూల పేటికను, విషహరణ సమర్థంబగు నొక గారుడమణి భోజన పాత్రంబును, భీమరాజు జామాతకు నర్పణం బొనరించె. ఇంకను నావరాటరాజు పరిణయమువేళఁ గానుకగా ననేకంబులగు గుఱ్ఱంబుల నేనుఁగుల వస్త్ర చందన హేమ రత్నంబుల వారకాంతా దాసదాసీజనంబులఁ, బ్రేమంబు మీఱ నల్లున కొసంగె. అంత నావధూవరులు జాతవేదునకుఁ బ్రదక్షిణ నమస్కారంబులఁ గావించిరి. ఎడఁబాటు కలుగకుండుటకై వారిరువురి వస్త్రాంచలంబు లేకంబుగ ముడివేయ బడియె. భర్తతో స్థిరంబుగ నుంటకై ధ్రువనక్షత్రంబుఁ, బాతివ్రత్య భాగ్యంబునకై యరుంధతీదేవినిం గాంచి ముత్తైదువలొసంగు మంగళాక్షతల భక్తిమై స్వీకరించిరి. పిదప గరకంకణధ్వానంబులు చెలంగ నడుమల్లలనాడఁ గర్ణాభరంబు లూగులాడఁ గుచంబు లొఱసికొనఁ బురోహితుండగు గౌతము నాజ్ఞ నా దమయంతీదేవి భర్తయొక్క దీర్ఘాయువు కొఱకు నగ్నిహోత్రంబున లాజలు దోసిటనెత్తి హోమంబుఁ జేసె. ఆసమయంబున నాజ్యధారల నొప్పుచున్న యా సుగంధహోమ ధూమం బారాకుమారి యంగకంబులపైఁ బ్రసరింప నది యొక క్రొత్తయందంబుగాఁదోఁచె.

"సీ॥ చెక్కుటద్దములపైఁ జెఱలాడునప్పుడు
కస్తూరికా పత్త్రికములఁబోలె,

శ్రవణపాశములలోఁజాఁగి పాఱెడు నప్డు
లలితతమాల పల్లవముబోలెఁ,
గలికి కన్నులలోనఁ బొలుపారునప్పుడు
నవలీల నీలాంజనంబుఁబోలె,
ఫాలభాగంబుపైఁ బఱతెంచు నప్పుడు
కమనీయ చూర్ణాలకములఁబోలె,

తే॥ నప్పుడావర్జితాజ్య ధారాభిఘార
పరిమళోల్లాజనవశమీపల్లవాగ్ర
హుతహుతాశన జిహ్వాసముత్థమగుచు
హోమధూమంబు బాలపైనొయ్యఁ బొలసి”

పదపడి యానందాతిశయంబున నూత్నమగు పులకలు మేన నుదయించుచుండ నొక్క పేరంటాలు రత్నాంగుళీయక ప్రభల నీను నలరాజు హస్తంబును దమయంతీదేవి చేతఁబట్టు కొనఁజేసె. అట్లు పాణిగ్రహణం బొనరించి పలు గవాక్షంబుల నొప్పు కౌతుకాగారంబుఁ బ్రవేశించి శుభాన్వితంబగు నొక్క మంచంబున నూత్నదంపతు లధివసించిరి. పిమ్మటఁ దమ్ము లిరువంకలఁ బెండ్లిచుట్టంబులకు భోజనంబులు వెట్ట నాజ్ఞయొసంగిరి. అంత చంద్రవదనలు పట్టుపుట్టంబులఁ బన్నిటం దడిపి యారఁబెట్టి మడత లిడుచుండిరి. భోజనాగారంబునం గల పరదాలను లాగి సరి జేయుచుండిరి. ఒక వంక నగురుధూపంబుల రగులఁ జేయుచుండిరి. పైడిపళ్ళెరంబుల శుభ్రపఱచి వెండి బల్లలపై నాయత్తపఱచుచుండిరి. నూత్న రత్నకంబళులు మొదలగు పలు

దెఱంగుల యాసనంబుల నిరువంకల బెండ్లివారలు భోజన సమయంబులఁ గూర్చుండుటకుఁగా నమర్చుచుండిరి. ఆ సమ యంబున సమీపమందిరంబుల బాంధవులు ప్రియంబు మీఱ చతురవాక్యంబుల భాషించుకొనుచు సంతసంబున నుండిరి. పరిచారికా జనంబులందలి యొక యలికులవేణి ముఖంబు గడుగుకొనుటకై యొకని దోయిటనీళ్లుఁ బోయుచుండ నా జలమధ్యంబునఁ దదాస్యంబు ప్రతి ఫలింపఁ గాంచి; యేరుఁ గనకుండ నపుడామె చెక్కిలి ముద్దుగొను వాంఛ నింక నుద కంబుఁ బోయునట్లుగ నా నీరు వదలుచుండె. నలునకు వీవన వీచు నొక యెలనాగ పాదంబులమధ్య నొకబోఁటి ముదితొండ నుంచె. అయ్యది కాలు ప్రాకిపోక ముడివడకేగ నామె కుపా యంబు దోఁచక కట్టిన పుట్టంబు నూడఁదీయ నందఱు గల కల నవ్విరి. ఒక కోమలి యేరితోనో సంభాషించుచుఁ బరా కుననుండ నొక ధూర్తుండు వంచనగ వెనుకనుండి యేతెంచి యామె మెఱుంగుఁ జెక్కిలిఁ జేతనంటె. ఒక్క సరసుండొక లేమంజూచి "ఓమె, యేమె, యిదేమేమె" జలంబుఁగొని రావని పరిహాసంబొనరింప నొసంగుచున్న యా యువతి "ఓమె ఏమె" యని వచించిన యతనింజూచి "మేక మేక" యని పల్క నందఱుఁ బక పక నవ్వసాగిరి; ఒక కాంత విటుఁడైన యొక రాసుతుని వెనుదిరిగి క్రేఁగంట వీక్షించె; నొక్క తరళేక్షణ, నైషధనాథు సేనానికి వట్టివేళ్ళ వీవనతో వీచుచు నాతనియందు మోహావశురాలై యుండె. పిమ్మట బంధుగు లందఱు ముఖపాదప్రక్షాళనాదికంబు లొన

రించి తమ తమ యథ్యాసనంబులం గూర్చుండి, భక్ష్య భోజ్య లేహ్య చోష్యంబులు భుజియింపఁ గడంగిరి. పరిశుభ్రంబగు శాల్యన్నంబును, గోధుమల నూకతోఁ జేయబడిన భక్ష్యంబుల గండశర్కరం గలిపియు, గోక్షీరంబులఁ బూరీలపైఁ జక్కగాఁజల్లియు, మిరియంబులతో మిశ్రమంబైన తేనెయందు లడ్డులను ముంచికొనియు, బలుచనగు దోసెలఁ బెసరపప్పునం దద్దుకొనియు, గస్తూరికాదుల నతిశయించు పరిమళసమన్వితం బగు వెన్నతోఁ జేయంబడిన భక్ష్యంబుల విఱచియుఁ గ్రమ క్రమముగా నా పెండ్లి బందుగులు భుజియించుచుండిరి. తదుపరి వర్షంబు పగిది నాజ్యధారలు జవరాండ్రు గుఱిపించుచుండ నందఱుఁ దనియుచుండిరి. పచ్చుటాకంచములలోఁ బచ్చనికూరలు గాన్పింపనందునఁ బెండ్లిపెద్దలు వడ్డించువారలఁ గోపంబుఁ జేయుచుండిరి. అన్నారీజనంబులు మఱిమఱివడ్డించుచుండిరి. ఒక సమయంబున నా పచ్చుటాకంచములలోఁ జిఱు వడములను భక్ష్య విశేషంబులతోఁ గూడినపాయసంబును ద్రాక్షాఫలంబులను వడ్డింప, గగనంబు నందలి చంద్రనక్షత్రముల భాతి నొప్పుచుండె. మఱియుఁ దలిరుఁబోండ్లు వినయాతిశయంబుగ ఘృతశర్కరా కలితంబగు పరమాన్నంబు బంగరు గిన్నెలలో వడ్డించుచుండ, బంధుజనంబు లెంతయుఁ దృప్తిమీఱ భుజియించుచుండిరి. నలునితో నేతెంచిన పెండ్లివారికినిఁ బెద్దలకు నుత్తమోత్తమంబులగు కుందేటి యొక్కయు, మత్స్యంబుల యొక్కయు, మజ్జిగపులుసును గూరయు, వడ్డింపఁ బ్రియంబున నారగించుచుండిరి. ఆవ, నూనియు,

మొదలగువానితో నూటిన యడవి పందియొక్క మాంస ఖండంబుల వడ్డింప మెసంగిరి. ఆ పదార్థంబులన్నియు వారలకుఁ జాలఁ దృప్తి గలుగఁజేసె. గడ్డలుగనుండు గేదె పెరుగుఁ గుత్తుకబంటిగఁ దినుచు నెయ్యి యావపచ్చళ్లు సంజుకొనుచుండిరి. కంచుకంబున మరుంగయియున్న కుచ పరిమాణముం దెలిసికొనఁ జాలక చింతించుచున్న యొక్క విటకానికి వాని యాకారస్థితి యింతయని యొకయింతి హేమ కలశంబులఁ జూపె. ఒక బుద్ధిమంతుండు, మొగంబుఁ జూడ వెఱచి బంతులవెంట మాఱు వడ్డించుచున్న యొక జవరాలి మోము నేలంబఱచియున్న చంద్ర కాంత శిలాసముదయంబునఁ బ్రతి ఫలించుచుండ నిజదృష్టి నాభాగంబుపైఁ బఱపుచుండె. ఒక జవ్వని లేడిమాంసపు ముక్కను వడ్డింప నొక చతురుం డధరంబుపై నుంచి ముని పండ్లతో నొత్తుచుండుటఁజూచి మోవి చుంబన సూచకంబగు నాతని యభిప్రాయంబు గ్రహించి మో మొకించుక ద్రిప్పి ముసి ముసి నగవొలయింపఁ జేసెను. ఒకండు కలియుటకు సమయంబుఁ దెలిసికొనఁదలంచి యుష్ణశీతాన్న కబళంబుఁ జూప నాలతాతన్వియధరంబు విఱిచి సంజకడయని సూచించె. ఇవ్విధంబులగు విలాసంబులతో, నానావిధంబులగు శాకపాకం బుల మృష్టాన్నంబు భుజియించి, వధూవరుల బందుగులు సుగంధోదకంబులఁ జేతులఁ గడిగి, వస్త్రంబునఁ దడియొత్తి

కొని కర్పూర తాంబూలంబుల స్వీకరించి దమ దమనుల ప్రియోక్తులకు ముదంబందుచు నిజనివాసంబుల కరిగిరి. అవ్విధంబున వారలు పేర్మిమీఱ మువ్పూటలు భుజించుచు దినంబులు గడపుచుండిరి.

# ఆంధ్ర నైషధసారము.

## సప్తమాశ్వాసము.

—:o:—

నిషధేంద్రుండును దమయంతీ పరిణయ మహోత్సవం బీవిధంబుగ నాలుగురోజులుఁ గడపి మఱుదినంబున బురోహితుండగు గౌతముండు యుక్తసమయం బిదెయని వచింప నిజదేశ గమనోన్ముఖుండై సేవకులచే శిబిరంబులెత్తింప సేనానుల కాజ్ఞయొసంగె; అల్లుని వీడ్కొనుట కాతనియందలి ప్రేమయెట్టిదో కాని యత్తమామలకు దుఃఖోదయంబయ్యె. అంత భూలోక దేవేంద్రుండననొప్పు నిషధాధీశుండగు నల్లుని సాఁగనంపుటకు వినయ సౌశీల్యాది సుగుణభూషితుండైన భీమరాజు దమ దమనులను నిర్వురు కుమారులతోఁ గూడుకొని తనరాజ్యంబు పొలిమేరవఱకు నేతెంచి యాతని వీడ్కొనియె. తండ్రితోడి వియోగంబునకు నేత్రకమలంబుల బాష్పకణంబులు దుల్లఁ బ్రణామం బొనరించి తలవాల్చియున్న కూఁతుం గౌఁగిలించుకొని గద్గదస్వరంబున నా భీమరా జిట్లనియె. తల్లీ! నీ నాథుని యాజ్ఞను జవదాటకుండ నాతని బరితృప్తిఁ జేయుచుండినయెడల నీ కెల్ల పుణ్యంబులు లభ్యంబగు. అతనికిఁ దెలియకుండ నీవే విషయంబు దాచియుంచకుము. నిష్కళంకముగఁ బ్రవర్తింపుము.

మ॥ గురువన్నన్ ధనమన్నఁ బుణ్యమనినన్ గోత్రోదయంబన్న దే
వరయన్న, న్ననమన్నఁ, దృష్టియనినన్ వాత్సల్యమన్నన్, నిజే
శ్వరుఁడన్నం బరమోపకారమనినన్ సర్వంబునన్నన్ దలో
దరి నీకున్ నిషధాధినాథుఁడెసుమీ తథ్యంబుగాఁ జెప్పితిన్॥

సదా గృహాదైవతంబుల నేమఱక కొలుచుచుండుము. నీసవతులఁ జెలికత్తియలరీతిఁ బ్రేమించుచుండుము. అత్తమామల భక్తిమై సేవించుచుండుము. సేవకాగణంబుల యెడ దయంబూని ప్రవర్తింపుము. నీనాథుండు కోపగించినసమయంబున నలుకఁబూనకుము. స్తోత్రంబులకుఁ బరవశంబు నందకుము. తోడికోడండ్రతో సఖ్యంబున మెలంగుచుండుము. దాసీజనంబులఁ జక్కఁగఁ దల్లిరీతి సంరక్షింపుము. బ్రాహ్మణగురుబంధువులందు భక్తి, విశ్వాస, గౌరవంబుల నెఱపుచుండుము. పతియే దైవంబనెడి ముఖ్యధర్మంబు నేమఱక ననుష్ఠింపుమని హితబోధంబొనరించి, కూఁతుఁవీడ్కొనియె. దమ దమనులుఁ జెలియలి, బుజ్జగించి జవ్వాజియుఁ జందనంబుఁ బునుంగుఁ బన్నీరు మొదలుగాఁగల సుగంధద్రవ్యంబుల ననేకంబులగు రత్నాభరణంబుల నొసంగిరి. మఱియు, భీమరాజు నాజ్ఞానుసారంబుగ దమయంతి నత్తవారింటికిఁ బంపు నాశుభసమయంబున సోదరులు, పసుపుఁగుంకుమక్రిందఁ దమ విదర్భదేశమునందలి నానావిధ ఫలతరు సంఘంబుల బహుభంగులఁ గమలంబుల నొప్పారు సరోవరంబుల వివిధమణ్యాదికంబుల నమ్ము నంగళ్ళఁ గలిగియుండిన సారవంతములగు నూఱుగ్రామంబుల నొసంగిరి. ఉభయవంశలలామంబగు దమయంతి యత్తవారింటి కరుగు

సమయంబు నెడఁబాటు సహింపఁజాలక, మాతా పితృ సోదరాదులు చింతనొందుచుండిరి. పిదప నీరీతి నలావనీశ్వరుండు బంధుజనంబులు సముచిత ప్రకారంబుగ వీడ్కొలుపఁ గతి పయ ప్రయాణంబు లొనరించి నిషధాపురంబు సమీపింపఁ జొచ్చె.

## పురప్రవేశము.

అప్పు డా పురంబునంగల ముఖ్యామాత్యులు చారుల వలన నల దమయంతీ పరిణయ వృత్తాంతము నెఱింగి సంతోషంబున వారిరాకకై యెదురుచూచుచుండిరి. రాజవీధులందలి సౌధాగ్రభాగంబుల నలంకారకేతనంబులు వాయుసంచాలనంబున నోలలాడుచుండె. ఆప్రాంతంబుల దమయంతీ సౌందర్యావలోకనకుతూహలినులై పురకాంతలు క్రిక్కిఱిసియుండిరి. భవనాంగణంబులఁ గస్తూరికా లేపనంబొనరించి కర్పూరరజంబు నలంకారముగ ముగ్గులు దీర్చియుండిరి. చూతపత్రింబులఁ బోలెఁ జిత్రతరంబుగఁ జేయఁబడిన యింద్రనీలమణి తోరణంబు పురద్వారంబున నలంకరింపఁ బడియుండె; కోరికమీఱ నా నలుం డాపురలక్ష్మిని వీక్షించి భార్య యేమియనుకొనునో యని నాదృష్టుల మఱలించి, దమయంతిపై నిలిపె. ఆ చూపులు నీ రాకకై మన నగరలక్ష్మి యెట్టు లలంకరించుకొని స్వాగతంబిడుచున్నదియో, నివచూడుమని చెప్పునట్లుండె. అట్లు వైభవంబుగ నేతెంచుచున్న నిషధేంద్రుండు మంత్రి పురోహిత దండనాథ

సముచితంబుగాఁ బౌరజనం బెదుర్కొని సేవాసక్తిచేఁ బావ చారులై నడచుచుండ, వారు వచించువార్తలు వినుచుఁ, దా నేవియో వారలకుఁ జెప్పుచు, బురకాంతలు వేడ్కవీక్షించు చుండ సంపూర్ణానురాగంబునఁ బురప్రవేశం బొనరించె. ఆతరుణంబునఁ బురంధ్రీమణులు, సౌధాగ్రభాగంబు నందలి చంద్రశాలల వసియించి నలమహారాజుపై మంగళాచారంబుగ ముత్తెములంబోలు నక్షతలఁ జల్లుచు, సతీమణియైన దమయంతీ దేవిఁ గాంచఁ గుతూహలినులై, నేత్రానందముగ వీక్షించు చుండిరి. అట్టియెడ వారి ముఖచంద్రు లాచంద్ర కాంత మణులఁ బ్రతిఫలించి చంద్రశాలయను నామంబు సార్థకముగఁ జేయుచుండిరి. కొందఱు చానలు సౌధగవాక్షంబులనుండి యాదంపతులఁ దనివిఁదీఱఁ జూచుచుండిరి. నలుని వేదాచార ప్రవర్తనంబునకు, నిష్కళంకమగు నీస్వయంవర మహోత్సవంబు నకు, నాయింద్రాది దేవతాసముదయంబు సంతసించి యా శుభ సమయంబున వారిపై విరులవానఁ గురియించిరి. ఆ పుష్ప వర్షంబునకుఁదోడు పౌరవధూజనుల క్రేఁగంటి వీక్షణంబులు ప్రసరింపఁ బ్రధానమార్గంబున, దేవీసహితుండై నలుండు స్వకీయగృహంబుఁ జొచ్చె.

పిమ్మట దేవేంద్రాదులు వృథాప్రయోజనంబగు క్షోణీతలాగమన ప్రయాస ఖేదంబనుభవించి సముద్రంబునం దలి తరంగంబులభాతి వచ్చినదారినే కాంచన రథంబు నెక్కి యాకాశమార్గంబునఁ జనుచుండిరి. ఆయింద్రుని యర దంబు మాతలి సారథ్యంబునఁ దురంగములు, వాయు మనో

వేగంబుల గమనంబొనరించుచుండె. పాకశాసనుని హస్తం బున ధనస్సును, వజ్రాయుధంబుఁ బ్రకాశించుచుండెను. వారలుసూర్యమండలము సమీపంబుగ నేగుచుండిరి. అపుడు గగనచరులు . వాయుసంచలనంబున జ్వాలారూపంబుగ వెలుంగు వీతిహోత్రునిగాంచి దమయంతి లభింపకుండుటవలనఁ గలుగు విరహసర్పసంబు గాఁబోలునని తలంచుచుండిరి. అట్లు భావించుచుండ నాయింద్రాదులు తారామార్గంబున నరుగుచుండ గంధర్వరాజుల వీణాగానంబు శ్రోత్రపుట సంస్థితంబయ్యె. దమయంతీకంఠమధురనాదంబు విన్న వారి వీనుల కా గానం బంత సమ్మోదంబుఁ గలిగింపఁజాలని దయ్యె. నిర్మలమైన తత్త్వవిద్య శిష్యుని హృదయంబునం దేమ ఱకయుండ సంతసించు గురునిమాడ్కి, దమయంతి చిత్తంబెం తయు నలునిఁ బాయకుండుటంగాంచి యాదేవ చతుష్టయంబు మోదంబందుచు, విహంగ మేఘ విద్యాధర మారుతాదులు సంచరించు మార్గంబులను, ప్రభాకర నక్షత్రంబులు వసి యించు పథంబులను, వియద్గంగానదీ ధ్రువమండల ప్రాంతం బులదాఁటి భీమరాట్పుత్రిమీఁది ప్రేమంబును వీడలేక వీడలేక, యాయింద్రాదులు స్వర్గలోకంబున కరుగుచు, నాకాశంబునఁ గాటుకఁబోలు దేహకాంతియు, వికారరూపంబులును, ధగధగ లాడు భూషణంబులుఁగలిగి, సముద్రంబు ఘోషఁబోలెఁ గోలాహలం బొనరించు, పరిజనంబులం గాంచిరి.

## మన్మథ ప్రభృత్యాగమనము.

ఆజనసమ్ముఖంబున వసంతుండు, చిగురుటాకుఁ దూపు

లంధరించి గండుమీను టెక్కెంబునుంగల రాచిల్కలంబూన్చిన యరదంబు నడపుచుండఁ, గలిపురుషునకుఁ బ్రియమిత్రుండును రతీనాథుండగు మన్మథుం డంచుఁ జిగురుటాకుల గొడుగు నీడఁ బుష్పబాణంబుల సంధించి, పిడికిటఁబట్టిన ధనువుఁ గటి భాగంబునఁ బచ్చని పట్టుఁబుట్టంబు నురంబునవాడక తావుల జిమ్ము పూసరంబును దాల్చి, ప్రయోగంబున కనువగు పాద విన్యాసం బొనరించి, జగదేకవీరుండై సతీయుతంబుగ విరాజిల్లుచుండె. ఆతని పార్శ్వంబున జనాపవాదంబునకు వెఱవక, యకార్యకరణ ప్రవర్తనంబులఁ బ్రాణంబుఁ దృణప్రాయంబుగఁ జూచు సాహసులుచేరి కొల్చుచుండిరి. అట్టులేతెంచుచున్న యీ మన్మథుని బురందరాదులుగాంచి నలుని సౌందర్యాదికంబులఁ గన్న పిమ్మట యీతనిఁజూడఁ గోరిక పడకుండిరి. క్రోధుండు, నిడుదకన్నుల నగ్ని స్ఫులింగంబులురాల, రక్తవర్ణంబగు మేనఁ జెమటబిందువు లుదయింప, దంత ఘట్టనంబునఁ బెదవినుండి నెత్తురుస్రవింపఁ, జెక్కిళులదఱ, గోరమీసములు చలింపఁ, గంఠంబున హుమ్మనుధ్వని యొసంగుచుండ, భూమ్యాకాశంబుల నొక్కమారు దాటుభంగి, వికటంబుగ నడచుచు, నుచ్చైస్స్వరంబున దేవేంద్రాదుల నింద నొనరించుచు, వికారంబుగ నవ్వుచు, బొమలు ముడివడజేయుచు, నారక్తనేత్రుండై, గగన మార్గంబున నేతెంచుచుండె. అతనింగాంచి పురందరుం డీ క్రోధంబు తొల్లి దూర్వాసుని మూలంబున నింద్రత్వమునకు భంగమొనరింపఁ జూచినవిధంబు మఱవనందున వెఱచి వేయి కన్నుల నించుక మొగిడ్చియుండెను.

ఇంచుమించుగ నాయకునిరీతిఁ బోలఁగలవారలు వెంట సేవించు
చుండఁ గ్రోధుండు గర్వాతిరేకంబు ప్రకటీకృతం బగునట్టులఁ
జనుదెంచుచుండె.

లోభుండు తన కెంతయున్నను యాచనకై చేతులఁ జాచుచు వికారస్వరంబున సగంబు మాటలు పచియించుచుఁ బండ్లిగిలించుచు నతి దీనత్వంబుఁ దోపించునటుల నరుదెంచుచుండె. సంపద గల్గియుఁ దానుఁ దినకయు, నొరులకు దానంబొసంగకయు, నితరుల సంపత్తులంజూచి కన్నుల నీరు వెట్టుచు, నింట యన్నంబుఁ దినక పెఱవారలు పెట్టునెడఁ జాలఁగ భక్షించుచుఁ, బరధనాపహరణంబుకొఱకు బ్రాణంబుల నొడ్డుటకు సంసిద్ధపడుచు. దయ్యాపు నిధులం బోలెఁ దమ ధనంబులఁ గావలిఁ గాయుచు నీగకిలిఁ బాముకు బలినొసంగని పిసినిగొట్లు లనుచరులై యాతని సేవించుచుండిరి. అన్ని సుగుణంబులఁ గూడ నీలోభంబు నమయింప గలదు. పొట్టకూటికయి యిచ్చకంపుమాటలు నుడువుచు, దానంబొసంగువారిని వారించుచు, నన్యధనగ్రహణాసక్తియు గలిగి జారచోరాదులకు సహచరుండై, కార్పణ్యంబు నహించుచుఁ, గలిమహారాజు ప్రియ మిత్రుండగు లోభుం డా దేవతా చతుష్టయంబునకు నమస్కారంబొనరించె. మోహుఁడు పట్టపు దేవియగు నాస్తికతఁగూడి బ్రహ్మాది దేవతా సముదయంబుఁ బరిహసించుచు మోహన విద్యాపారీణుండై తనర, నాతని బాలురు సంసార మగ్నులు, శాస్త్రానభిజ్ఞులు, వేద విహీనులు, మందమతులునై కొలుచుచు వెంటరా, వక్ర

మార్గంబున నడచుచు, మెల్లమెల్లగ నేతెంచుచుండె. ఎయ్యది యజ్ఞానంబునకు మూలంబై జనన మరణాదులకుఁ బ్రధాన సాధనంబో; యెయ్యది వేదవృక్షంబునకు వేఱు పుర్వు భాతి నుండి భగవంతుఁడు లేడను నాస్తిక చార్వాకాది కుమతంబులఁ గల్పింపఁ జేయునో, యెయ్యది వక్రవాదంబుఁ జేయించుచుఁ గన్నులదెరువనీక బుద్ధిఁ బ్రసరింపనీయక చెవుల సదుపదేశంబుఁ జొరనీయక రాజిల్లుచుండునో, యట్టి మహామోహస్వరూపుఁ డెదురు రా నిద్రాదులు భ్రాంతులై యాతనిఁ జూచు చుండిరి. తదనంతరము కలిరాజు భటులు పాపకృత్య దివా నిద్రలుఁ, బరదూషణ పరాంగనాసక్తియు, అసహన సాధుజన ద్వేషంబులు, అసత్యాలాపయత్యాహార భక్షణంబులు, భయంకర వీక్షణంబులుఁ, గలిగి ధూమ్రవర్ణంబగు కఱకు వెంట్రుకలు శరీరంబంతయు నిండియుండ నంబర వీధి, నా సురసముదయబును సమీపింపఁ జొచ్చిరి.

### వందుల స్తోత్రములు.

ఆ సైన్యావళి పార్శ్వంబుల సువర్ణ దండములు ధరించి విచిత్రాకారంబుగ నుండిన వందు లాకసంబు మాఱు మ్రోగునట్టులఁ గలిరాజు ననేక విధంబుల స్తుతించి యందఱు వినునటు లివ్విధంబున వచియించిరి. "జ్యోతిష్టోమాది క్రతువుల ఫలంబులు ఱాలు నీళ్ళఁదేలుటవంటిది. ఆత్మయనునది యసత్యంబు, ఋగ్యజుస్సామాథర్వ రూపకంబగు శ్రుతి యథార్థంబు గాదు. అగ్నిహోత్రంబున నాహుతులు వేయుటయు, సన్యాసంబును, విభూతిధారణంబును, బుద్ధి

హీనులగు పురుషాధములకు జీవనమాత్ర సాధనంబులు. వారి వారి కోరికలఁ దీర్చుకొనుటయే ధర్మంబు. మనస్సఖుండే దైవంబు. మరణించుటయే మోక్షంబు. దేహంబుతోఁ బాటు భస్మీభూతంబగు నా జీవునకు మఱల జన్మంబు లభించుట యనునది కేవలము భ్రాంతి. వేదంబులేమియు నెఱుంగవు. పరలోక నిశ్చయ మెవ్వారికిఁ దెలియదు. పురుషులు వ్యభిచరించుచు వింతుల వారింపఁజూతురు. వారికి మాత్రము కామేచ్ఛ లేదా? త్రిభువనంబులందలి సదాచార సంపత్తియందు మిన్నయగు నింద్రుం డహల్యాజారుండగుట స్త్రీపురుషుల కనుజ్ఞ నిచ్చుట కాదా? ఈ జనన మరణాన్వితమగు సంసార మాద్యంతములు లేనిది. కాన వంశసంరక్షణం బొనరించుకొనుటయే ముఖ్యము. ఓ దైవోపాసకులారా! విగ్రహంబులుగాఁ జెక్కిన ఱాలఁబూవులఁ జల్లిన యయ్యది ఫలం బొసంగునా? ఎప్పుడు వృక్షశాఖనుండి పుష్పంబు గోసితిమో యప్పుడే తత్ఫలంబు నశించుట లేదా? మీఱు యోచించుకొనుఁడు. ఓ వేదవిప్రులారా! జన్మాంతరమే లేనియపుడు మీ రిచ్చవచ్చిన పాపంబు లొనరింపుఁడు లేక దుష్కృతం బాచరింపరాదని తమకుఁ దోఁచుచున్న యెడల యాగంబుల మానివేయుఁడు. మీ వేదంబులయందు 'మాహింస్యాత్సర్వభూతాని' యను సూత్రంబు జంతుహింసను నిషేధించియున్నది. మీ యధ్వరంబు లజా తురంగ ధేన్వాది హింసలేకుండ నెఱవేరవు గాన నవశ్యంబ క్రతువుల మానుఁడు. ఓ పండితులారా! శ్రుతి స్మృతి పురాణేతి హాసాచారంబు లోక

దానినొకటి పోలియుండవు. దేనిమార్గమదియే. చక్కఁగ నాలోచించి కష్టంబునందక సుఖంబలవడు ధర్మంబు నేర్చు కొనుఁడు. నేనని యనుకొను నీదేహంబగ్నిహోత్రునిచే భస్మంబైన పిమ్మట నింకఁ బాపం బెచ్చటనుండు. అయ్యదియు నాశమై తీరుఁ గనుక నెల్లవారలు సుఖప్రదంబులగు పరదార సంగమాది పాపకృత్యంబు లొనరించుచుండుడు. అద్వైతసిద్ధాంత ప్రకారంబుగ సర్వము నాత్మమైయుండి యెల్లజీవుల పాపంబులఁ దాననుభవించుచున్నపుడు నిందుబండికిఁ జేటబరువుగాని విధంబున నీయొక్కని పాపంబు భరంబు గాఁజాలదు. కాన నీయిచ్చ వచ్చిన దుష్కృతంబు లాచరింపుము

"ఉ. చీటికి మాటికిన్నఖిల జీవులునుం బొనరించు పాపముల్
గోటులు దన్నుఁజుట్టుకొని ఘోరపుబాధల బొందుచొంటమైఁ
బాటిలునాత్మకున్ భరమె పాపమునీయది? నిందుబండికిం
జేటభరంబె? యేమిటికి జేయవు విప్రుడ కిల్బిషంబులన్"

వేదాంతులు, కోమలులు లాలామూత్ర పురీషాది హేయులంచుఁ దమ జన్మవృత్తంబు మఱచి నిందించుచుందురు. ఔరా! తామమాత్ర మట్టివారలుగారా? ఏల వీరియవివేకంబు? పురాణంబులు నిజమని నమ్మెదుమేని వాని రచించిన ఋషి పరాశరునివలనఁ బల్లెవాని కూతురగు మత్స్యగంధికి జన్మించిన వ్యాసుండు. అతండు పాండవపక్షపాతి. కవులమాటలకేమి లెక్క? మత్స్యపురాణంబునందు మత్స్యంబు వచియించినదఁట. జంతువుల యభిప్రాయంబు లాచరణీయంబులా? ఎల్లపుడుఁ బరోపయోగంబు నభిలషించువారలు యోగ్యులవలె నటిం

చుచు నెంతటి ఘోరకృత్యంబులు చేయఁజాలరు? చూడుఁడు! ఇంద్రుండు మాయావేషంబునఁ గర్ణునియాచించి కవచకుండలములు హరించె. మహాదాతయగు దధీచిని నింద్రుండు వెన్నెముకనిమ్మని కోరి నిర్దయుండై కైకొనియె మహాదాన సమర్థుండగు బలిచక్రవర్తిని నారాయణుండు కపటవేషంబున నర్థించి పాతాళంబున కణగం ద్రొక్కె; ఇంద్రాగ్నులు డేగ పావురంబుల రూపంబుల ధరించి శిబీంద్రుని మొదలి మాంసమంతయుఁ గోసి యిచ్చునటుల మాయా నాటకం బాడిరి; పాలకడలిం గలతఁబెట్టి మథనం బొనర్చిరి; దేవతలు తారానాథుండగు చంద్రుని కళలఁ గ్రమక్రమంబుగ భక్షించుచుండిరి; కల్పవృక్షంబుల ఫలంబులఁ దామే రాల్చుకొని యనుభవించుచుండిరి; ఈ సురల మెప్పింప నేరితరము? కీర్తినెల్లునందురు. తమ సుఖంబుఁ దప్ప నొరుల క్షేమంబు నించుకేనియుఁ బరికింపరు. వారల మోసము లిప్పటికైన నూహింపుఁడు. రాగాదిరహితమైన మనంబుతో బ్రహ్మచర్యంబుఁ బూని యజ్ఞదీక్షఁగొన్నవారలు, మఱల రంభా సంభోగముఁ గోరనేల? సంగ్రామంబున మడసిన వీరపుంగవులు నాకంబున కేగుట యసత్యంబు గాక నిజంబే? ఐన నారాయణునిచే హతమైన యసురబృందము స్వర్గంబున సమరంబు జరుప సంసిద్ధము గాకుండునా? ఈ వృత్తాంతము లెంతయు నేతి బీరకాయవంటివి; పేదతనంబున నుపవాసంబు లుండక దొంగిలియైనఁ దృప్తికరంబుగ భుజించుచు నిచ్ఛానుసారంబుగ నెల్లభోగంబుల ననుభవించుటయ బౌద్ధుల సిద్ధాం

తము. తాము కోపస్వభావులై యుండియు నితరులకుఁ గ్రోధంబు కూడదని బోధించు మునులంబోలె నటించు నీలోకవంచకుల మాట లెవ్వారు నమ్మఁగలరు? ఇంతయేల? వేదమంతయు సర్వాబద్ధంబైనయది.” యని నుడువుచుండిరి.

ఈ విధంబునఁ గర్ణకఠోరంబులగు వాక్యంబుల శ్రుతి స్మృతి పురాణేతిహాసాదులు ప్రమాణంబులు గావనియు, యాగ మంత్రంబులు ఫలరహితంబులనియుఁ, గాపాలిక పాషండ జైన బౌద్ధాదిమతంబుల వారలకు సంతసంబుఁ గలిరాజున కానందముం గూర్చు నీ స్తోత్రపాఠకులఁ గాంచి, యింద్రాగ్ని యమవరుణులు రోషారుణిత నేత్రులై సలువురు నలుదిక్కుల మొగంబై, “ఓ దురాత్ములారా! ఏల దుర్భాషణంబులాడెదరు? మా యాయుధంబుల రుచినెఱుంగరే? ఏల ప్రల్లదంబులు వచించెదరు? పుత్రకామేష్ట్యాది యాగంబులు ప్రత్యక్షఫలంబు లొసంగుచుండ మీరలుఁ జూచుటలేదా? గయా శ్రాద్ధాదులయందుఁ బితరు లావేశించి సంతోషించుటం గాంచఁ బుణ్యఫలంబు దోపించుటలేదా? అగ్నిఁ జొచ్చినంగూడ శరీరంబు కాలకుండుటయు, నేత్రంబులఁ బెకలించుకొనినంగూడ మఱల యుద్భవించుటయు నాదిగాఁగల విశేషంబులు దేవతాప్రభావంబునం గాదే? అవ్విధంబుగ నవాచ్యంబుల నుచ్చరించిన మీనాలుకలంగోయక, ప్రాణంబులంగొనక, మేమెవ్విధంబున నూఱకుందు”మనిన నవ్వందిజనంబులు భయంపడి యింద్రాదులకు వందనంబాచరించి యిట్లనిరి. ఇంద్రాగ్ని యమవరుణులకు బ్రహ్మ

యుము; మేమందఱముఁ గలిరాజునొద్దఁ బాఠకులము. అతండిట్టి కైవారంబులకుఁ గాని మెచ్చఁడు. నిఱుపేదల మగుటంబట్టి శరీరంబు నమ్ముకొన్నవారము. కాన మా యీద్రోహంబు మదిఁ బాటింపక మమ్ముల రక్షింపుము. దేవాధీశా! పరసేవాస్త్రంబులే జీవనంబుగాఁ గలిగి యధమాధములమైన మావాచాదోషంబునకుఁ గోపింపకుము. వీతిహోత్రా! అనపరాధుల మగు మాయందు దయంబూనుము. యమధర్మరాజా! పరాధీనమందుండిన మా యసత్యాలాపంబులకుఁ గినుకవహింపకుము. వరుణదేవా! ఆశాపీడితులమగు మాయహంకారాటోపంబునందు దోసంబుల వెదకకుము; మిమ్ములఁజూచి భయానహులమగుచున్నారము? మమ్ములరక్షించు భారము నీయదియే; యని యాంజలిపుటంబు లలాటంబున ఘటియించి యాబట్టులు కైవారంబుడిగి యూఱకుండిరి.

## కలిరాజు.

పిదప గగనమార్గంబునఁ గాకధ్వజంబు దూలియాడ, నినుపరథంబునఁ గావిరంగుపాగయు, నందంబుగఁ గత్తిరించి యున్న గడ్డము, నల్లనిపచ్చడము, రక్తచందనంబున దిద్దఁబడిన త్రిపుండ్రముఁ, గోరమీసంబులు. వెలికినుబికిన గ్రుడ్లులుఁ, బొట్టియాకారంబు, విశాలంబగు చెవులు, గొగ్గిపండ్లుఁ, బొడవగు మెడయు, నల్లని దేహచ్ఛాయయుఁ, గలిగి విరాజిల్లుచు నేతెంచుచున్న నాల్గవ యుగాధిపతియగు కలిరాజుంగాంచి యాయింద్రాదిదేవతలు తమకేమి యపాయంబొదవునో యను

భయంబున నేత్రపద్మంబు లించుక ముకుళింపంజేసిరి. అంత నా కలి యింద్రునింగాంచి, వెఱచి నమ్రుడై నమస్కారం బొనరించి, "దేవేంద్రా! కుశలమా? ధనంజయా! సుఖంబే కదా? యమధర్మరాజా! క్షేమమా? వరుణరాజా! మంగళంబేకదా. యుష్మద్దర్శనంబున ధన్యత మూఁడనైతి; నేనిప్పుడు దమయంతీస్వయంవరమునకుఁ బోవుచున్నవాఁడ. కాలాతిరేకంబు లేకుండ వేగంబనన్నంపుఁడు. నా మనోరథంబు సఫలంబగునట్టుల దీవెనం బొసఁగుఁడు. మీ యాశీర్వచనంబున భీమకుమారియగు దమయంతిం బాణిగ్రహణంబై మిమ్ముం దర్శింపఁ గలవాఁడ" ననియె. విబుధవరు లొండొరుల ముఖావలోకనంబు లొనరించుకొని చిఱునగ వొనరించి యహంకార పూరితుండగు కలింగాంచి యిట్లనిరి—"కలిరాజా! నిన్ను బ్రహ్మదేవుండు నిత్య బ్రహ్మచారిగా నొనరింప నీవు న్యాయంబుమీరి యిట్టులు వివాహం బాచరింపఁ దలంచుట పాడిగాదు. మాకుఁజూడ నీయది సమంజసముగఁ గాన్పించుటలేదు. బుద్ధిమంతులైన వారలొరులకెగ్గుఁ జేయఁ బూనరు. కాన నీవివాహప్రయత్నంబుమాని వెనుకకు మఱలుము. త్రిభువనానందకరంబగు దమయంతీ స్వయంవరంబు మీరిపోయినది. మే మచ్చోటనుండియే మఱలి వచ్చుచున్నవారము. అనురాగాన్వితులగు నాగుల, సుదారులగు వేల్పులను, వీరశిఖామణులగు రాజేంద్రులఁ, దృణప్రాయంబుగాఁ జూచి యన్నలినాక్షి నలుండనువాని వరియించె. ఈశ్వరాజ్ఞ బలీయమైనది. నీవు మాతోడివాఁడవే. కాన మఱలిరమ్ము"

నావుడు, రోషమదాంధుండై యక్కలిరాజు దివిజరాజులం గాంచి యిట్లనియె. "నేను బ్రహ్మచర్యవ్రతభంగముగఁ జరియించిన నలువకేమి ? మీకేమి నష్టము సంభవించును ? ధర్మంబుఁ దమకుమాత్రము గాక యొరుల కుపదేశింపనచ్చు. ఇన్ని న్యాయంబులెఱింగిన మీరలేకపత్నీ వ్రతస్థులై దమయంతి నేల వరియింపనేగితిరి ? పోయితిరిగాక, మీయందఱలో నొక్కనినేని వరియించెనా? మీయెదుట నిషధేంద్రుని దమయంతి పాణిగ్రహణ మొనరింపఁ దమరెవ్విధంబున సహించి యూఱకుంటిరి? దేవతానాయకులగు దమయంతటి వారలు కామించుచుండ, నమ్మానవతి మానవునెట్లు స్వీకరించినది ? మహానుభావులరగు మీరలీయవమానంబు సహించితిరి. కాని నాయంతటివాని కట్టి యగౌరవంబు తటస్థించిన నూఱకుండు వాఁడనే ? ఇంతయేల? మీకందఱకు నొక విన్నపంబు సేసెద; దయయుంచి వినుండు. ఆనిషధేంద్రు మోసపుచ్చి యారాకుమారినిప్పుడ యియ్యెడకుఁ గొనివచ్చెద. ఆసమయంబున మీకుఁ గోపంబురాదుకదా? మహాలాభంబొదవు పట్టున నీర్ష్యారోషంబు లెవ్వారికేనియుఁ గలుగుచుండు; ఐనను నంతవఱకురానేల? ఇంద్రాగ్నియమవరుణులు మీరలునల్వురుఁ,బంచముఁడనగు నేనుఁ,గలిసి పాండవులు ద్రౌపదినేలుకొన్న చందంబున నియమంబు లేర్పరించుకొని దమయంతి ననుభవింతముగాక! అప్పంకజాక్షి నీ క్షణంబునఁ గొనివచ్చెద," నని కపటోపాయాదులు తేటపడ బహుప్రకారంబుగ వచియించిన, నాదేవేంద్రాదులు, కలి మూర్ఖా

లాపంబులకు మనంబున నేవగించి, గంభీర భాషణంబుల నివ్విధంబున వచియించిరి.

మహోదాత్తయు; నిష్కళంకుండుc, బుణ్యచరితుండుc, బేదలపాలింటి పెన్నిధానంబుc, గలుషహరణుండును, నగు నిషధేశ్వరుండు మాయంతటి గౌరవనీయుండు. కావునc గలిరాజా! యాతని గౌరవింపుము. ఏము మక్కువమీఱ వీరసేనకుమారుండగు నలునిమెచ్చి యందఱ సముక్షమున, దమునిచెల్లెలగు దమయంతి నొసంగితిమి. ఇంతలో నే భంగిమాటc దప్పనేర్తుము? ఇంక వేయిమాటలేల? ఆతఁడు శ్లాఘ్యుఁడు; ఆతం డల్లుడు; మాన ల్వురలో నిచ్చి పుచ్చుకొనువారేరును లేరు; నీమాటలు మాకుc బ్రియంబులు గాcజాలవు. కలహకారకుండవు గాన నేమేమియో వచియించుచుందువు; ఇంక నుచితానుచితంబుల నెఱుంగక యానలునిcబట్టc జూడకుము. అని వచియించి తమలోcదాము, "నిషధాధిపుండు సదాచారసంపన్నుcడు; కావున నీకలి ద్వాపరు లేకమయికూడ నపకారంబుc జేయcజాలరు గాన, వీరిని బోవనిత్త"మని కూడcబలికికొని యింద్రాదులు ప్రౌఢభాషణంబుల, "ఓయమరశేషా! దమయంత్యనురక్తుడవై ద్వాపరునితోcగూడ నలరాజసభలోనికేగి ముందుగc బరిహాసంబు నందకుము. ఎందులకు నగుబాటునకై ప్రయత్నించెదవు?" అని యనేకవిధంబుల బోధించి భూలోకగమనంబు యుక్తంబుకాదనిరి. అట్లు హితంబుపదేశించినను వారి వచనంబులుc బెడచెవింబెట్టి యసూయావివేక మూర్ఖాది దుర్గుణంబులు నైజంబగుటcజేసి కలి కరయుగ్మంబు మొగిడ్చి

యిట్లనియె—"ఓ దేవవర్యులారా! మీకుఁ బదివేల వందనములు. నా శ్రేయంబు గోరుఁడు. నేను కొలఁది కాలము క్షోణీతలంబున సంచార మొనరించి చూచిన యెడల నిషధ దేశంబున నొకఁడున్న ధర్మంబు మీఱియుండఁడా? వాని దుష్ప్రవర్తనంబు మూలంబున జనపాలుండగు నలుని కొప్పి యపరాధంబుమోపి యాతనిసుఖంబుగ నుండనీయక పలు శ్రమలం బెట్టి చూచెదఁగాక! నా ప్రతిజ్ఞ నీయదె యాలింపుఁడు. జగద్విఖ్యాత చారిత్రుండగు నలుని నేను దప్పక పట్టెద. అందులకు దోషంబొండు నాకు లభ్యంబగుఁ గాక. నేను గొల్చు దేవతలు నాకు మాత్రంబు వరం బీయకుందురా? కాన నావగింజంత తప్పుదొఱకిన దాని నింద్రజాలంబు భాతి కొండంతగాఁ జేసి యెంతటివారి నేనియు ననేకకష్టంబుల పాలు గానీక యంతతో విడతునా? నలుని సారాయము ద్రాగించెద. జూదమాడించెద. దమయంతీ వియుక్తుని గావించెద. పరకాంతాసక్తుంజేసెద. సురవతంసులారా! పలుమాట లేల? మీయెడ మగులాన వచియించుచుంటి; నలుని గొలఁది కాలంబుననే రాజ్యభ్రష్టునిఁగ నొనరించి బహుబాధల పాలు చేసెద" నని కలి పల్క నింద్రాదు లేవగించుచు నాతని యుత్సాహంబు దైవ కల్పితంబు గావున నా యభిప్రాయంబు మార్చుట సాధ్యంబుగామి యొండొరుల మొగంబులఁదిలకించుకొనుచు మనకుఁ గలిరాజుతోడ వాదంబింతియచాలు. తమ్ముండు నన్నయు నగు కలి ద్వాపరంబులు బ్రహ్మదేవుని యాజ్ఞానుసారంబుగ నాలోకంబునుండి బయలుదేరి యుండవలయు. అన

ర్గళంబగు ప్రవాహంబునకు సేతువు నిర్మింప శక్యంబగునే? యని యెంచుచుఁ బదపదమని హెచ్చరించుకొనుచు నా యింద్రాదు లేగుచుండిరి.

## కలి వర్తనము.

అంత నా కలిరాజు కామ క్రోధ లోభ మోహ పరివార పరివృతుండై నిషధదేశంబు చాయ భూమండలంబునకు దిగి పుణ్యసమన్వితంబులగు యజ్ఞంబుల సతిథిపూజలఁ గాంచి గృహమేధులను వీక్షించి చింతిల్లుచు, యూప స్తంభ త్రిపుండ్ర ప్రభృతుల నాలోకించి తన్ను హింసించుటకుఁగా నుపకరించు కౌతుకంబవు ఖడ్గాదులఁగా భావించి తల్లడిల్లుచు, బ్రాహ్మణసముదయం బనుష్ఠానసమయంబున నాచమనంబునకై హస్తకమలంబున నుంచుకొన్న జలంబుఁ బరికించి తన్ను శపించుటకై యెత్తిన మంత్రోదకం బేమోయని తహతహపడుచు, ధర్మాంతర్గర్భిత కార్యాచరణులగు వంద్యజనంబులఁ దిలకించి వారలఁ దాను బూనవచ్చుఁగదా యని సంతసింప, నన్నయగు ద్వాపరుండు వారి యాచరణంబు లందలి ధర్మసూక్ష్మముల విప్పిచెప్పి తమ్ముని భ్రాంతిఁ దొలఁగించుచుండ నేరిని యాశ్రయించుటకు వీలుచిక్కక భంగమొందుచు, వేదపారాయణ పరులగు స్నాతక తపోధనాహితాగ్నులఁ బరికించి తన్నుఁ జంపు తలవరులఁగాఁ దలంచి ఖేదమొందుచు, నీశ్వరుండు లేఁడను బౌద్ధులఁ బ్రత్యక్షంబే ప్రమాణం బను చార్వాకులను బౌద్ధధర్మావలంబులగు జైనులను జూచి

యూఱటఁ జెందుచు, వితర్క వాద పాషండ కాపాలికాదు లకుఁ బౌద్ధప్రణామం బొనరించుచు, జైనాది భిక్షుకులగు దిగం బరులతోడ సహవాసంబుఁ జేయుచు, శైవోపాసకులు ధరించిన భస్మరేణువులు మేనఁదగులుచుండ నగ్నిస్ఫులింగంబు లని భయమందుచు, వ్రతానుష్ఠానాది ధర్మాసక్తుల కపకారంబుఁ జేయఁదలఁచి చెంతకేగి తూలిపడుచు లేచుచుఁ జింతించుచు నపహాసించుచు, రంధ్రాన్వేషణ కుతూహలియై పావనంబగు నిషధదేశంబునం దంతటఁ గలయఁ దిరుగుచు సంచారం బొన రించుచుండె. ఇవ్విధంబున నీచవర్తనుండగు కలిపురుషుం డాదేశంబునఁ గొలఁదికాలంబుండి, పరనిందాపర వ్యభిచారక వ్రతభంగక డాంబికదాస తత్పరప్రభృతుల నాశ్రయించి, రాజోత్తముండగు నలునియందుఁ బ్రవేశించుటకు సమయంబు వేచియుండె. కాని సైన్యసమేతంబుగా నెంతఁ దిరిగి వెదకినఁ గూడ నెచ్చోటఁ పాపకృత్యంబు కాన్పింపకుండె. అంత నా కలి యొక్క చోట నేకాంతంబున నందఱం గూరిచి ప్రత్యేకం బుగ నన్వేషణంబునంగాని దోషంబులు బయలంబడవు. కావున వివాదంబులందలి దోషంబులఁ గనిపెట్ట ద్వాపరంబు పని. నాకుఁ గామ క్రోధ లోభ మోహంబులకు వేఱ వేఱ నధికారం బుల నిప్పుడే నియోగించెద. ఇక నా వివరంబు వినుఁడు. యతుల సంతాన హీనకాంతల దీక్షాసతుల మాచకమ్మలఁ బతివియుక్తాంగనల మన్మథుండును, యాంత్రికుల మంత్ర పరుల జ్ఞాతులఁ దర్కశాస్త్రపారగులఁ గ్రోధుండును,

యజ్ఞదీక్షితుల వేదపాఠకుల భస్మలేపకుల లోభుండును, బాలుర వితండవాదుల నీచుల నహంకారపరుల మోహుండును, చంద్రశాలయందలి హంసతూలికా తల్పంబున నూత్న వధూకేళీ విహారణోన్మత్తుండైన నలుని నేనును, వారి వారి సామర్థ్యంబులఁ జూపి తప్పులఁ బరీక్షింపవలయునని యందఱ నియమించి తన యరదంబును దుస్సహుఁడను సారథిచే నిజ నివాసంబున కనిపి తానచట నిలిచియుండె.

సీ. యతి మాచకమ్మ గోడ్రాలు దీక్షాపత్ని
 మగనిఁ బాసినయింతి మఱునిపాలు,
తీర్థవాసులును మాంత్రికులు దాయాదులుఁ
 దర్కవాదులును గ్రోధంబుపాలు,
యజనదీక్షితులు నధ్యయనపాఠకులును
 భస్మకుంఠకులు లోభంబుపాలు,
బాలవైతండిక పామరాహంకార
 చుంబకమతులు మోహంబుపాలు,
తే. కేళిసౌధ మహాచంద్రశాలయందు
హంసతూలికాపాన్పుపై నహరహంబు
నవవధూకేళి విహారణోన్మత్తుఁడైన
నిషధనాథుండు నాపాలు నిక్కమరయ.

పిమ్మట నొక యశుభలగ్నంబునఁ గలిరాజు నిషధాపురంబుఁ బ్రవేశించి నల్లని పుట్టంబు ముసుఁగువెట్టుకొని పెడమార్గంబుల శిథిలగృహవేదికల విశ్రమించుచు, దేవాలయంబుల వంకఁబోక భోగవనితాగృహంబుల ముంగిటనుండి నడచుచు, జూదంబు మొదలగు యాటవేడుకల కానందించుచు, సురావిక్రయస్థానంబులదాఁటి చతుష్పథంబులు మీఱి, దూరంబుగా నేగి యేరికిఁ దెలియఁబడకుండ రాజమందిరంబుఁ జేరి,

సమీపంబుననున్న విహారసౌధంబు ప్రక్కంగల శిలాప్రాకార పరివృతంబైన నందనవనతుల్యంబగు మందిరోద్యానంబుఁ బ్రవేశించిఁ క్రీడాసరస్సునకుఁ బశ్చిమంబున నారికేళ ఖర్జూరపనస జంబూ నింబాది తరు సంఘంబున దూరి, గాలి చొరుటకు గూడ శక్యంబుగాని యొక పొదరింటిఁ జొచ్చి, యయ్యెడ నుండి శాఖోపశాఖల నాకాశంబు నొఱయుచు, దిశల నావరించియున్న తాండ్రయను మహావృక్షకోటరంబున వసియించి నలుని జయించుటకై యాతని దోషంబుల వెదక నాసక్తుండై యుండె.

అంతట నిషధరాజు తద్విధంబున నిజగృహప్రవేశంబొనరించి సముచిత ప్రకారంబున, సామంతరాజామాత్య సేనానాయకాదుల వారి వారి నివాసంబుల కేగ ననుజ్ఞయొసంగి యనిపె. పిదపఁ దోయజాక్షులు జనంబుల నిటునటుఁ దొలగించుచుండఁ బెండ్లికూఁతురగు దమయంతి బంగరుపల్లకియందు సవిలాసంబుగఁ గూరుచుండి మంగళవాద్యంబులతో నంతఃపురంబున కేగుదెంచె. ఆశుభసమయంబునఁ బండితోత్తములు రచించిన పాటల నంగనలు చెవులపండువుగఁ బాడుచుండిరి. వధూవరులు వైదికాచారపారగులగు పెద్దలయాజ్ఞను గృహప్రవేశ సమయోచితంబులగు మంగళకృత్యంబుల నన్నింటి నెఱవేర్చుచుండిరి. అప్పుడు నలుని కేళీమందిరంబు నానావిధ రచనా నిపుణులగు శిల్పవర్యు లలంకరించియుండిరి. అందొక చోటఁ బూలపందిరియు, నొక తావునఁ బట్టుగుడారంబు, నొకచోఁ దూగుటుయ్యెలయు, నొకప్రదేశంబునఁ గిలకిలమను ధ్వని

యొనరించు మంచంబును, వేఱొకవంకఁ జంద్రశాలయు నిర్మింపబడియుండెను. ఒకయెడ మఱఁద్రిప్పిన నొక బొమ్మ యందంబుగ నృత్యంబొనరించు? ఒకకీలుగదలింపఁగుడ్యగర్భంబు నుండి యువతిరీతి మాటలాడు; సీలంపురాల నిర్మింపఁబడిన జలయంత్ర సాధనంబున సన్నని వర్షంబుగుఱియు; వేఱొక చాయఁ బగలు చంద్రకాంత స్తంభవితతి వెన్నెలఁగాయించు; బోషిత రాజకీరంబులతోఁబాటు కనకపంజరంబులందలి గోరువంకలు భాషించుచుండె; ఒకకుడ్యభాగంబున మోహావశులగు రతీ మన్మథులఁ జిత్రించియుండిరి; వేఱొక పజ్జఁగామరస భావంబులు సుబోధ్యంబగునట్టుల ననేకంబులగు చిత్తరువులొప్పారుచుండె. ఒకక్రేవ, దేవమానవాదికాంతల కామక్రీడలు జరించిన విధంబులు ప్రదర్శితంబగునట్టుల లిఖింపఁబడియుండె. అచ్చటచ్చటఁ జిత్రవర్ణపు దుప్పటుల విచ్చినయెడలఁ గామశాస్త్రవేదుల మనంబులు రంజిల్లఁజేయఁగల యెనుఁబది నాలుగు బంధంబులు మనోహరంబుగ రచియింపఁబడియుండె. గగనంబునంటు కేళీసౌధాగ్రంపుఁ గొణిగల యందలి బంగారు గువ్వగూళ్లయంచులనిలిచి కిన్నరదంపతులు కిన్నరలమీటుచు మన్మథ జయగీతంబుల హృద్యంబుగఁ బాడుచుండిరి. ఒక గదియందలికస్తూరితలుపుఁ దెఱవఁ బరిమళరూప ప్రవాహము వెల్లి విరియుచుండును; అందు సుగంధదీపంబులువిరాజిల్లుచుండు.

## దంపతులవిహారములు

ఇవ్విధంబున మదనోద్రేక దీపితంబగు నాకేళీసౌధంబున దమయంతీ సహితుండై నిషధరాజు రతీ మన్మథులవోలెఁగా

మసౌఖ్యంబు లనుభవింపఁగోరి యధిరోహించుచుండె; దమయంతి, యమేయానంద మనుభవింపనున్న యాసమయంబున మనోహారిణియై యందంబుమీఱఁ బ్రకాశించుచు లజ్జావేశంబు దోఁపనీక ధీరత్వంబున నుండె. స్వప్నంబున నలసమావేశంబులీనటకు సహస్రంబులై నవి. భ్రాంతిరూపకంబులగు వేడుకలనేకంబులఁగాంచినది; మనంబున నాథునిపైని పూర్ణమోహంబు నిండియున్నది; ఇంక నెందుల కా సతీమణికి లజ్జాభయ లేశంబులుండవలయు? ఐనను బాలభోదుల మనంబు లొక సమయంబున తాలకన్న నతికఠినంబులు; మఱొకవేళఁ బుష్పంబుకంటె నతిమృదులంబులుగా నుండు; గాన వ్రీడాభీతులు నిజంబుగ నాకోమలి కుండియున్నవో? లేవో? యెవ్వరు చెప్పఁగలరు? వనితా హృదయంబు లతిగంభీరములుగదా! భీమకుమారి, కళావతీ ప్రముఖసఖీజన ప్రయత్నంబున, నవరత్నాలంకృతంబు ధౌతపీతాంబర సంశోభితంబు నగు పర్యంకకలితంబు, సమీపస్థ సుపర్ణకలశ తాలవృంత దర్పణ తాంబూలపేటికా ఫల కుసుమ గంధ కర్పూర కస్తూరికాది పరికర ప్రకాశితంబు నగు శయనాగారంబుఁజొచ్చి తల్పముం జేరి లజ్జాన్వితయై మోము వంచుక వాల్చి పదాంగుళి నేలఁ వ్రాయుచునుండఁ, జెలు లుపాయంబున నాదమయంతిఁ బువుఁబాన్పుపైఁ జేర్ప మదన కళాప్రవీణుండగు నలుండెంతయుఁ బ్రేమతోఁ నెత్తి వక్షంబున జేర్చుకొన సఖులేవేవియో పనులుగలవారువోలె నయ్యెడనుండి వెడలిరి. తదుపరిఁ గూర్మిమీఱ రత్నపరీక్షార్థమై తవంబున నాయింతి కుచంబులఁ బాణిపద్మంబున స్పర్శనంబొనరించె. సతీ

మణిని నవ్వింపఁజేయుద మని నలరాజచంద్రుండు విద్యుచ్ఛక్తి మూలంబున వెలుంగు నాదీపంబులం దొకదాని నార్ప నన్నియు నారిపోయె. మిగిలిన దీపంబులఁ జేలాంచల తాళ వృంతాదుల విసరుటచే నారవయ్యె. ఆరిపోయిన దీపంబులఁ జూచుచుండఁగనే మఱల వెలుంగఁజేసె. కొన్ని దీపంబులు వెలుంగుచుఁ గొన్ని యారునట్టుల విచిత్రంబొనరించుచుండినను మందహాసం బొనరింపక లజ్జా భయ, శంకావశయై మదనవశ గాకుండె. పాపము; మన్మథుం డాయింతి లజ్జాతిశయంబునఁ దన్నులఁదినియు, భయభావంబునఁ ద్రోయంబడియు మనంబున రోసమూనకుండుటఁ జూచి నాశ్చర్యంబుగ నున్నయది. మారుండు బాలుఁడా యేమి?

"తే॥ తరుణి లజ్జాభరంబుచేఁ దన్నువడియుఁ
దోయజానన వెఱపుచేఁ ద్రోపువడియు
నుల్లమున ఖేదమంపక యుండనట్టె
బాలుఁడా యేమి తలపోయఁ బంచశరుఁడు"

ఆ రాకుమారి యనుకూలంబుగ నుండుదమని తలంప లజ్జా భయంబు లాతోలికూటంబున విడువఁజాలవయ్యె. నలుండుఁ జనువొసరింపఁబూని యేవియో భూషణాది కంబుల సవరించు నెపంబున నా యింతి కోమలాంగకంబుల నంటుచు ననేక యుపాయంబులచేతఁ బరిహాస వాక్యంబుల వలనఁ బ్రయత్నించియుఁ బూర్ణమగు చిఱునగవుం గాంచలేక పోవుచుండె. మదనోద్రేకంబు మెండగుట నలుండు దమయంతి నొక్కమాఱు బిగికౌఁగిలి యొనరింప, నానందోదయయై లజ్జ నించుకవదలి క్రీడాభిలాష సూచింపఁగడంగె. ఆ

పృథ్వీశ్వరుండు దీనత్వంబుగ వేఁడి యొకముద్దుఁగొనియె; అధరా
మృతంబాని నన్నేలికొంటివిగదా యని వచియించె; నీభృత్యు
నకిదె యర్హకృత్యంబని యూరుస్పర్శనం బొనరించె; నేనును
నీ సఖీజనంబులఁ బోలినవాఁడ! నీవింత మన్మథకేళికి వెఱవనేల?
వెఱవాఁడఁగానని బుజ్జగించుచు బోకముడి సడలింప నాకో
మలి మఱువ సంసిద్ధమగుచుఁ బ్రతికూలంబుగ నుండ లాలన
వాక్యంబు లుచ్చరించుచు, నృపాలుండు చుంబనాలింగనాది
కంబు లొనరింపఁ గ్రమక్రమంబున నాకోమలి సమ్మోదమగ్న
మానస యగుచుండఁ, గస్తూరికా కుంకుమాది లేపనంబుల
నొప్పారు స్తనద్వయంబుఁ బాణియుగ్మంబున సంధించుకొనియె.
ఆ తరుణీమణి నాథుండిట్లు దర్శనచుంబనాలింగ నాదికంబు
లొనరింప వ్రీడాభరంబున వదనంబు వాల్చ ఫాలంబునఁ
బ్రక్కకుఁ ద్రిప్పఁ జెక్కుటద్దంబులను, సమయానుకూలంబుగ
జుంబింప నింక దప్పించుకొనలేనుగదా యని తలంచి మోము
నెత్తి మోవిచుంబనంబుఁ గావించి ధరణీంద్రుండు చిఱునగ
వొనరించె. అంత నాదంపతులు కప్పూరంపుఁ దాంబూల చర్వ
ణంబున నరుణ సుగంధంబులగు యధరామృతంబులఁ బానం
బొనరించి తుల్యసుఖంబు ననుభవించిరి. దమయంతి, యస
మాన రూపవయోవంతుండగు నన్నలుని నూత్న క్రీడయందు
జిరకాలోపార్జిత పుణ్యఫలంబుగ సోత్సాహయై కేళీ విశేషం
బులఁ గుచ కుంకుమలేపంబుల, నీలంపు ముంగురులనుండి వీడిన
పుష్పంబులఁ, బాదపద్మంబులనుండు క్రొత్తలత్తుకలఁ, దాంబూ
లరసరాగంబులచేతఁ బర్యంకభాగం బొప్పియుండఁ; బాగడం

బుల ధ్వనియుఁ, గంకణ ఝణత్కారంబు, మొలనూలి చిఱు గంటల ధ్వానంబు, మణితంబులు, గీచు కీచు మను ధ్వనులం జేయు పఱపుచప్పుడుల నధికంబు సేయుచుండఁ, గ్రమంబుగ ముక్తాహారంబుల ముత్యంబులు గుఱియుచుండఁ గేళీ సౌఖ్యం బనుభవించుచు, నిశ్శ్వాసవాయు పరిమళంబుల వెదజల్లుచు, నర్ధనిమీలిత నయనయు, నాసికాగ్రజనిత స్వేదయు, లాక్షా విహీనా ధరయు, లుప్తలలాటతిలకయు నగు వదనకమలంబు హృదయవల్లభు వక్షస్థలంబునం జేర్చె. తదుపరి యా దంపతులు సుఖనిందఁ జెందిరి.

పిమ్మట దర్శనస్పర్శనాదికమూలంబునఁ దనివి సనక మఱలఁ గ్రీడింపఁజొచ్చిరి. కోమలాంగి నాథుని లలాటంబు నందలి లాక్షాచిహ్నంబుఁ గాంచి మోముఁద్రిప్పి ముసిముసినగ వొనరించె. ఎందులకని ప్రాణేశుండడుగఁ గరంబునకద్దం బిచ్చి మీర చూచుకొనుఁడనియె. చాటుగ స్తనంబుల నఖక్షతంబు లున్న వేమో యని చూచుకొనుచుండ విభుండు మందహాసం బొనరింప మీరలు మీఁచిహ్నంబులఁ జూచుకొనని యది యేల పరిహాసంబుఁ జేసెదరు? అని ధవునితో సరససల్లాపంబులు పచరించె. దమయంతి, వల్లభుని మోవిపై దంతక్షతంబుఁ గాంచి క్రేఁగంటఁ జిఱునగవొనరించి నంతలో నదిమొగతాళిగ నుండునని తెప్పలమధ్య నడంచుకొనియె. ప్రాణనాథుం డత్యం తానురక్తుండగునటుల నావధూతిలకం బన్యకాంతలఁబోలె వస్త్రభూషణ మాల్యాద్యలంకరణముల నానావిధంబుల ధరించి పరకామినులు నాఁడోచురీతి ననేకశృంగార బంధంబుల

సమరూపంబుగ మెఱంగుచుండె. పతివ్రతా ధర్మంబున నాథుండు పరవనితాసక్తుండు గాకుండు నటులఁ దాన వివిధ రూప చమత్కారంబులఁ బ్రౌఢంబుగాఁ దనియింపఁ జేయుటయు; ఇవ్విధంబున నావధూవరులు మదన క్రీడాపారగులై యానందసాగరంబున నోలలాడుచుండఁ దెల్లవాఱుచుండె; కుక్కుటంబులుఁ గూయఁదొడంగె.

# ఆంధ్రనైషధసారము.

## అష్టమాశ్వాసము.

ఆసమయంబునఁ గేళీసౌధప్రాంతంబుననుండి వైతాళికులుచ్చైస్స్వరంబుల నిట్లు వచియించిరి, "జయము; చంద్రకళాభరణుండవగు నిషధేంద్రా! జయము మహారాజా! వేఁకువజాము సమీపించుచున్నయది; నిద్రమేలుకొనుము. శయనతలంబునుండి లేచియుండిన దమయంతీ దివ్యమంగళ విగ్రహము నీకుఁ గనులపండువుఁ జేయఁగలదు. ఆశుభశకునంబున నెల్ల మంగళంబులులభ్యంబులగు. చంద్రకిరణంబులకాంతులు తగ్గుచున్నయవి; ఇందుఁడు ప్రభాహీనుండగుచుఁ బశ్చిమదిశం గ్రుంకిపోవుచుండె; నక్షత్రంబులు కాంతిహీనంబులై యటనట నుండుచుండె: మధుపంబులు తెల్లకలువలనుండి వెడలి పద్మంబులఁ జేరుచుండె; అదే ప్రభాకరుండును తమంబు వోనడచి ప్రాగ్దిశ నుదయింప సంసిద్ధుఁడగుచుండె; ఇఁకఁ ద్వరలో నాకసంబెక్కఁ గలఁడు. తమోగజ కంఠీరవంబులుఁ గమల షండబాంధవంబులు నగు కిరణంబులు వియద్వీథి వ్యాపించుచున్నయవి; కాన వేగంబ మేలుకొనుము. నలసార్వభౌమా! శివపూజా సమయంబయ్యె; క్రమంబునఁ జూచుచుండఁగనే

చంద్రశాలా గవాక్షంబులనుండి యీ లేయెండ ప్రవేశించుచున్నయది; నాథుండగు చంద్రుండు స్తమింప నుండుటం జూడం జాలక తారకాగణంబును రాతిరియు నాశమొందె. పత్యనురాగంబు నా మూలంబుగ విశదీకరించియుండ నా చంద్రుండు సతీవియోగంబులం దిలకించియు ఖేదమొందక కఠినహృదయుండై యింక జీవించియె యాకసంబున నిలిచియున్నవాడు. గృహావరణంబులందలి చెట్లపై వాయసంబులు కా-కా-కా యని యఱచుచున్నయవి. కోయిలగుంపులు మధుర కంఠంబులం గల స్వనంబు లొనరించుచున్నయవి; మకరందపానం బొనరించి మత్తెక్కిన తేటులు ముకుళంబులగు కలువలం జిక్కి ఝుంకారం బాచరించుచుండె; వేగలేచి ప్రాతఃకాల కృత్యంబుల నిర్వర్తింపుము." అని యివ్విధంబున దమయంతీ సమన్వితుండగు నలునిం బ్రబోధించు ప్రారంభదినమగుట మహోత్సాహంబునం బ్రభాతకాల వర్ణనంబుసేయు నా వైతాళికులకొసంగ దమయంతీదేవి, సంతోషస్వాంతయై యూడిగంపు గరితచే దారిద్ర్యంబుం దీర్పంగల పద్మరాగాది మణి ఖచితంబులగు సువర్ణభూషణంబులం బారితోషికముగ నంపె.

తదుపరి నలమహారాజు వివాహంబున మామగారొసంగిన యీశ్వరదత్తంబగు కనకరథంబును మది దలంప సహస్రభానుభాసమానంబగు నా తేరు క్రీడాసౌధంబునకు సమీపంబుగ నిలిచె. బంగరుం జిఱుగంటల నొప్పారు కుబేర పుష్పకంబుపోలె మెఱయు నా యరదంబు నలావ

నీశ్వరుం డధిరోహించి యుత్సాహంబున గరుత్మంతు నెక్కు నారాయణునిభంగి వాయువేగంబుతో గగనపథంబునఁ బ్రాతఃకాలస్నానం బొనర్చుటకై చనుచుండె. ఈశ్వర జటాజూటంబున నుదయించి, ధ్రువనక్షత్రం బొరసికొనుచు దారామండలంబున మొసలి యాకారంబుగనుండు నక్షత్రరూపంబుగై కొని, పవళించియున్న శ్రీమన్నారాయణుని చరణపద్మంబులఁ దడుపుచు, సూర్యచంద్ర కక్ష్యంబులదాఁటి, మహాధ్వానంబున దశదిశలు మాఱుమ్రోగుచుండ, స్వర్ణపుర ముఖాలంకారమును, శ్రీ మహావిష్ణుపాదపద్మ మకరందాయమానంబును, నానా కల్మష హారిణియు, బ్రహ్మాకమండల పుణ్యోదక ధారయు నగు వియద్గంగానదిని సమీపించి, శతాంగంబు డిగ్గి యైరావతాప్సరోంగనాది సముదయంబు మజ్జనం బొనరించు నొక్క రేవుంజేరి, నియమ పూర్వకంబుగ బంచాంగముం జదివి, మంత్రసహితంబుగ స్నానంబొనరించి; దేవఋషిపితృబృందంబునకుఁ దర్పణం బాచరించి, సంధ్యాదేవి నారాధించి, సూర్యుని సేవించె. బంగారంపు టిసుక లింగంబు భాతి కల్పించి యీశ్వరు నావాహనముఁజేసి చద లేటనుండు సువర్ణకంజంబులఁ బూజయొనరించి, పారిజాతలతా పల్లవంబులఁ దెచ్చి వేలుపుల గిడ్డియగు కామధేనువున కాహారంబువెట్టి, కరద్వయంబు శిరంబునఁ గీలు గొలిపి సమీపంబున మింటవెలుంగుచున్న మునిశ్రేష్ఠులగు నక్షత్రంబులకు మ్రొక్కులిడెను. ఇటు లాకాశగంగా తీర్థయాత్ర ముగించుకొని దివ్యరథంబునెక్కి నిజ సౌధోపరిభాగంబునందలి చంద్ర

శాలా ప్రాంతంబునకుఁ జేరుచుండఁ, బ్రాతఃకాల కృత్యంబులం దీర్చుకొని వచ్చిన నాథుని భక్తివినయ విధేయత లొప్పార దమయంతి యెదుర్కొనియె.

వధూవరుల గోష్ఠి.

ఖరకరకిరణంబుల వికసించు మందాకినీ హేమ కుశేశయంబు భాతిఁ బతి సందర్శనానందంబున మందస్మిత వదనారవిందయగు నాకోమలి మదనానురాగంబు నంకురింపజేయుచుండ, నా సార్వభౌముండు చదలేటి మజ్జన విధానంబును నోటితో వచియింపకయ చెప్పినభంగిఁ దావు లుడివోని కాంచన తామరసంబు నొకదాని సంతోషంబున నా సతీమణికిఁ బారితోషికంబుగ నొసంగె.

"ఉ॥ మానస సంప్రమోదము సమగ్రముగా సురలోక వాహినీ
స్నానవిధిప్రవృత్తి వచనంబునఁ జెప్పక చెప్పినట్లు, స
మ్మానసఁ దన్నెదుర్కొనిన మానవతీజనతా లలామకుం
గానుకయిచ్చెఁ దావి చెలిగాని కనత్కనకార విందముల్"

ఆ సమయంబున నా పురుషోత్తముని ప్రియురాలు తత్కనక సారసంబు హస్తంబున ధరించి లక్ష్మీదేవిఁ బోలె భాసిలుచుండె. ప్రేమంబున నాథుం డొసంగిన దానికిఁ బరమానందము వహించియుండె. పిమ్మట శిష్ట కృత్యంబుల నిర్వహింపఁ గోరి యా చకోర లోచనం గడకంట వీక్షించుచు నిషధాధ్యక్షుం డగ్నిహోత్ర గృహంబునకుం జని పవిత్రమంత్రంబుల దక్షిణాగ్ని గార్హపత్యాహవనీయాగ్నుల సేవించె. ఈరీతి నా భూపాలుండు ప్రాతఃకాలకృత్యంబుల నన్నిటి నిర్వర్తించుకొని దమయంతి యభి

ప్రాయంబుఁ దెలిసికొనఁగోరి మెల్లఁగ బాదంబు లిడుచు నేతెంచి, పరిహాసంబుగ నామెకన్నులఁ జేరలం గొలుచు కై వడి హస్తకమలంబుల మూసి, సఖీజనంబులు నవ్వ దొడంగ నూఱకుండుఁడని కనుసంజ్ఞచే సూచించుచు, నొక్క పూఁబోడిని భ్రూవిక్షేపంబున రాఁబిలిచి, తా నొసరించు నా కృత్యంబు నామెచేయునట్లు గావించి యెఱుంగని విధంబున నా ధరాధీశ్వరుం డపుడ వచ్చినటుల మిగుల నవ్వ చుండె. దమయంతి మొదట నట్లులొనరించిన వారి హస్త స్పర్శ పరిచయంబున నాథుండనియుఁ దదుపరిఁ బెఱ వారలనియు మనంబున గ్రహించి, మోసంబుఁ జేసి నందుకుఁ గినుకఁబూని, మౌనంబు వహించి, భాషింప కుండె. చెక్కిళుల యరుణంబును, భ్రుకుటి విక్షేపంబును వక్రతమంబగు కడకంటి చూపును, నాథుండు చూడఁ గోరి యా దమయంతికిఁ జిఱుగోపంబు బుట్టించె. అట్టి ప్రణయ కోపంబులే కదా కామోద్బోధకంబులు. అంత నా రాజు సామోపాయంబున నా యలుక నపనయింపఁ దలఁచి "కమల ముఖీ! నా యీ వచనంబుల వినుము; మదనుండు సాక్షిగ నిన్నటిరేయి నీ సేవను వహించినాఁడ; నీ కేదేని నాయెడ సందియం బుండునెడల మఱల నన్నుఁ బనిం గొనుము; నేను నీ దాసుఁడనేకదా; నాపై నింత గోపంబు బూననేల? అయినను లేయెండ యుష్ణంబయ్యుఁ బద్మంబుల కింపు గొల్పు విధంబున నీ యలుక కఠినమయ్యు నా హృదయమున కానందముఁ బురికొల్పుచున్నది. నీ యరుణాధరం

బున నే మును గావించిన దంత క్షతంబునకుఁ గోపింపఁ దగదు; ఫలరసాస్వాదనంబొనరించు చిలుకపై దొండతీగ యలుకం బూనుచున్నయదా? నీ యపాంగ వీక్షణంబులఁ బ్రసరింపఁ జేయకుంటివేమి? అమృతంబుఁ జిలుకు నీ మధుర వాక్యంబుల నుచ్చరింపవేల? బింబాధరీ! కోపంబుమాని నీచల్లని మాపుల నాపైఁ బఱపి నాతాపంబు దీఱ నొక్కమాఱుఁ గౌగిలి యొసరింపుము. మారకేళిని నీ సేవకుఁడ; నీ కాల యూపనంబున కే నోర్వంజాల? ప్రణయకోపంబు దీర్ఘంబైన రసభంగమగు. నా యనురాగం బధికంబగునట్టుల దృఢంబుగఁ గౌఁగిలి నొసఁగించి మోవిఁ జుంబించు భాగ్యం బొసంగుము. మారుండు నాపైఁ గ్రూరశరంబుల నతితీవ్రం బుగఁ బఱపుచున్నవాఁడు. ఇంక నేనీ విరహంబునకుం దాళ జాల" అని వచియించి బలిమిమై దమయంతి నాలింగనంబు జేసి శయ్యాతలంబునకుం జేర్చి తన సతి ప్రియంపు నెచ్చెలి యగు కళావతి యనుదాని రప్పించి యాదరంబున నగుచు నిటుల వచియించె.

కళావతీ! నీవు చమత్కారవాక్యోచ్చారణను నేర్పరి నని వినుచుంటిమి; నీ యెఱుంగని న్యాయంబులు వేఱ నుండఁ బోవు; మాతగవుఁ దీర్పఁదలంచితేనిఁ గొన్నిమాట లడిగెదము; మాఱాడక విచారించి ప్రత్యుత్తరంబిమ్ము. మీ భీమరాజ కుమారి యన్యపురుషుని గలలోనేనిఁ దలఁపఁబోదని వినుచుం దుము; కాని పరపూరుషుండగు చిత్తజుని నేవిధంబుగ మనం బున నుంచుకొన్న యది? యని వచియింపఁ గళావతి, రాజతి

లకా! ఆమె హృదయంబున నున్నవాఁడ వీవ; నీ ప్రతిబింబమే మదనుండు; అటులఁగాకున్న యశరీరుండగు మదనుండు శోభనా కారులగు మిమ్ముల నెట్లు పోలఁ గలఁడు? అనియె.

రాజచంద్రుండు, వికసితనేత్రకమలంబుల జెలుల జూచు నాతన్వి, మమ్ముల నరఁగంటఁ గనుంగొన మే మొనరించు నపరాధమేమి? నీవ వచింపుము? అన నా తొయ్యలి, మహారాజా! నీ సౌందర్య రూపం బించుఁబోఁడుల లోచనాబ్జముల నాకర్షించి యంటుకొనజేయు నను భయంబున మా రాసుత మిమ్ముఁగనకుండ నుండఁజాలక నరగంటఁ జూచుచున్నది యనియె.

అటు లనురాగంబు నిశ్చయంబైన నా యింతి నిన్ను నవ్యక్తమధుర స్వరంబునఁ గలికీయని బిలుచుచుండ నన్ను నలా! యని పిలువ నాలుకకు భారంబు కాబోలు ననఁ గళావతి రాజచంద్రా! మా దమయంతి దేవర దివ్యనామంబు రోజయుగ్మంబున ముత్తియంబుల యొంటిపేట హారింపు మిషంబున జపమాలికఁ దాల్చి హృదయంబున నిత్యవ్రతంబుగ జపంబు సేయుచు నేయున్నదనియె.

పృథ్వీశుండు మదగజకుంభములఁ దిరస్కరించు నా యింతి స్తనంబులు హృదయంబెల్ల నాక్రమించి యుండ, నింక మేము వసియింపఁ జోటులేనందున మా నామము జపించుచున్న దనిన నెట్టులు నమ్మగలవారము? అన నాకోమలి భూపాలా! మీరు హృదయంబున నుండుటం బట్టియే యుండ నవకాశములేక వక్షోజ

యుగ్మము బయలున కుబికియుండుటం జూచియు మాకీసంది యుం బేల? యని యారాజచంద్రు నుద్దేశించి నీ వాడి నఖంబుల క్షత మొనరించి యొత్తి పీడించితివి గానఁ గఠిన హృదయుండవగు నిన్ను గాంచి మాచంచలేక్షణ కుచ యుగ్మంబు పైటలోఁ దాఁగియుండినవని వచియించె.

నిషధేంద్రుఁడు, నీ చెలి చందోయి, మదవారణ కుంభ సంపదాపహుల నపహరించి పయ్యటలో దూఁకియుండ, జనపాలురు దొంగలఁ బట్టి పీడించుట న్యాయంబే గదా? యని పల్కి, "కళావతీ! నీవు మా మాటలకుఁ బ్రత్యుత్తరం బిచ్చితివి; నీ చెలికత్తియ నేఁడు మాతోడ నేల మాటలాడదు? నీ వేకాంతంబుగ, దత్కారణంబుఁ గనుంగొని మాకెఱుకఁ బరపుము; మేము నిన్ను మెచ్చుకొనియెద" మన యేలినవారు నన్నిట్టి కార్యంబున నియమించుట దమ యనుగ్రహంబే కదా! యని మదనశాస్త్ర పారంగతురాలగు నా కళావతి దమయంతిం జేరి రహస్యంబుగ "చంద్రవదనా! నాముఖంబున గామశాస్త్రంబు నంతయు వింటివి. నీ నాథుండు గడుజాణ. నీ వాతని మనోభిప్రాయానుకూలంబుగ సురతక్రీడల నొనరించి యుంటివిగదా!" యని దమయంతి నడుగ నాథునితోఁ బాటుఁ గేలిసేయుచున్నదని తలంచి చెలి నెఱ్ఱదామరతోఁ గొట్టి భ్రూవిక్షేపంబున బెదరింప నాకళావతి దమయంతిం జూచి లేని కోపంబుఁ దెచ్చుకొని, నీకుపదేశగురువు నగు నాకు రతిరహస్యవార్త సెప్పవైతివి; ధూర్తవై నీవు సెప్పకుందువుగాక. నా చాకచక్యంబున నిముగని చేత నీయెదుటన చెప్పించెదను.

ఇదె చూడుమని కొంత తడ వేకాంతంబున నుండి యంతఃపుర చేటియగు కళావతి మహీకాంతునితో నిట్టులనియె.

రాజా! మన తలంపుల కంటె నీమగువ బుద్ధికుశాగ్రతుల్యంబగునదియ; ఇంతవఱకు నీయింతిని బేలయనుచున్నారము. కాని యింతటి ప్రౌఢతనం బేకలికికిఁ గలదు? "ప్రణయకోపంబు లనురాగాతిశయంబు లొనరించు నౌషధంబులు; అట్టి యలుకలు లేకుండ మగవారికి మగువలు ప్రేమాస్పదలుగఁ గాఁజాలరు; అయ్యవి దీర్ఘంబులైనఁ బ్రేమభంగకారణంబులగు; గావునఁ గోపంబింత మాత్రంబ చాలు" నని పలికి తమకు మాఱుగాఁ బాదప్రణామంబు సేయంబోయి విలాసకమలంబు ప్రేటువడితి? పడితిఁ గాక యాదమయంతి చిత్తంబు నెఱింగి వచ్చితి; అవధరింపుము మాభీష్మకుమారి నీవు నలుండవని నమ్మికున్న యది; ఇంద్రుండవు గాని చో మందాకినీ సువర్ణకమలంబు నీపుడమికిఁ దేనేరికి శక్యంబగు? ఆ కారణంబున మది శంకవహించియున్నది. దేవరా! ఐశ్వర్యసూచకంబగు వజ్రరేఖామిషంబునఁ బాణికమలంబున వజ్రాయుధంబును ధరించి యున్నాడవు. నీవు మఘువుండవు కావా? లోకపాలుండవు, నస్వల్పలోచనుండవు, వజ్రపాణివి, దేవతావల్లభుండవునై యిన్ని లాంఛనంబులుఁ గలిగి యుండ నిజంబుగఁ బురందరుండ వగుదువు; కాక నిషధేంద్రుండవే యైన యెడలఁ జిహ్నంబుల నెఱిగింపుము. మహేంద్రుండు మాయాజాలవిదుండౌట స్వయంవరంబున నలరూపధరుండైన యట్లు స్వర్ణ కమల దానంబునగూడఁ గామించి యున్నటుల మా

దమయంతి సందేహించుచున్నది; ఈకోపంబున కాహేమా
ఙ్గంబే కారణంబు. అతండు తొల్లి యన్యకాంతాసక్తుండై
మదాంధతచే గౌతముని యింటఁ గోడియై కూయలేదే? అట్టి
బిడౌజుం డెంతటి కార్యంబునకేని సాహసించు. నీవు నిజంబుగ
నలుండవయితేని మీ యిర్వురకే తెలిసిన కామరహస్యంబులు
సూచించి నీ సతీతిలకంబు శంకా కలంకంబు నపనయింపు. మన
వుడు మందస్మిత సుందర వదనారవిందుండై యద్దమయంతి
నుద్దేశించి పాకశాసనుం డను సందియంబుఁ దొలంగిపోవునట్లుగ
నారాజపుంగవుం డిట్లులనియె. కలువకంటీ! పురుషాయిత
రతి సమయంబున మదీయవక్షోభాగ విలసితంబగు చింతామణీ
హారనాయకరత్న దర్పణంబున, ఘర్మబిందువులఁ గస్తూరిబొట్టు
ద్రవరూపంబై క్రిందికి స్రవించుటచే శ్యామలంబగు నీముఖక
కమలంబుఁ జూచుకొంటివిగదా? మానినీ! నీసహజారుణాధరం
బునకేమి కోపంబు వాటించునో యని భోజనసమయంబునఁ బ్రతి
పక్షులగు ద్రాక్షా మధు ఖండశర్కరాదుల మది సంశయిం
చుచుఁ బొగడెడి వాఁడఁగాను. మెఱుఁగుబోఁడీ! ప్రథమ
సురతంబునఁ బరిశ్రాంతి నొంది రెండవమా రంగీకరింపని
నిన్ను స్వల్పకాలయుతంబగు గ్రీష్మయామిని వని పరిహసిం
చితి; భవదీయాంగకంబులు ముద్దులుఁగొను సమయంబున
నీ చెక్కిలి గిలిగింత యొనర్చుచుండెడి వాఁడను. అయ్యవి
యింతిలో నీవు మఱపుఁగొంటివా? ఇందుకు మదనుండుసాక్షి
యగునని సంభోగ ముఖరహస్య చిహ్నంబు లానవాలుగ
నుండునటుల రాజు వచియించుచుండ నా దమయంతి నాథు

నిం జెప్పకుండని నేత్రసంజ్ఞ వారించుచు, యీ మాటలు చెవింబడకుండ నెచ్చెలియగు కళావతి కర్ణంబుల హస్తాంభోజ యుగ్మంబున మూసె.

"మ॥ అని సంకల్పనిసైక సాక్షులగు శయ్యానేక సంభోగ చి
హ్నానలన్ భూపతి ప్రత్యవేక్షించి కొంకక యందంద వాక్రువ్వ, న
వ్వనితారత్నము వాలుగన్నుల బతిన్వారించుచు న్మూసెనో
య్యన ధాత్రేయి శ్రుతిద్వయంబు నిజహస్తాంభోజయుగ్మంబునన్."

ఇట్లు లజ్జావశంబున దమయంతి చేసిన కృత్యంబున కా కళావతి, "భూపాలా! చక్రంబులు వోలెం గఠినతమంబులగు నా కర్ణ భూషణ స్పర్శనంబున నీమె సుకుమారపాణి పద్మంబులు గాయంబగు; కాన వేగంబ యేతెంచి నీకు శ్రమంబైనను నా యీ శ్రుతి నిరోధంబుం బాపు" మన నలుండు నీవు మాన్యురాలవు! కాన నీమాట నతిక్రమింపం బాడిగాదనుచుం దక్షిణతనంబుగ దమయంతిని గ్రుచ్చి కౌఁగిలించుకొని తమి దీఱం జెక్కుటద్దంబుల ముద్దు వెట్టుకొనియె. అయ్యవసరంబున సమీపస్థంబగు ద్వారోపర ప్రదేశంబున నుండి వైతాళిక పురంధ్రి, యుచ్చైస్స్వరంబున "మహారాజా! మధ్యాహ్నసమయంబయ్యె. మేదిని యంతయు నుష్ణతమంబై యున్నది; మాధ్యాహ్నికమార్తాండుండు నీ హృదయంబునంబోలె గగనభాగంబున శివస్వరూపుడుగం దనరారుచున్నాఁడు; నీ ప్రతాపంబు భాతి, నీమిడియెండవేడి సహింపం జాలనంతయదిగ నుండుచున్నది; నీలంబులగు నీ నిషాదకులుల గంగాజలంబు ప్రయాగ క్షేత్రంబునందలి యమునాసంగమంబు భాతిం బ్రవహించుఁగాక" యని వచియింప, నలుండు కేళీసౌధంబు

దీర్ఘ మౌనంబున నేతెంచుసమయంబున రాకకై వేచి నిలిచి యున్న యువనీశ్వరు లా సార్వభౌమునకు వందన శతంబు లొనరించి నేత్రాదిక సంజ్ఞల వారల ననుగ్రహించి నిజనివాసంబుల కరుగ నాజ్ఞ యొసంగి మజ్జనశాలం జేరె. అంత కమలేక్షణలు కర్పూరాగురు ప్రముఖమిశ్రంబగు యక్షకర్దమంబు నలుగుపెట్టి కస్తూరిలేపంబు దలనిడి, సువర్ణకలశంబులందలి శుద్ధజలంబు ధారాపాతంబుగ నలావనీశ్వరు మూర్ధంబునం బోయుచుండ, శ్రీమన్నారాయణ పాదోద్భవంబగు గంగానది శిఖరంబునం బడుచుండిన హిమవత్పర్వతంబు మాడ్కి శోభాయమానుండగుచుండె. పదపడి విప్రవర్యు లాధరణీపతికి మంత్రోదకంబుల స్నానంబుం జేయించి వారుణసూక్తంబు లుచ్చరించుచుండ సంకల్పపూర్వకంబుగ యాచమనంబు గావించి గౌర మృత్తికా ద్రవంబు మేనంబూసికొని సాకాశ గంగాతోయంబులం దానంబాడె.

## దేవపూజ

పిదప శిరోజంబులు ముడి యొనరించి సన్నని కాషాయ వస్త్రంబుగట్టి ధౌతపీతాంబరంబు నుత్తరీయంబుగ ధరించి కడుగంబడిన బంగరు బావుకోళ్ళం దొడిగి శైవుండగు బ్రాహ్మణ బ్రహ్మచారి హస్తంబు నవలంబనంబుగాంగ మెల్లగ నడచి శాంతచిత్తుండగు నలుడు మౌనవ్రతంబూని ఫలపుష్ప దీపాదికంబులం బరిశోభితంబగు దేవపూజాగృహంబుం బ్రవేశించి, మణిఖచితంబగు భద్రాసనంబున నత్యంతాసక్తితోం గూరుచుండి యోగమోక్ష ప్రకారంబుగ

శంభులింగపూజఁ గావింపఁ దొడంగి పానవట్టంబుపై బంగరు నుమ్మెత్తపూవు నుంచె. శీర్షంబునఁ దెల్లఁ దామర మొగ్గల దండఁజుట్టె. ఆ మహేశ్వరుని నెట్టిగలువల, మారేడు దళముల, నాగకేసర పుష్పంబుల, గుండవర్ధసంపు సుమంబుల, నుమ్మెత్తపూవుల, నల్లగలువల, బొండుమల్లియ దండల, జేమంతి చెండుల నతిభక్తిమై నా సలుంచు పూజించె. బంగరు పళ్ళెరముల నగ్నియందు గుగ్గిలంబువేసి యా సుగంధ ధూపంబు నా దేవుని సమీపంబున నుంచె. కర్పూరంబు వెలిగించి స్వామికి హారతినిడె; అంత నా నిషధరాజు పద్మాసనస్థుఁడై యనాహత నామచక్ర మధ్యంబున నీశ్వరు నిలిపి పంచాక్షరీ మంత్రంబున జపం బొనరించి భక్ష్య భోజ్య లేహ్య చోష్య పానీయ రూపంబులగు ననే కాహారంబుల శంకరునికి నైవేద్యంబు సేసి, రాజదేవోపచారంబు లొనరించి, మంత్రపుష్పంబు వెట్టి, పరమేశ్వరునకు సాష్టాంగ దండప్రణామం బొనరించె.

అనంతరంబు శ్రీగోవిందు నారాధింప నద్దేవుసన్నిధి కేతెంచి. యాదామోదరుని సిగయందు బంగారు మొగలి రేకులఁ, గర్ణంబులఁదెల్లదామరల, వక్షోభాగంబున నాకులఁ బూవులంబోలెఁ బచ్చలఁ బగడంబుల నిర్మించిన దండఁ, బాద పద్మంబుల గరుడమణులచేఁ గల్పితంబగు తులసీదళంబులఁ, జక్కఁగ ధరియింపఁజేసి, పురుషసూక్తంబుఁ జదివి, యష్టాక్షరీ మంత్రంబు జపంబొనరించి, పాంచరాత్ర గ్రంథవిధానంబుగ నాజనార్దనునిఁబూజనంబు సేసె. ఇందిరానీలకటాక్ష వీక్షణంబులఁ

బోలె, నిందిందిర పక్షమారుత వశంబునఁ జలించు దళంబులు గల నల్లగలువల సరంబు నాదేవు వక్షంబు నలంకరించె; మల్లె మొగ్గలదండ నవయవంబుల నలంకరింప నారాయణుండు తొల్లి కాళీయమర్దన కాలంబునఁ దన్ను జుట్టుకొనిన చుట్టుల నిధంబుఁ దలంపకుండునే? పాదంబుల సమర్పితంబగు విరజాజి పూల మాల తత్పాదోద్భవమగు గంగానదిఁ బోలి ప్రకాశించు చుండె. ఇవ్విధంబున నిషధదేశాధ్యక్షుండగు నలుండు పుండరీకాక్షు నర్చించి ప్రణామంబుఁ జేసి, యద్దేవుని నివ్విధం బున స్తుతించె. "హృషీకేశా! నీవే త్రిలోకనాథుండవు, దేవతా సార్వభౌముండవు; నీవ రాక్షసులం బరిమార్చి దివిజ సంరక్ష ణంబు సేయుచుందువు; నీకుక్షియందే సకల ప్రపంచం బిమిడి యున్నది. నీ పాదంబున గంగ యుదయించి లోకములఁ బావనం బొనరించుచున్నది. నీలమేఘశ్యామా! నీవు "వైజ యంతి, యను మాలిక నలంకారముగ ధరించియుందువు; ఆకర్ణాంత నేత్రుండవు; నీకెల్ల దేవతలుఁ బాదాక్రాంతులగు చుందురు నీ మహిమంబులు బ్రహ్మాదులకైనఁ దెలియఁబడ నప్పుడు మాబోఁటుల కెఱుంగనశక్యము? నిన్నెమని స్తుతింపఁ గలవారము? ఓ దామోదరా! లక్ష్మీదేవియను మెఱుపు, నూత్న మయూరపింఛంబను నింద్రధనస్సు, నపార కరుణయను వర్షంబుఁ, గలిగి విలసిల్లు నీదేహంబను నీలమేఘంబు, నానేత్ర ద్వయ చాతకంబులకు సంసార తాప విఘాటనం బొనరించి, పరితృప్తిఁ గలిగించుఁగాత. విశ్వరూపా! దుర్బలుండగు మనుజుండు, జీర్ణోత్తరీయంబున మేరుపర్వతంబు ముక్కలుగ

నొనరించి కొంచెమేనియుఁ గట్టుకొని పోజాలని విధంబున
ననంతంబులగు నీ మహిమంబుల మాయీ మందబుద్ధి వర్ణింప
సమర్థంబుఁ గానేర" దని యనేకవిధంబులఁ బ్రార్థనఁ జేసి
నమస్కరించె. ఈ ప్రకారంబుగ దేవపూజ నొనరించి భోజన
కార్యంబు నివర్తించి శుద్ధాంతకేళీ సౌధం బధిరోహించి,
కులదైవతార్చనం బాచరించి భుజించియున్న దమయంతీ
మహాదేవితోడం గూడి లక్ష్మీనారాయణులం బోలె నానం
దంబున నొప్పుచు, నిజసతీ శిష్యురాండ్రగు జవ్వనుల సంగీత
ప్రావీణ్యంబుఁ, జిలుకపలుకుల చాకచక్యంబుఁ, గోయిలకు
హూకారంబులఁ; గేళీమయూరంబుల నృత్య ప్రవృత్తం
బును, నాదరాతిశయంబున వీక్షించుచు శృంగార క్రీడల
బ్రొద్దుఁ గడపుచుండిరి.

## సంధ్యా వర్ణనము.

అంత గగనంబను నింద్రనీల పర్వత శిఖరంబునుండి
జాఱిపడు కావిరాయింబోలె నస్తాద్రి కుహరంబుల సూర్యుండు
పడుచుండ నత్తఱి లేచుధాతు పరాగంబువోలె సంజ
కెంజాయలు దోపించుచుండె. ఆ సాయంకాలమున జక్కవ
మిథునంబు వియోగంబు నందుచుండె. వరుణునియొక్క
పశ్చిమదిక్కాంత, పూఁతపసుపుతోడి జలకమాడినదేమో?
యనునటుల సంధ్యారాగం బాక్రమించె కుసుంబావన్నె
యద్దిన వస్త్రంబుభాతి, బంగారు మొలామువేసిన లోహంపు
వస్తువుమాడ్కి గగనం బెట్టని కాంతినొప్పె. ఆ కాలంబున
మహాతాండవంబొనరించు శంకరుని విచ్ఛిన్న హారంబునందలి

యెమకలో యనునటుల గగనంబునఁ దారకాగణం బుద
యించె. మఱియు నియ్యది మందాకినీ నదీతరంగముల
తుంపురులో? ఆకాశమనెడి సముద్రమందలి యిసుక
తిన్నెలో? రాత్రియను కాంత కొప్పునం దలంకరించుకొన్న
క్రొవ్విరులో? యనుచు లోకంబు సందేహమందుచుండ
గగన భాగంబున నక్షత్రము లనంతముగ విరాజిల్లుచుండె.
కాటుకమాదిరి నంధకారంబు లోకంబంతయు నాక్రమించె.
అంత నా నలసార్వభౌముండు, నిశాముఖోచిత క్రియాకలా
పంబులన్నియు నిర్వర్తించి యుండుటంజేసి క్రీడా సౌధాగ్ర
భాగంబునకు దమయంతీ సమేతంబుగా నరిగి యచ్చోట నంతః
పుర కాంతాజనంబు పరివేష్టింపఁ గొలువుదీర్చి యుండె.

చంద్ర వర్ణనము.

ఆతరుణంబున నుదయంబగుచున్న పూర్ణేందు బింబముం
గాంచి సతీరత్నంబుతో నిట్టులనియె. కాంతా! సాయంకాల
మను మోసగాఁడు మేల్మిబంగారు ముద్దయగు సూర్యుని లాగి
కొని పూఁతపసిండిగుండగు నిండుచందురు నొసంగి జగంబునెల్ల
వంచించుచున్నవాఁడు; ఇదె చూడుమప్పుడే తెల్లఁబాఱు
చుండె. ఈవిధూదయంబున సప్తసముద్రంబు లుప్పొంగు
చుండు, చంద్రకాంతపుఱాలు ద్రవీభూతంబులగుచుండు;
ఆకాశంబను సముద్రంపు నురుగో యనునటుల నీవెన్నెల
యెంతమనోహరంబుగ నున్నది? దేవీ? హిమాంశుం డాకాశం
బను ఫలకంబునఁ, దమంబను మసితోఁ బూతయొనరించి,
యందు మిత్రుండగు మదనుని శౌర్యపరాక్రమంబులఁ గిరణం

బులను బలపంపు ముఖంబుల ముత్యంబులవోలె నక్షత్రపంక్తుల
వ్రాయుచున్నాఁడు; ఈ ద్విజరాజు కల్పవృక్షంబు సహోదరుం
డగుటఁ ద్యాగగుణంబున శంకరాది దేవతాబృందంబునకుఁ
జకోరంబులకుఁ గళామృతంబుల నొసంగుచున్నాడు. రాహు
వను మహాభుజంగ మొడినుండు లేడిని మ్రింగనాసక్తిఁగొని
హరిణాంకునిఁ గబళించి, ప్రాణాపాయ సమయంబునఁగూడ
నాసారంగముఁ బాయనందులకు మెచ్చిగాదె? శరీర మించుకేని
గందకుండ నాతని విడిచిపెట్టు; ఆశ్రితవత్సలతయనిన నటులగదా
యుండవలయు. ఈ లీలా వనంబునందలి లతాదికంబుల
క్రీనీడయు, వెన్నెల ధావళ్యంబుఁ దిల తండుల న్యాయం
బుగ విరాజిల్లుచున్నయది. కమలనయనా! తండ్రియగు
సముద్రునిబోలె నీచంద్రుండు, శుక్ల బహుళపక్షంబుల వృద్ధి
క్షయంబుల నందుచుండు. పితరుని గుణంబు కుమారుఁజెందుట
న్యాయంబై నదియ; పుణ్యాత్ముని కళ్యాణగృహంబున నతిథులు
తనియునటు లీతని యమృతంబున దేవతలు తృప్తివహించు
చుందురు. తరుణీ! కుముదబాంధవ బింబమునందలి నైల్య
మోషధీశుండగు నాతని సేవించుటకై యేతెంచు మందు తీవలఁ
గడుపారమేసి, రోహిణీసతి గారవంబునఁ బెంప నమృతంబుఁ
ద్రావుచుఁ దనరు లేడియ కావలయు. గాని-చోఁ గుందేలయి
యుండనోపు. జనకుండగు క్షీరసముద్రునకు నుచ్చైశ్శ్రవంబును
నైరావతంబుఁ గలుగఁ గుమారున కొక్కకుందేలు లభియించు
టాశ్చర్యమా? నారీమణీ! ఆసుధాకరునకు వెన్నెలయుఁ, జీకటి
రాత్రియునని యిర్వురు భార్యలుగలరు. వారిగౌరవార్థముగఁ

దెలుపు నలుపుఁగల మేనుధరించి యుండనోపు. విచారింపఁగా నితండు మణి మంత్రౌషధంబులు లభ్యంబుగానుండియు, గళాక్షీణంబగు క్షయరోగంబుఁ బాపుకొనలేకున్నాఁడు; పూర్వకర్మ మెంతటివారికేని యనుభవింపక తీఱునా? దేవి! కళంక సహితుండగు చంద్రుండు నీవదనంబునకు సాటి రాజాలఁడుసుమా! నిక్కంబుగ నీముఖ మిందుబింబకమలంబుల నధఃకరించి శోభాయమానంబుగఁ దలిర్చుచున్నయది. బింబాధరీ! ఈ యాకాశము, ఛాయామార్గమును భుజంగహారమును, నక్షత్రసమూహంబను పునుకతొడవులను, వెన్నెలయను విభూతిధారణంబునఁ దెల్లనియదియై శంకరునిభాతి విరాజిల్లుచున్నది. నీవ యది పరికింపుము. మానవతీ! ఈశ్వర శిరఃపుష్పంబును, నారాయణవామనేత్రంబును, గగనశ్రీకి దంతంపుఁ గర్ణభూషణంబుఁ, గలువచుట్టంబును, మన్మథమిత్రుండును, లక్ష్మీదేవ్యనుజన్ముండును, సమస్తలోకానందకరుండును నగు చందమామ ప్రపంచమున కెల్ల శుభంబులు సమకూర్చుఁగాత; మనుచు నిజకులాలంకారుండును, రోహిణీమనోహరుండునగు నా కలానిధికి దమయంతీ సమేతంబుగాఁ బుష్పాంజలి సమర్పించి, హస్తాలంకార మణిభూషణంబు లావెన్నెలఁ దళతళ లాడుచుండ నా నలావనీశ్వరుండు పాణిపద్మంబుల మొగిడ్చి ఫాలతలంబునఁ గీలుఁగొలిపె.

## ఉ ప సం హా ర ము.

ఇవ్విధంబున నాదంపతు లనురాగసంపద వర్ధిల్లుచుండ నధిక తరంబులగు రాజ్యసుఖంబుల ననుభవించుచుండిరి. ఆతని

పరిపాలనంబున బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రజాతులవారలు స్వీయధర్మంబుల నాచరించుచుండిరి. చోరాగ్ని జ్వరపిపాసాదుల భయంబులేకుండె. మేఘాధినాథుండగు నింద్రుండు కాలోచితంబులగు వర్షంబులఁ గురియించుచుండె. దేశంబులు ధనధాన్య సమృద్ధంబులయియుండె. గోవులు చక్కని పాల నొసంగుచుండె. వృక్షంబులు పత్రపుష్ప ఫలసమేతంబులై మకరందముం గురియించుచుండె. ఇట్టి శుభలక్షణంబులు గలిగియుండ సకలజనంబులు పరమానందంబున వర్ధిలుచుండిరి. నలుండుఁ బుణ్యశ్లోకుండగుట, దమయంతి పతివ్రతా తిలకంబౌటఁ దచ్ఛుభచారిత్రంబుఁ గావ్యంబుగాఁ గూర్చినట్టి యీ గ్రంథంబుఁ బఠించువారలు కలిదోష రహితులై యాయురారోగ్య సౌభాగ్య విద్యావివేకంబులు గలిగి సుఖంబుండుదురుగాత.

సమాప్తము.

రామకృష్ణ ప్రింటింగువర్క్సు, తెనాలి.

# సుగుణమణి పండితాభిప్రాయములు.

అయ్యా,

మీ సుగుణమణియందు మూఁడు ప్రకరణములవఱకును ప్రత్యక్షరమును జదివితిని. కథాసందర్భాదులయందు సర్వవిధములఁ దనపేరు సార్థకమగునటు లున్నదనుటకు సందియములేదు.

కడియము
26-10-19

గ్రహింపుఁడు,
చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి.
శతావధాని.

అయ్యా,

మ. జనసంఘంబునఁ గాలుపెట్టిన దురాచారప్రభూతంబుఁ జే
కొనితోడ్తోఁ బసివట్టుకుండెఁ గనుముక్కుంగోసి, దుర్నీతులన్
వినకుండన్ వచియింపకుండ జెవులన్ వ్రేల్నాలుకం ద్రుంచి మిం
చిన మోదంబిడు నిట్టి గ్రంథములె వ్రాసింగూర్పనేఁ గోరెదన్.

ఏలూరు
16—3—20

ఇట్లు,
రాజా యమ్. భుజంగరావు.

అయ్యా,

సుగుణమణి నిర్దుష్టమై నీతిదాయకమై పఠనీయమై యున్నది.

గరికిపాడు
పొన్నూరు పోస్టు
16—5—20

ఇట్లు,
శిష్టా హనుమచ్ఛాస్త్రులు,
గుంటూరు టౌను హైస్కూలు తెలుగు పండితులు.

అయ్యా,

సుగుణమణి యామూలాగ్రముగ జదివితిని. సంఘసంస్కారణ కిది యొక గొప్ప యుపకృతి. సుగుణమణి సుగుణముల తేటపరచి, పెక్కు నీతులను గొప్ప యాదర్శములను జదువరుల హృదయ ఫలకముల లిఖింప జాలు నీచిన్ని పొత్తము సంస్తవనీయము. తప్పక హైస్కూళ్ళలోను కాలేజీల లోను గూడ పఠన గ్రంథముగ నుంచదగియున్నది.

ఇట్లు,

హైదరాబాదు
22—5—24

సరిపెల్ల విశ్వనాథశాస్త్రి,
ఆక్టింగు తెలుగు ప్రొఫెసరు
నైజాము కాలేజి.

అయ్యా,

సుగుణమణి నిర్దుష్టము. శైలివ్యాసుమధురము. కల్పన సమంజసము.

పిఠాపురము,
5—10—18.

రామకృష్ణకవులు,
శతావధానులు.

---

అయ్యా,

సుగుణమణి సంఘదురాచారముల ఘోరపరిణామములను చక్కగ సూచించుటచే సంఘసంస్కార సహకారి. శైలి సరసముగ నున్నది. హైస్కూళ్లలో పఠనీయ గ్రంథముగ నుంచుట కెంతయు దగియున్నది.

హాయిద్రాబాదు
19—4—24

శేషగూరి హానుమంతరావు
హిస్టరీ లెక్చరరు
నిజాంకాలేజి, హైదరాబాదు.

అయ్యా,

తామంపిన సుగుణమణిని సాంతముగ జదివితిని. శైలి వ్యాసుమధుర ముగను భావగర్భితముగనుండి ఆంధ్రభాష నభ్యసించు బాలుర కెంతయో నుపయోగముగ నున్నది. సాంఘికదురాచారముల రూపుమాపునట్టి కల్పనా కథ లెన్నియో బయల్వెడలవలెను. ఇయ్యది పాఠశాలలలో బఠనీయ గ్రంథ ముగా గైకొనదగియున్నది.

సికిందాబాదు
25—3—24

జొన్నవిత్తుల వేంకటశాస్త్రి,
భాషాంతరీకరణోపాధ్యాయుడు.
వెస్లెయను హైస్కూలు.

---

మహబూబు కాలేజి తెలుగుపండితులును భాగవత బాలనీతి మొదలగు గ్రంథకర్తలునగు చివుకుల అప్పయ్యశాస్త్రిగారు తెలిపినది.

అయ్యా,

తమరంపిన సుగుణమణియను నవల సమగ్రంబుగా జదివితిని. ఇది చక్కని శైలిని, భాషను, గధాసంవిధానంబును గలిగి దురాచారంబులను నిర్మూలించుచు సదాచారంబుల నెలకొల్పజాలి పాఠశాలలలో కక్షులలోని బాల బాలికల కవశ్య పాఠ్యంబైయున్నదని నాయాశయము.

9—4—24

చివుకుల అప్పయ్యశాస్త్రి.

---